నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 9-11-2023 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No.L1/HQ/SD/258/2021-2023 సంపుటి :30 సంచిక:77 పేజీలు:6 వెల: రూ.1/-

నమ్మలేని నిజాలు

కొంగ కుళీరం
ఉన్నదంత త్వం స్వహా
వంచక తంత్రం

రాకెట్ల దాడి
ద్వేషాల వాడి వేడి
పిల్లలు బలి

గంగమునక
పాపాల పరిహారం
మతాచరణ.

బుద్ధికి చేవ
విద్యార్థులకు జావ
మెరిట్లు రావా?

తాగకు బ్రాందీ
మనుగడకు నిప్పు
చెప్పాడు గాంధీ

– రేడియమ్
సెల్: 9291527757

నీనిజాలు

బీ జే పీ బీ ఆర్ ఎస్
ఒక్కటే రెండూ !
అంటుందోయ్ కాంగిరేసు
తేలాలని గుండు !.

బీఆర్ఎస్ పై ప్రధాని
లిక్కర్ మీద లింకులు !
మోది మీద బీఆర్ఎస్
రణరంగపు బొంకులు !

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

ఢిల్లీలో తీవ్ర వాయు కాలుష్యం.. పాఠశాలలకు శీతాకాల సెలవులు ప్రకటించిన ప్రభుత్వం

న్యూఢిల్లీ, నవంబర్ 8: దేశ రాజధాని ఢిల్లీ కాలుష్య కోరల్లో చిక్కుకుంది. చుట్టు పక్కల రాష్ట్రాల్లో పంట వ్యర్థాలను తగలబెట్టడంతోపాటు ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఢిల్లీలో గాలి నాణ్యత ప్రమాదకర స్థాయికి పడిపోయింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం తాజాగా కీలక ప్రకటన చేసింది. రాజధానిలో తీవ్ర వాయు కాలుష్యం నేపథ్యంలో ఢిల్లీలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు శీతాకాల సెలవులు ప్రకటించింది. నవంబర్ 9 నుంచి 18వ తేదీ వరకూ అన్ని పాఠశాలలకు ముందస్తు శీతాకాల సెలవులు ప్రకటిస్తున్నట్లు విద్యశాఖ ప్రకటన విడుదల చేసింది. సాధారణంగా ఢిల్లీలో పాఠశాలలకు శీతాకాల సెలవులు జనవరిలో ఇస్తుంటారు. అయితే, ఈ సారి తీవ్ర వాయు కాలుష్యం కారణంగా ముందుగానే ప్రకటించారు.

ఢిల్లీలో వాయు కాలుష్యం కొనసాగుతోంది. కాలుష్యానికి తోడు పెద్ద ఎత్తున పొగమంచు నగరాన్ని కమ్మేస్తోంది. దీంతో నగరంలో గాలి నాణ్యత భారీగా పడిపోయింది. పంజాబీ బాగ్‌లో గాలి నాణ్యత సూచీ (ంఖిఎ) 460కి చేరింది. ఆనంద్ విహార్‌లో 452, ఆర్‌కేపురంలో 433గా నమోదైందని సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ పేర్కొంది. ఢిల్లీ అంతటా గాలి నాణ్యత అధ్వానంగా కొనసాగుతోందని పేర్కొంది.

కాలుష్యం నేపథ్యంలో ఢిల్లీతో పాటు నేషనల్ క్యాపిటల్ రీజియన్ పరిధిలోని గౌతమ్‌బుద్ధానగర్, ఘజియాబాద్‌లో ఉన్నత పాఠశాలలను ప్రభుత్వం ఇప్పటికే మూసివేసింది. రాబోయే ఆరురోజుల పాటు ఢిల్లీలో వాతావరణం మరింత అధ్వాన్నస్థాయికి చేరుకుంటుందని అంచనా. ఉష్ణోగ్రతలు పడిపోయే అవకాశం ఉందని.. దాంతో కాలుష్యం స్థాయి మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే, నవంబర్ 10న ఢిల్లీలో తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం పేర్కొంది. 13వ తేదీ వరకు ఉదయం వేళల్లో పొగమంచు పేరుకుపోతుందని పేర్కొంది.

ఆరేపల్లిని గెలిపిస్తేనే అభివృద్ధి- బండి సంజయ్

కరీంనగర్, నవంబర్ 8:ఆరెపల్లి మోహన్ పక్కా లోకల్ అని.. ఆయనను గెలిపిస్తే మానకొండూరు సమగ్రాభివృద్ధి చెందుతుందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. మానకొండూరు బీజేపీ అభ్యర్థి ఆరెపల్లి మోహన్ నామినేషన్ కార్యక్రమానికి బండి సంజయ్ హాజరయ్యారు. అరేపల్లి మోహన్ పక్కా లోకల్ అని, ఆయనకు మానకొండూరు నియోజకవర్గంలోని గల్లీగల్లీ పట్ల అవగాహన ఉందన్నారు. సమస్యలన్నీ తెలుసన్నారు. ఆయనను గెలిపిస్తే అభివృద్ధి జరుగుతుందన్నారు. ఇక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే కమిషన్ల యావతో మిమ్మల్ని పట్టించుకోవడం మానేసిందన్నారు. తగిన గుణపాఠం చెప్పండంటూ బండి సంజయ్ కుమార్ మానకొండూరు ప్రజలకు పిలుపునిచ్చారు.

ఈరోజు మధ్యాహ్నం బీజేపీ మానకొండూరు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి ఆరెపల్లి మోహన్ దాఖలు చేసిన నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మానకొండూరు చెరువు నుండి ఎమ్మార్వో కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం భారీ ఎత్తున హాజరైన ప్రజలను ఉద్దేశించి బండి సంజయ్ ప్రసంగించారు.

ఉచిత హామీలిస్తున్న పార్టీలపై వెంకయ్యనాయుడు గరగరం ..

హైదరాబాద్, నవంబర్ 8: ఎన్నికలలో గెలిచేందుకు ఉచిత హామీలిస్తున్న రాజకీయ పార్టీల పట్ల మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. . అధికారంలోకి వస్తే ఇచ్చిన హామీలను నెరవేర్చగలమా? లేదా? అందుకు తగిన ఆర్థిక వనరులు ఉన్నాయా? అని అంచనా వేయకుండానే పార్టీలు ఉచిత హామీలు గుప్పిస్తుంటాయని విమర్శించారు. ఎన్నికల్లో ఉచిత హామీలకు తాను పూర్తిగా వ్యతిరేకమని పేర్కొన్నారు . దేశంలో పేద, మధ్య తరగతి, అంతకంటే దిగువన ఎంతోమంది జీవిస్తున్నారని పేర్కొన్న ఆయన పేదలకు ఉచిత ఆహార ధాన్యాల పంపిణీ హామీపై మాత్రం హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని హామీని స్వాగతిస్తున్నట్టు చెప్పారు.

దేశరాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యంపై మాట్లాడుతూ.. కాలుష్య నియంత్రణ ఒక్క ఢిల్లీ ప్రభుత్వానిదే కాదని, కేంద్రంతోపాటు పక్క రాష్ట్రాలూ బాధ్యత తీసుకోవాలన్నారు. ఢిల్లీలో అన్ని రాష్ట్రాల ప్రజలు జీవిస్తున్నారని, రాష్ట్రాలతో సమన్వయం చేసుకుంటూ కాలుష్య నియంత్రణకు కేంద్రం చర్యలు తీసుకోవాలని వెంకయ్యనాయుడు కోరారు.

నేటి కందం– నేటికి అందం

కం॥ చెరువవుల కాదుదుగ
వరగిరుసుమ్మైన నజము బయటపడుటకై
పరువగ వవెప్రతియెకరు
చెరువవ్వులు వెలయ స్వాయ సేవల దినమునన్॥

–రాధశ్రీ
(నవంబర్ 9: జాతీయ న్యాయ సేవల దినం..) సెల్:9494481210

ఎవరు గెలిస్తే మంచిదో నిర్ణయించి ఓటేయాలి.. : సీఎం కేసీఆర్

కాగజ్‌నగర్ , నవంబర్ 8:ఎన్నికలు వచ్చినప్పుడు ఆగమాగం కాకుండా.. ఎవరు గెలిస్తే మంచిదో నిర్ణయించి ఓటేయాలి.. ఆషామాషీగా, అలవోకగా ఓటు వేయొద్దని ముఖ్యమంత్రి కేసీఆర్ సూచించారు. సిర్పూర్ కాగజ్‌నగర్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు.

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు అయింది. కానీ ఇప్పటి వరకు కూడా ప్రజాస్వామ్య ప్రక్రియ రావాల్సిన పరిణితి రాలేదు. ఏ దేశాల్లో అయితే ప్రజాస్వామ్యం లో పరిణితి వచ్చిందో ఆ దేశాలు చాలా బాగా ముందుకు పోతున్నాయి. మన దేశంలో ఇంకా ఆ పరిస్థితి లేదు. రావాల్సిన అవసరం ఉంది. ఎలక్షన్లు చాలా వస్తాయి పోతాయి. ఎన్నికల్లో ఎవరో ఒకరు గెలుస్తరు అందరికీ తెలసు. మీరు చాలా సార్లు ఓట్లేశారు. ఇప్పుడు ఎన్నికలు వచ్చాయి. ప్రతి పార్టీ తరపున ఒకరు నిలబడుతారు. కోనప్ప బీఆర్ఎస్ తరపు ఉన్నారు. 30న ఓట్లు పడుతాయి. 3న లెక్కింపు అయిపోతది. ఫలితం తేలుతుందన్నారు కేసీఆర్.

మీరు నిర్ణయం తీసుకోవాల్సి ఏందంటే అభ్యర్థి గుణగణాలు, సేవాతత్వం గురించి ఆలోచన చేయాలి. ఆ అభ్యర్థుల వెనుకాల ఏ పార్టీ ఉంది. వాటి చరిత్ర విధానాలు, ప్రజలు, రైతుల గురించి ఏం ఆలోచిస్తుంది..? అధికారం వస్తే ఎలా ప్రవర్తిస్తారో ఆలోచించాలి.

ఎన్నికలు అయిపోగానే ప్రక్రియ ఆగిపోదు. ఇక్కడ గెలిచే ఎమ్మెల్యేతో రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడుతుంది. మీ ఓటు వజ్రాయుధం, చాలా విలువ ఉంటది. ఐదేండ్లు మీ తలరాతను రాస్తది. భవిష్యత్‌ను నిర్ణయిస్తది. అందుకే జాగ్రత్తగా ఓటు వేయాలి. ఆషామాషీగా, అలవోకగా వేయొద్దు. మంచి ఆలోచించే వారికి ఓట్లు వేయాలి. ఏ ప్రభుత్వం ఏం చేసిందో లెక్క తీసి ఓట్లు వేస్తే లాభం జరుగుతది. ప్రజాస్వామ్య పరిణితి పెరిగి, విచక్షణ జ్ఞానంతో ఎవరు గెలిస్తే మంచిదో నిర్ణయించి ఓటేయాలి అని ప్రజలకు కేసీఆర్ సూచించారు.

కాంగ్రెస్‌కు ఎందుకు ఓటేయాలి..? ప్రశ్నించిన మంత్రి తలసాని

హైదరాబాద్, నవంబర్ 8: కాంగ్రెస్ పార్టీకి ఎందుకు ఓటేయాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రశించారు. నగర పరిధి లోని ముషీరాబాద్, అంబర్‌పేటలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులతో కలిసి మంత్రి ఇంటింటి ప్రచారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ 130 సంవత్సరాల చరిత్ర ఉన్న కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో ప్రజలు బొందపెడుతారన్నారు. దశాబ్దాల పాటు అధికారంలో ఉండి ప్రజలకు ఏం చేశారో చెప్పే ధైర్యం ఉందా? అంటూ ప్రశ్నించారు.ఓటమి తప్పదనే భయంతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పోటీ నుంచి తప్పుకున్నారని విమర్శించారు. రెండుసీట్లు గెలిచిన బీజేపీ బీసీని ఎలా ముఖ్యమంత్రిని చేస్తుందని నిలదీశారు. కేంద్రమంత్రిగా పార్లమెంట్ నియోజక వర్గంలో గానీ.. అంబర్‌పేట నియోజకవర్గంలో కానీ ఎన్ని నిధులు ఖర్చు పెట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు. మళ్లీ రాష్ట్రం అధికారంలో వచ్చేది ముమ్మూటికి బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. అన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు యథావిధిగా కొనసాగుతాయని స్పష్టం చేశారు.

మంత్రి హరీశ్ రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు

సంగారెడ్డి, నవంబర్ 8: సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. తాజాగా సంగారెడ్డి జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి చింతల గట్టు సుధీ, కోహిర్ మాజీ ఎంపీపీ జంపాల అనిత ముదిరాజ్, తెలంగాణ విద్యార్థి పరిషత్ నియోజకవర్గం అధ్యక్షుడు సంపత్, నాయకులు కృష్ణారెడ్డి, వార్డు మెంబర్ రవికుమార్, ప్రణయ్, సునీల్, కన్న తదితరులు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి మంత్రి హరీశ్ రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.వారికి మంత్రి గులాబీఆ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమ న్నారు. కాంగ్రెస్ బీజేపీ పార్టీలకు ఓటేస్తే వచ్చే ప్రయోజనం ఏమీ లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీలోనే ప్రతి కార్యకర్తకు సముచిత గౌరవం లభివస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతిని ధులు, పాల్గొన్నారు.

రైల్వే అధికారుల నిర్లక్ష్యం : శవంతోనే 600 కిలోమీటర్లు ప్రయాణించిన పాసింజర్లు

చెన్నై, నవంబర్ 8: తమిళనాడులో సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ ప్రయాణీకులకు శవంతోనే దాదాపు 600 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వచ్చింది. రైలు జనరల్ కోచ్‌లో ఓ వ్యక్తి మరణించడంతో ప్రయాణీకులు అధికారుల దృష్టికి తీసుకువచ్చినా రైల్వే అధికారులు పట్టించుకోకపో వడంతో శవంతోనే ప్రయాణీకులు సుదీర్ఘ ప్రయాణం సాగించారు.

రైలు చెన్నై నుంచి హజ్రత్ నిజాముద్దీన్ వెళుతున్న క్రమంలో చెన్నైలో పనిచేసే యూపీలోని బందా జిల్లాకు చెందిన రంజిత్ యాదవ్ మార్గమధ్యలో మరణించాడు. ప్రయాణీకులు రైల్వే అధికారులకు సమాచారం అందించినా రైలు యూపీలోని ఝాన్సీకి చేరేవరకూ మృతదేహాన్ని తొలగించలేదు. రంజిత్ యాదవ్ అస్వస్థతతో బాధపడుతూ తన బావమరిది గోవర్ధన్ సాయంతో స్వస్థలానికి వెళుతున్నాడు.రైలు నాగ్‌పూర్‌కు చేరుకునేసరికి తీవ్ర అస్వస్థతకు లోనైన రంజిత్ హఠాన్మరణానికి గురయ్యాడు. రైల్వే అధికారులకు పలుమార్లు ప్రయాణీకులు సమాచారం అందించినా వారు పట్టించుకోకపోవడంతో రంజిత్ మృతదేహంతోనే వారు ఏకంగా దాదాపు 600 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వచ్చింది.

మంత్రి గంగుల కమలాకర్‌కు ఊరట.. ఆ పిటిషన్‌ను కొట్టివేసిన కోర్టు

హైదరాబాద్, నవంబర్ 8: మంత్రి గంగుల కమలాకర్ కు భారీ ఊరట లభించింది. ఆయన ఎన్నిక చెల్లదంటూ దాఖలైన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. ఈసీ నిర్ధారించిన వ్యయానికి మించి గంగుల ఖర్చు చేశారని కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ హైకోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై కోర్టు తాజాగా విచారణ జరిపింది. విచారణ సందర్భంగా ఇరువైపులా వాదనలు విన్న ధర్మాసనం.. సరైన ఆధారాలు లేవంటూ పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది. 2018 ఎన్నికల్లో గంగుల పరిమితికి మించి ఎన్నికల ఖర్చు చేశారని పొన్నం ప్రభాకర్ పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. ఆ ఎన్నికల్లో పిరమితికి మించి ఖర్చు చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటర్లే సారథులు

(నేదునూరి కనకయ్య–9440245771

రాజకీయాలు అంటే అవి నాయకులకే పరిమితమైనవని సాధారణ పౌరసమాజం రాజకీయాల పట్ల ఆసక్తి శ్రద్ధ పెట్టకపోవడం శోచనీయం. బ్రిటిష్ పాలన విముక్తి కొరకు జరిగిన పోరాటాల్లో ప్రాణాలకు తెగించి పోరాడిన భారత దేశ ప్రజలు స్వాతంత్ర్య అనంతరం రాజకీయాలపట్ల ఉదాసీన వైఖరి అవలంభించడం వల్ల రాజకీయాలు నేరచరితుల రౌడీల మాఫీయాల ధన స్వాముల పరమైనాయి.

రాజకీయాలు నాయకులకు మాత్రమే రిజర్వ్ చేయబడ్డాయన్న మానసిక భావన సమాజంలో స్థిరపడి పోయింది.

మనం రాజకీయాల గురించి పట్టించుకోక పోయిన మన సమాజములో ఆర్థిక సామాజిక సాంస్కృతిక 'సాంఘిక ఉద్యోగ ఉపాధి పెట్టుబడి ఉత్పత్తి ఉత్పాదకత స్వదేశీ విదేశీ వర్తకం వ్యాపారం విద్య వైద్యం ఆరోగ్యం విదేశీ విధానాల రూపకల్పనలో మౌలిక మార్పులు తెచ్చి మన జీవితాలను భవిష్యత్తును మన పిల్లలభవిష్యత్తును మార్చ గలిగేది రాజకీయాలు మాత్రమేనన్నది చారిత్రిక వాస్తవం .

మనిషి రాజకీయ జీవి
మనిషి పుట్టుకతో సంఘజీవి

అధికారం కోసం రాజకీయ జీవి. అవసరాల కోసం ఆర్థిక జివి. పుట్టుకతో పలు రకాల పాత్రలు పోషిస్తాడు .

ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు

ప్రజలు తమకున్న ఓటు హక్కుతో ఐదు సంవత్సరాల పదవీ కాలానికి ప్రజా ప్రతినిధులను ఎన్నుకొని ప్రభుత్వాల ఏర్పాటులో క్రియా శీలకంగ పాల్గొంటారు. ఓటు అనే ఆయుధంతో ఓటరు తమ ఆకాంక్షలు అవసరాలు తీర్చే ప్రభుత్వాలకు అధికారం ఇస్తాడు .

అభివృద్ధి సాధకును ఎన్నుకోవాలి

జాతి తల రాతలు మార్చే సమాజ సేవకులను సామర్థ్యం, సత్తాగల అభివృద్ధి సాధకులను చట్ట సభలకు అభ్యర్థులుగా ఎన్నుకోవాలి. ఓటు వేసే ముందు గత ఎన్నికల్లో పార్టీలు ఇచ్చిన వాగ్దానాల అమలును ఎన్నికల మేనిఫెస్టో పట్ల ఆలోచించాలి.

తల రాతను మార్చేది ఓటు

బాధ్యత గల పౌరుడిగా మన జీవితాన్ని తద్వారా జాతి తల రాతను మార్చేది మన ఓటుతోనే వీలవుతుందనే వాస్తవాన్ని మరువరాదు. ఎవరికి ఓటు వెయ్యాలి ? ఎందుకు ఓటు వేయాలి? జాతి భవిష్యత్తు, దేశఐకృతా, సమగ్రత దేశ సార్వభౌమాధికార రక్షణ భద్రత దేశ రక్షణ ఆర్థిక వ్యవస్థ స్వయంసమృద్ధి సుస్థిరాభివృద్ధి ఉపాధి ఉత్పాదక సామర్థ్యం ప్రజల జీవన ప్రమాణాల స్థాయిని మెరుగు పరిచే పార్టీ అభ్యర్థులను చట్ట సభ సభ్యులుగా ఎన్నుకోవాలి. రాజకీయ పార్టీల విదానాలు సిద్ధాంతాలు కట్టుబాట్లు నిబద్ధత నిజాయితీ ప్రజా సమస్యల పరిష్కారం కోసం అవలంబించే రాజకీయ వ్యూహాలు ఉద్యమాలను పరిశీలించాలి . ఏ పార్టీ, మన దేశాన్ని, మన ధర్మాన్ని రక్షించడానికి కట్టుబడి ఉంది? ఏ పార్టీ లంచగొండితనంతో కూరుకుపోయి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తుంది. అభివృద్ధి సంక్షేమం పేరున అమలౌతున్న పథకాల ప్రయోజనాలు అధికారంలో ఉన్న వారి కుటుంబానికి లబ్ధి చేకూరుస్తున్నాయనే అంశాల మీద ఓటర్లు అవగాహన కలిగి వుండాలి . సహజ వనరులు మానవ వనరుల అభివృద్ధికి ఉపయోగపడే దీర్ఘ కాలిక ప్రయోజనాలకు పెద్ద పీట వేసి పేదరికం నిరుద్యోగం తగ్గించి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచే సరైన పార్టీకి ఓటు వేసి ప్రగతి శీల సమాజ స్థాపనకు చేయూత నివ్వాలి. మన ఓటుతోనే ప్రభుత్వాలు ఏర్పడతాయి! మనం ఓటు వేసేది ఎవరికో అధికారం ఇవ్వటానికి కాదు. మన జాతి తల రాతను మార్చి ఉజ్జ్వల భవిష్యత్తు కోసం ఓటరు ఓటు వేసే ముందు పార్టీల మేనిఫెస్టో అంశాలు

నిర్ణీత పదవీ కాలంలో అమలు అవుతాయా? లేదా? తెలుసుకోవాలి

రాజకీయాల పట్ల ప్రతి పౌరుడు ఆసక్తి అవగాహన కలిగి వుండాలి. మనం రాజకీయం చేయక పోయినా రాజకీయాలు తెలుసు కోవటం నేటి తక్షణ అవసరం .

ఓటు బుల్లెట్ కంటే బలమైంది(ఓటు నిశ్శబ్ద విప్లవం)

దేశ రాజకీయాలకు వెగటు పుట్టిస్తున్న ధన, రౌడీ రాజకీయాలతో పరువు మాస్తున్న ఎన్నికల ప్రక్రియను ప్రక్షాళన చేయడానికి తమ ఓటు హక్కు వినియోగం ద్వారా అవినీతి అక్రమాల చెర లోంచి జనస్వామ్యానికి స్వేచ్ఛ ప్రసాదించే ప్రజా ఉద్యమానికి విజ్ఞత గల ఓటర్లు నేతృత్వం వహించాలి. ఓటు బుల్లెట్ కంటే బలమైంది. ఓటు ఒక నిషబ్ద విప్లవం ఓటే మన ఆయుధం! దానితోనే మనం పోరాడాలి. మన ధర్మాన్ని మనం నిలబెట్టుకోవాలి! మన బతుకులు మనం చక్కపరచుకోవాలి!

రాజకీయాలలో ప్రతి పౌరుడు క్రియా శీలక భాగస్వామి కావాలి . రాజకీయాలగురించి చర్చించాలి .

నోటుకు ఓటు అమ్ముకో వద్దు

ఓటు వేసే ముందు విజ్ఞత ఓటరు రాజకీయ పార్టీల హామీల ఓట్ల వేలం పాటల హోరులో హైరానా పడి నోటుకు ఓటు అమ్ముకోవద్దు.

మన కులం వాడని, మన జిల్లా వాడని, మన ప్రాంతం వాడని ఓటు వేయకండి!

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి ఏపార్టీ వాడని చూడకు ఏ పాటి అభివృద్ధికి పాటుపడే వాడో ఆలోచించు.నీతినిజాయితీగా పనిచేసేవాడికి, అవసరమైనప్పుడు జాతి భవిష్యత్తు అభివృద్ధికి సంక్షేమానికి దేశ రక్షణలో క్రమశిక్షణ కలిగిన సైనికుడిగా అండగా నిలబడే పార్టీకి పేద బడుగు బలహీన వర్గాల జీవితాలలో జీవన ప్రమాణాలు మెరుగుపరిచే నూతన అభివృద్ధి వ్యూహా లతో ముందుకు వచ్చే పార్టీకి అభ్యర్థులకు ఓటు వేయండి

ప్రజా సంక్షేమానికి పాటు పడని నేతలను ఓటు ద్వారా నిగ్గ తీయండి. ప్రజా ఆకాంక్షలు తీర్చని వారిని శంకర గిరి మాన్యాలు పట్టించే శక్తిని సమకూర్చేది ఓటు హక్కేనని విజ్ఞత గల ఓటర్లు.గుర్తించాలి. ఓటర్లు జాతి తల రాతను మార్చి రాసే విధాలుగా అవతరించాలి. ప్రజాస్వామ్య రక్షణ ప్రతి ఓటరు సామాజిక బాధ్యతగా గుర్తించాలి. ప్రజాస్వామ్యాన్ని జనస్వామ్యంగా మార్చే ప్రక్రియలో ఓటర్లు సారథులుగా నిలువాలి.

కండ్లముందు జరిగిన అభివృద్ధిని చూసి కారుగుర్తుకు ఓటేయండి : మంత్రి ఎర్రబెల్లి

వరంగల్, నవంబర్ 8:బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ పాలకుర్తి నియోజకవర్గం అభ్యర్థి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. జిల్లాలోని రాయపర్తి మండలం రాగన్నగూడెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమల్లోకి తెచ్చిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.

కండ్ల ముందు జరిగిన అభివృద్ధి చూసి ఆలోచన చేయాలన్నారు. బీఆర్ఎస్‌తోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణకు అన్యాయం చేసిందే కాంగ్రెస్ పార్టీ అన్నారు. మరోసారి తనను ఆశీర్వదించాలని కోరారు. మంత్రి వెంట బీఆర్ఎస్ స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు కార్యకర్తలు ఆయన వెంట ప్రచారంలో పాల్గొన్నారు.

తిరుమల తరహాలో తిరుచానూరు వాహన సేవలు..

తిరుపతి, నవంబర్ 8:తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవ వాహన సేవల తరహాలో తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వాహన సేవలను వైభవంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేపడుతున్నారని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం టీటీడీ చైర్మన్ మీడియాతో మాట్లాడారు.

అమ్మవారి బ్రహ్మోత్సవాలకు ముందుగా జరిగే కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించామన్నారు. 9న అంకురార్పణ, 10న ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని 14న అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైన గజవాహన సేవకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారని, ఎక్కువమంది భక్తులు దర్శించుకునేలా అధికారులు చక్కటి ప్రణాళికల్ని రూపొందించారని తెలిపారు.

18న పంచమితీర్థానికి విశేషంగా భక్తులు తరలివచ్చి కోనేరులో పుణ్యస్నానాలు చేస్తారని, ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు– జరుగుతున్నాయని చెప్పారు. ఆలయంలో ఉదయం 6 నుండి 9 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితరాలను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు.

ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు యానాదయ్య, నాగసత్యం, సుబ్బరాజు, జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డెప్యూటీ ఈవో గోవిందరాజన్, విజివో బాలిరెడ్డి, ఏఈవో రమేష్, పాంచరాత్ర ఆగమసలహాదారు శ్రీనివాసాచార్యులు, సూపరింటెండెంట్లు శ్రీవాణి, శ్రీ శేషగిరి, అర్చకులు బాబుస్వామి, వేంపల్లి శ్రీను స్వామి, మణికంఠ స్వామి, సిఐ శివప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

15 పరదాలు విరాళం

అమ్మవారి ఆలయానికి చైర్మన్ కరుణాకర రెడ్డి చేతుల మీదుగా భక్తులు 15 పరదాలను విరాళంగా అందించారు. హైదరాబాదుకు చెందిన స్వర్ణ కుమార్ రెడ్డి 11, గుంటూరుకు చెందిన అరుణ్ కుమార్, పద్మావతి, తిరుచానూరుకు చెందిన పవిత్ర, రజిని ఒక్కొక్కటి చొప్పున నాలుగు పరదాలను విరాళంగా అందజేశారు.

ప్రజా బలగమే..నా బలం.. గండ్ర వెంకట రమణారెడ్డి

వరంగల్, నవంబర్ 8: ప్రజాబలగమే నా బలమని, మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, మరోసారి ఆశీర్వదించి గెలిపిస్తే ఊహించలేనంత అభివృద్ధికి కృషి చేస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకట రమణారెడ్డి అన్నారు. బుధవారం జయశంకర్ జిల్లా మండలంలోని ములకలపల్లి, పిడిసిల్ల, ఎల్లారెడ్డిపల్లి, గుండ్లకర్తి, కాసులపాడు, మోట్లపల్లి, మెట్టుపల్లి, గుడిపాడు, గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు ఆయనకు మంగళారతులతో బ్రహ్మరథం పట్టారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ? మొగులపల్లి మండలంలోని ప్రతి గ్రామాన్ని కన్నతల్లిలా భావించి, అభివృద్ధికి కృషి చేశానన్నారు. గ్రామంలో ఏ వీధి చూసిన అభివృద్ధి కనబడుతుందన్నారు.

మీకు సేవ చేయాలనే లక్ష్యంతో మూడోసారి మీ ముందుకు వచ్చానన్నారు. ఆలోచన లేని అభివృద్ధి అంటే తెలియని స్వార్థపూరిత రాజకీయాలతో మీ ముందుకు వస్తున్న ప్రతిపక్షాల మాటలు నమ్మవద్దని పేర్కొన్నారు. అభివృద్ధిని నిర్వీర్యం చేయడం కోసమే కొంతమంది అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని తెలిపారు. ప్రతి ఇంటికి, కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ జోరుగా సదయ్య, ఎంపీపీ యర సుజాత సంజీవరెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ సంపెల్లి నరసింగరావు, సర్పంచులు అన్నారెడ్డి, నైనకంటి ప్రభాకర్ రెడ్డి, పెంతల రాజేందర్

నేటినిజం
సాహితీ కిరణాలు
website:www.netinijam.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 9-11-2023

బంజారి నాని

లైట్లు కావు
మిణుగురులు
అవే నా చదువుకు
వెలుగునిచ్చిన దీపాలు

-డా॥ సూర్యాధనంజయ్
సెల్:9849104187

ఘంటారవం

సమస్యను బలపడేలా
చేస్తే ఎలా?
నిన్ను బలహీనం
చేస్తుంది కదా.

కునికిపాటు పడుతూ
వాహనం నడుపకు
కుటుంబాల పాలిట
పిడుగు పాటవ్వకు.

ఏదో జరుగబోతోందని
ఎందుకంత భయం
ఆధారం లేని అనుమానం
ఆందోళనకు మూలం.

వీపు తట్టేవారు
తక్కువ
వెనక్కి నెట్టేవారు
ఎక్కువ.

-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

యువ రచయిత్రుల సమ్మేళనానికి స్పందన



కార్యక్రమంలో డా॥ జె. చెన్నయ్య, డా॥ మామిడి హరికృష్ణ, డా॥ ముదిగొండ సుజాతారెడ్డి, డా॥ చింతపల్లి వసుంధరారెడ్డి, ఆచార్య ఎల్లూరి శివారెడ్డి తదితరులు.

హైదరాబాద్, నవంబర్ 8:(నేటినిజం ప్రతినిధి) తెలుగు సాహిత్య రంగానికి మరొక తరాన్ని అందించాలన్న సంకల్పంతో మొట్ట మొదటిసారిగా తెలంగాణ సారస్వత పరిషత్తు ఏర్పాటు చేసి యువ రచయిత్రుల సమ్మేళనానికి విశేష స్పందన లభించింది. వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 170 మంది యువ రచయిత్రులు, కవయిత్రులు, సమ్మేళనంలో పాల్గొన్నారు. ఇప్పటికే కొన్ని రచనలు చేసిన వారు కవిత్వం, కథలు రాయాలన్న అభిరుచి ఉండి తగిన శిక్షణ కావాల్సిన పాఠశాలలు, డిగ్రీ కళాశాలలు, విశ్వ విద్యాలయ విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శనివారం పరిషత్తులోని డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళా మందిరంలో జరిగిన కార్యక్రమంలో పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ చుట్టూ ఉన్న జీవితంలో నుంచి వచ్చిన రచనలే సజీవమైనవన్నారు. రచనా నైపుణ్యం పెంపొందించే విధంగా అనేక అధ్యయన శిభిరాలు నిర్వహిస్తామన్నారు. ప్రముఖ రచయిత్రులు డాక్టర్ ముదిగంటి సుజాతారెడ్డి, జానపద సాహిత్య పరిషత్తు అధ్యక్షురాలు డాక్టర్ చింతపల్లి వసుంధరా రెడ్డి అతిథులుగా పాల్గొన్నారు. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె. చెన్నయ్య స్వాగతోపన్యాసం చేశారు. ప్రముఖ రచయిత్రులు సమ్మెట ఉమాదేవి, గోగు శ్యామల, వారణాసి నాగలక్ష్మి ప్రసంగించారు.

కట్టుకున్న తల్లి

మొక్కాలని ఉంటుంది
మొక్కనివ్వదు
పాదాలపై పడాలని ఉంటుంది
పడనివ్వదు
ఆమె తిన్న ఎంగిలి కంచాలు
ఓ వారం రోజులైనా కడగాలని ఉంటుంది
కడగనివ్వదు
అవిశ్రాంత జీవన పోరాట యోధురాలు కదా
వంటమనిషిని పెట్టాలనుంటుంది
పెట్టనివ్వదు
ఆమే ...
నాకు అల్సర్ కనుక పుల్సు మానేసింది
ఆమె..
నాకిష్టం కాదని మాంసమొదులుకుంది
అదృష్టవశాత్తూ నాకిద్దరమ్మలు
పెళ్ళికి ముందూ పెళ్ళికి వేసకా
ఏ అర్ధరాత్రో అపరాత్రో
హఠాత్తుగా నాకు కడుపు నొస్తే
ఆ మాతృమూర్తి రకీమని మాత్ర అవుతుంది
తల్లీ...నువ్వుండగానే
నే వెళ్ళిపోవాలని పొరపాటున అన్నానా
భళ్ళున తన లోలోపలి
కన్నీళ్ళ కుండలను బద్దలు కొట్టుకొని
నా పాళ్ళంతా తడుపుతూ
నా భుజమ్మీద వాలిపోయే
శోక వనం ఆమె

-నలిమెల భాస్కర్
సెల్: 9704374081

'విశ్వరాగమై' భాసించిన 'విశ్వపుత్రిక' గజల్లు..!

-సూరారం శంకర్
9948963141

ఉర్దూలో పురుష స్వర ప్రధానమైన గజళ్ళ భావవ్యక్తీకరణను 'రేఖ్తా' అంటారు. స్త్రీ స్వర ప్రధానమైన గజళ్ళ భావవ్యక్తీకరణను 'రేఖ్తీ' అంటారు.

తెలుగులో ఈ విషయం తెలిసిన గజల్ కవులూ, కవయిత్రులూ తక్కువ మంది ఉన్నారు. చాలా మంది తెలుగు గజల్ కవయిత్రులు ఇలాంటి అతి సాధారణమైన విషయాలు కూడా తెలుసుకోకుండానే మేల్ ఫీలింగ్స్ ప్రధానంగా గజళ్ళు రాస్తున్నారు. ఇలా రాయడంలోని అనౌచిత్యాన్నీ, అసౌకర్యాన్నీ పట్టించుకోకుండా గజళ్ళు రాయడం కొంచెం వింతనే తలపిస్తుంది.

ఇక్కడ, కవయిత్రి విజయలక్ష్మి పండిట్‌గారి విషయంలో ఈ పద్ధతికి మినహాయింపు వర్తిస్తుంది. తను ఆధ్యాత్మిక భావ పరిమళాలుగా తన గజళ్ళను కొనసాగిస్తూనే, 'రేఖ్తీ' కోణంలో అభివ్యక్తులను కొనసాగించడం అభినందనీయమైన విషయం.

ఉర్దూలో సూఫీ వేదాంతం ఉన్నది.'హమఉస్త్' (అంతా అదే అయి ఉన్నది) అంటూ సర్వం భగవంతుడే అనే ఆరాధనా భావంతో తన్మయించడం, అదే భావంతో గజళ్ళు నిర్మించడం, పాడుకోవడం ఈ కోవకు వస్తాయి.

విజయలక్ష్మిగారి 'విశ్వరాగం'లో కూడా చదువరులు ఈ కోణాన్ని దర్శించవచ్చును.

ఉదాహరణకు-

ఉదయించే సూర్యుడిలో కనిపించెను నీ రూపం
మురిపించే నా మదిలో వినిపించెను నీ గానం

ఈ గజల్ సాంతం ఆధ్యాత్మిక భావ పరిమళమే...!

భగవంతుడు విశ్వవ్యాపకుడు. తను లేని ప్రదేశం లేదు. తను లేని ప్రపంచం లేదు. ప్రత్యణువులోనూ విస్తరించి బ్రహ్మాండమై వెలుగొందే దైవ సందర్శనం దర్శించగలిగే కనులుండాలిగానీ, ఉదయించే సూర్యుడిలోనూ, మురిపించే గానంలోనూ గోచరమౌతాడు. విజయలక్ష్మి గారి ఈ గజల్ ఆంతర్యం కూడా ఇదే.

ఇదే గజల్‌లో...

పద్మాలతో మురిపించే లోకంలోనూ...
వేణువులో ప్రభవించే స్వరంలోనూ...
గుండెలో తలపించే భావంలోనూ...
బాధలను మరిపించే స్నేహంలోనూ... నిన్నే దర్శించగలుగుతున్నాను... భగవాన్!

వంటి అందమైన ఆధ్యాత్మిక భావనా సొబగులున్నాయి.

'విశ్వరాగం'లోని మొదటి గజల్‌తోనే పఠితలను ఆధ్యాత్మిక ఆవరణంలోకి సగౌరవంగా ప్రవేశింప జేయడం కవయిత్రి కమనీయ భావనకు పరాకాష్ట.

మనిషి పుట్టుకలోని సార్థక్యత భగదన్వేషణలోనే ఉంది. ఆ అన్వేషణ ఫలించడమే ముముక్షత్వము. విజయలక్ష్మి పండిట్‌గారి ఆరాటం కూడా భగవదన్వేషణయే. ఆ అన్వేషణ తాలూకు క్రమమెట్టిదో ఈ గజల్‌లో పరిశీలిద్దాం... అలాగే, భగవదన్వేషణలోనూ ఎంతటి ఆనందం ఒదిగి ఉందో ఈ గజల్ చదివి తెలుసుకుందాం...

మనసులో వెదుకుతాను ఊరించే నీ రూపం కోసం
నీ మురళినై వెదుకుతాను నినదించే నీ నాదం కోసం
వెన్నెల్లో విహరించే చంద్రికలు నీ చిలిపి చూపులే
వెన్నెలవే గ్రోలుతాను స్పర్శించే నీ భావం కోసం
నా ఉచ్ఛ్వాస నిశ్వాసలలో ఊయలలూగేది నీ స్మరణే
నా యదలో నీ జ్ఞాపకాలు వినిపించే నీ గానం కోసం
నా దేహాలయంలో కొలువైన నా ఆత్మదీపమా!
విశ్వప్రేమ ఏకత్వాన్ని స్మరించే నీ ధ్యానం కోసం
విశ్వపుత్రికా ప్రేమకు కట్టుబడటమే దేవుని తత్వం
రాధాకృష్ణుల ప్రేమను తలపించే నీ తత్వం కోసం

ఈ గజల్ సాంతం భగవంతునికై ఒక భక్తురాలి హృదయాన్వేషణా క్రమం తీర్చిదిద్దబడింది... ఎక్కడా తడబాటు కనిపించదు. "ప్రేమే దైవం" అన్నది ఆర్యోక్తి. దేహాలయంలో ఆత్మ అన్నది ఆధ్యాత్మిక సౌందర్యం. విశ్వ ప్రేమ అన్నది ఏకత్వ సందేశం. రాధేశ్యాం అన్నది మధుర భక్తి సంకేతం. ఒకే గజల్‌లో ఇన్ని పార్శ్వాలు పొదగడం అన్నది కవయిత్రి ప్రతిభా కౌశలానికి నిదర్శనం. ఈ గజల్ సృజనతో తన తఖల్లూస్ 'విశ్వపుత్రిక'గా ప్రకటించుకోవడంలోని ఔచిత్యం కూడా తెలియజేసినట్లైంది. హృదయంలో ఏ సంఘర్షణ లేకుండా కవిత్వం పొసగదు. పైగా ఆ ఆలోచనలు పరిపక్వమైనవైతే ఆ కవితా కూర్పు అద్భుతమే. ఈ గజల్ కూడా ఒక అద్భుతమే.

ప్రపంచమంతా వెదికి అలసి పోయి, తిరిగి తనలోనే వెదుక్కోవడం మనిషిలోని బలహీనత. ఒక విధంగా ఇదే సరియైనదేమో...!!

మరి, ఆ విశ్వమోహనుడికై వెదికే వెతుకులాట ఎలా ఉందో ఈ గజల్‌లో మనమూ వెదికే ప్రయత్నం చేద్దామా.

నెమలీకలు రాలిన దారుల్లో వెతికాను నిన్ను
మురళి రవళించిన బాటల్లో వెతికాను నిన్ను
యమున ఇసుక తిన్నెలపై కనరాలేదు నీవు
నా భావజలధిలో మునిగి వెతికాను నిన్ను

ప్రతులకు:
డా॥పి. విజయలక్ష్మి పండిట్
ఇ.నెం. 3-6-361/ఎ
హిమాయత్‌నగర్, స్ట్రీట్ నెం.20
హైదరాబాద్-500 029.
సెల్: 8639061472

నీలిమబ్బుల్లో దాగున్నావని వెతికాను నిన్ను
మొయిలు మెరవగా ఆత్రంగా వెతికాను నిన్ను
పొగడపూల వాసలో తడిసి పొగడపూవునైనాను
పొగడ కొమ్మల్లో పొంచి వెతికాను నిన్ను

-మరి, దొరికాడా...? ఆ నీలమేఘశ్యాముడు... భక్తజన పాలకుడు...? అతడు ఏ రహస్య మందిరంలో ఉన్నాడో తెలుసా...? ఆ రహస్యం మక్తాలో లభించవచ్చు... చదవండి!

విశ్వపుత్రిక మది మందిరంలో కొలువైనావు
అనంత హృదయసీమలో కనుగొన్నాను నిన్ను.

- తెలిసింది కదా! భక్తుల హృదయ మందిరమే ఆ పరంధాముడు కొలువుండే వైకుంఠసీమ. అంతరంగం శోధనతో ఆ శ్రీనాథుడిని కనుగొన్నది కవయిత్రి. ఎంత రమణీయమైన అల్లిక ఈ గజల్. ఎంత మార్మిక సందేశం పొదిగిన కూర్పు ఈ కవితా నేర్పు. ఇలా కవయిత్రి, తన ఆధ్యాత్మిక భావ చింతనతో ఈ 'విశ్వరాగం' గజల్ సంపుటిని మహోన్నతం చేశారు.

ప్రారంభంలో మనం 'రేఖ్తీ' అనే ఒక మాటను చెప్పుకున్నాం. స్త్రీ స్వర ప్రధానమైన గజళ్ళ భావవ్యక్తీకరణను 'రేఖ్తీ' అంటారని కూడా చెప్పుకున్నాం. అలాంటి గుంజిళ్ళు కూడా ఈ సంపుటిలో కూర్చడం మరో విశేషం.

ఉదా-

పైరగాలి వలకరించ మనసెంతో మురిసెనులే...
మల్లెపూలు గుభాళించ కురులెంతో మెరిసెనులే...
పైరగాలి తాకితే పరవశించని మనసుండదు..

సరే, మల్లెపూల గుభాళింపుకు కురులు మురవడం అనే మాట 'రేఖ్తీ' అనగా స్త్రీ స్వర ప్రధానమైన భావ వ్యక్తీకరణయే కదా! మరికొంచెం ముందుకు వెళితే...

వెన్నెల కురిసిన రాత్రులు నీకోసమె వేచితిని
చంద్రికల గిలిగింతకు తనువెంతో మురిసెనులే...
సరస్సులో చంద్రుడు చిరునవ్వులు చిందించె
నీ మోమే అగుపించి కనులెంతో మురిసెనులే...

ఇవన్నీ రేఖ్తీ (స్త్రీ మనోభావాల) సంకేతాలే కదా! ఏది ఏమైననూ స్వీయ జెండర్ ప్రధానమైన అభివ్యక్తిలో భాషా పరిమళమే కాదు, భావపరిమళం కూడా గుభాళిస్తుంది. ఈ రహస్యం తెలిసినవాళ్ళెవరైననూ ఇతర జెండర్ అభివ్యక్తులతో గజిబిజి తామవరు, ఇతరులను చేయరు. స్త్రీ మనసు సున్నితమైనది. తను ఎంచుకునే ప్రతీకలు కూడా సుకుమారమైనవి అయి ఉంటాయి. పురుషుని భావాలు కొంచెం కాఠిన్యతను ఫలిస్తాయి. ఈ బేధం వలననే 'రేఖ్తీ' గజళ్ళు మన్నుతాయి.

ఇదిలా ఉంటే, ఇదే సంపుటిలో...

కొన్ని సందేశాత్మక గజళ్ళు కూడా ఉన్నాయి. ఉదాహరణకు...

కాలమెంత చిత్రమో కానరాదు మనిషికి
లోకమెంత మాయనో తెలిసిరాదు మనిషికి...

- నిజమే కదా! ఈ క్షణం ఇలా ఉన్న మనం మరుక్షణం, ఎలా ఉంటామో, ఏమైతామో తెలియదు. అలాగే లోకాన్ని అంచనా వేయగల సామర్థ్యం అందరికీ ఉండదు. కాలం, లోకం ఊహకు అందనివి.

ఆత్మకు కప్పిన మాయపొర తొలగించు
ఆత్మజ్ఞానం లేకున్న ముక్తి లేదు మనిషికి...

- సత్య మిదే కదా! మాయపొర తొలగనిదే ముక్తి రాదు...

జీవులంతా మనం ఒకే కుటుంబ సభ్యులం
అహంకార భేషజం పనికిరాదు మనిషికి...

- అందరమొకటనే భావనలోనే ఆనందం ఉంది మనిషికి. అలా కాకుండా, నేను గొప్ప అనే అహంకారంలో సమస్త దుఃఖం కొనితెచ్చుకోవడమే ఉందన్నది కవయిత్రి సందేశం. ఇలా ఈ గజల్ పూర్తిగా ఆత్మ పరిశీలనతో సాగుతుంది. పైగా ఏది కూడదో, ఏది వలయునో కళ్ళకు కట్టినట్లు చెబుతుంది. ఇలాంటి గజళ్ళు లోకాన్ని దార్శనికతతో పరిశీలించగలిగితేనే రాయగలరు. కవయిత్రి పరిశీలనాశక్తికి ఇదొక మచ్చుతునక.

గజల్ నిర్మాణంలో అర్థాలంకారము, శబ్దాలంకారముల పాత్ర అనన్యమైనది. ఈ రెండు కుదిరెనా ఆ గజల్ నిర్మాణం అజరామరమై నిలుస్తుంది. అలాంటి కొన్ని షేర్లను 'విశ్వరాగం' సంపుటిలోంచి ఉటంకించుకోవడం గజల్ మర్యాద.

"తన చూపుల తూపుల గురి నేనేనని తెలిసింది
తన నవ్వే నా బ్రతుకున వెన్నెలయని తెలిసింది..."

ఈ మతాల్లో... తన చూపుల తూపులు అనగా... తన చూపులు అనబడు శరాలు. తన నవ్వే వెన్నెల అనగా... తన నవ్వులు అనే వెన్నెలలు.. అని అర్థం.

ఇవి ఉపమాలంకార సంబంధములు మరియు అర్థవంతములైన భావసమన్వయములు కూడా.

ఇలా ఉపమ, రూపక, ఉత్ప్రేక్ష, అతిశయోక్తి, స్వభావోక్తి, అర్థాంతరన్యాస, ఆదిగా గల అర్థాలంకారములునూ...

ఛేకానుప్రాస, వృత్యనుప్రాస, లాటానుప్రాస, యమకము, ముక్తపదగ్రస్తములు అను శబ్దాలంకారములునూ.. అవసరం మేరకు (కావాలని కాదు) ఒడుపు తెలిసి సృజనలలో ప్రయోగించిన యెడల...

ఆ గజల్ రామణీయకమై అలరారుతుంది. విజయలక్ష్మీ పండిట్‌గారు మాత్రము అర్థాలంకారములకే ఎక్కువ ప్రాధాన్యత నిడుటను నేను గమనించాను. అయితే సుకుమారమైన పదప్రయోగాలలో మాత్రము ఎక్కడా తడబడలేదు. తన పరిధి మేరకు సున్నితములైన పద ప్రయోగములనే కావించుట హర్షణీయం. (ఇంకా ఉంది)

ఇంకనూ ఈ 'విశ్వరాగం'లో హృదయరంజకములైన పంక్తులు చాలా ఉన్నవి. అన్నింటిని ఉటంకించుటకిది వేదిక కాదు. అయిననూ మనసును అలరించే కొన్ని పంక్తులు ఎంచుకోకుండా ఉండలేము కదా! అందులో కొన్ని ఇలా ఉన్నవి.

నీ శూన్యాన్ని చిరునవ్వులు చిందించే తారలతో నింపుకున్నా
గుండెలు చీల్చి భావాలను చిలకరించి కవితలతో ఒంపుకున్నా...
బురదలో పుట్టినా పద్మం అతి సౌందర్యం
కులం కాదు గుణం నిన్ను కీర్తించును తథ్యం...
గుండె గాయపడితే ప్రేమ విలువ తెలిసేది
విశ్వపుత్రికా... ప్రేమకై ప్రేమను ప్రేమిస్తేనే అందం...
ఆకాశమే దిగివచ్చి నన్ను హత్తుకుంది ప్రేమతో
నక్షత్రమే రాలిపడి నన్ను ముద్దాడింది ప్రేమతో...
పురుగులిడే మేఘాలను పట్టి ఆప సాధ్యమా
వరుగులిడే యవ్వనాన్ని కట్టి ఆప సాధ్యమా...
నా వలపు వాకిట్లో వాలిన గోరింకవు నీవు
నా తనువు తలంపై రాసిన గంధానివి నీవు...

ఇలా తనదైన ప్రత్యేక శైలితో, తనదైన స్వీయ పరిమళపు అభివ్యక్తులతో, ఆత్మిక, ఆధ్యాత్మిక సౌరభాలుగా... గజళ్ళను సృజించి గజల్ సాహిత్య ప్రపంచానికి అందించిన ప్రతిభగల కవయిత్రి విజయలక్ష్మి పండిట్‌గారు...

అలాగే తాను స్వయంగా రాయడమే కాకుండా 'విశ్వపుత్రిక గజల్ ఫౌండేషన్'ద్వారా సహ కవులను ప్రోత్సహిస్తూ.. సాహిత్య సేవయే జీవిత పరమావధిగా సాగుతున్న వీరి ప్రస్థానాన్ని ప్రశంసిస్తూ... వీరి కలం నుండి మరిన్ని మంచి రచనలు రావాలనీ, సహృదయ పాఠకులను అలరించాలనీ ఆశిస్తూ అభినందిస్తున్నాను. జయహో తెలుగు గజల్.. జయహో సాహిత్య ప్రపంచం..

తరతరాల మన నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తున్న "పర్యావరణ పరిరక్షణా గీతం"

-డా॥ కత్తి సృజన
అసిస్టెంట్ ప్రొఫెసర్
పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటి

కత్తి పద్మారావు గారి కవిత్వం పర్యావరణ పరిరక్షణా గీతం. అది ప్రతినిత్యం ఒక సుస్థిర సందేశాన్ని వ్యాప్తి చేస్తుంది. ఈ సందేశం తరతరాల మన నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తుంది. పర్యవసానాల్ని మన కళ్ళముందు ప్రభ కడుతుంది. నవ తరాన్నీ కార్యోన్ముఖుల్ని చేస్తుంది.



దుబ్బ నిట్ట నిలువునా
చేలో ఎండిపోతుంది
ఆ నడిచేలో ఎండిన దుబ్బ

కవిని ప్రశ్నిస్తుంది. కవి సున్నిత మనస్కుడు. మన నిర్లక్ష్యానికి ఆ దుబ్బ నిలువెత్తు సాక్ష్యం.

సేంద్రియమైనదంతా నిరాకరించబడినాక
విత్తనానికి ఆయువు పోయింది.

సేంద్రియ ఉద్యమం నేడు ప్రముఖంగా ఊపందుకుంటున్న నేపథ్యంలో కవులు, కళాకారులు ప్రధాన భూమిక పోషించనున్నారు. సాహిత్యం పర్యావరణ పరిరక్షణా అవగాహనను సులువుగా ప్రజలలోకి జొప్పించగలదు.

ఒక తుఫాను వచ్చినప్పుడు
సముద్రం విధ్వంసం సృష్టిస్తుంది
ప్రకృతిలోని అనంత శక్తులు
ఒకేసారి మాట్లాడుతాయి

అంటూ కవి ప్రకృతి అభివ్యక్తిలోని సముజ్వల కాంతులను సచేతనంగా పరిచయం చేస్తున్నారు.

ప్రతి ఋతువులో
తల్లిది కొత్త భాష

కవికి ప్రకృతి ప్రేరణ వారికి ప్రకృతిలో తల్లి మమేకమైనట్లు అనిపిస్తుంది. వారి ఆలోచనా ప్రవాహాన్ని సమాజానికి ప్రకృతి ద్వారా అన్వయిస్తారు. వారి కవిత్వానికీ, సమాజానికీ ప్రకృతి వాహిక.

తొలకరిలో చిగురాకులు
వెన్నెలను ధరించి
కిరీటాలున్న రాజుల్లా వున్నాయి

తొలకరి, చిగురాకులు, వెన్నెల, కదలి తరంగాలు, సూర్య కిరణాలు, నక్షత్రాలు, పాలపుంతలు వంటి ప్రకృతి ప్రతీకలు కవిత్వం మొత్తం దర్శనమిస్తాయి.

ప్రకృతిలో అన్నీ కంచలే
కవాతు చేసేవాడి
పాదం నిండా గాయాలే

నేడు పర్యావరణ పరిరక్షణ ఒక ఉద్యమం. పలువురు పర్యావరణ వేత్తలు కార్పొరేట్ వ్యవస్థను ఎదిరించి పోరాడి తమ ప్రాణాలను పణంగా పెట్టారు. మన దేశంలో పర్యావరణ వేత్తలుగా మేధా పాట్కర్, సునీతా నారాయణ, వందనా సింగ్, సుగత కుమారి, గౌరీదేవి, సుందర్‌లాల్ బహు గుణ వంటి వారు ప్రసిద్ధి గాంచారు. వారంతా ప్రకృతి వినాశనాన్ని ప్రశ్నిస్తున్నారు. వారి ప్రయాణంలో అనేక కంచెలు ఆ కవాతు ప్రపంచ వ్యాప్తంగా కూడా అనేక గాయాలు మిగిల్చింది.

1985లో డియన్ ఫాసీ అనే పర్యావరణ పరిరక్షకురాలు, గొరిల్లాల ను వేటాడి వ్యాపారం చేయడానికి విఘాతం కలిగిస్తున్నదనే నెపంతో అత్యంత దారుణంగా ఆఫ్రికాలో హత్య గావింపబడింది.

కదలి సుడులు సుడులుగా
తిరుగుతున్నప్పుడు
అందులో అలజడి వుంది

ప్రకృతిలో అలజడికి మనిషి పాత్రను మనం విశ్లేషణ చేసుకోవాల్సి వుంది. కవి ప్రకృతిలోని తీవ్రతలను నిశితంగా పరిశీలిస్తూ తద్వారా ఉత్పన్నమయ్యే ప్రకంపనల పట్ల మానవులను అనేక ఉదాహరణలతో వారించడం గమనార్హం.

జనం మౌనంగా వున్నప్పుడే
నదులు స్వేచ్ఛగా ప్రవహించాయి

మానవుడు నదిని తన మనుగడకు జీవనాధారం చేసుకున్నాక అనేక కాలుష్య కారక అంశాలు నది జలాల స్వచ్ఛతను కలుషితం చేశాయి.

అనేక కృత్రిమంశాలు
స్వల్ప కాలాన్ని పాలిస్తున్నాయి
నాగరికత సుస్థిరత పునాదిపై నిర్మించబడినపుడే అనతికాలం వర్ధిల్లుతుంది. వీరి కవిత్వం సూక్తులు విరివిగా సాక్షాత్కరిస్తాయి.

"చిన్నమొగ్గ" లో కూడా వికాసాన్ని ఆస్వాదించగల ప్రేమికుడు కవి. "సమన్వయం" లోపించినపుడు రాగాలలోని "వైరుధ్యం" ప్రస్ఫుటిస్తుందని ప్రకృతిలో వున్న సమన్వయాన్ని ఆవిష్కరించారు.



ఆ పొలంగట్టున నిలబడ్డవాడు
పాలకంకులను ముక్కులతో
పొడుస్తున్న పిట్టలను చూసి
పొలానికి నీళ్లందినంత కాలం
పంటవస్తూనే ఉంటుందని
ఆనందించాడు.

వ్యవసాయం సజావుగా సాగాలంటే నీటి యాజమాన్యం ప్రధానాంశం. ఈ విషయాన్ని "పాలకంకులను ముక్కులతో పొడుస్తున్న పాలపిట్టల ద్వారా దృశ్యీకరించారు కవి. 'పంట సరుకయ్యాక" "దుఃఖం మిగిలిందని" కవితాత్మకంగా వ్యక్తీకరిండంలో ఆయనకు ఎవరూ సాటిరారు. కవిత్వం కేవలం భావాత్మక వ్యక్తీకరణ మాత్రమే కాదు. కత్తి పద్మారావుగారి కవిత్వం సామాజిక బాధ్యతకు దారి వేయడాన్ని గమనించవచ్చు.

ఋతువు ఆలస్యం కావడం, విత్తనానికి భూమికి ఉన్న సంబంధాన్ని ధ్వంసిస్తున్న తేలిపోతున్న మబ్బులను ధ్యేశించి కవి ప్రకృతి వినాశనానికి మనిషి ఎంత వరకూ కారకుడు అని చర్చిస్తూ...

ప్రతి దానిలో మనుష్యులు
ముగింపు కోరినంత
కొనసాగింపు కోరడం లేదు.

ప్రకృతి కేవలం వర్ణనలకు వస్తు మాత్రం కాదు. ఒక సైద్ధాంతిక చర్చను నిరంతరం కవి తన కవిత్వం ద్వారా చేస్తూ వస్తున్నారు. కీట్స్, షెల్లీ, ఖలీల్ జిబ్రాన్, జాన్ మిల్టన్ వంటి ప్రఖ్యాత కవులను దాటి కవి మానవునిలో నూతన ఆలోచనకు ఊపిరులూదుతున్నారు.

నీరుకు బలం చేకూరిస్తే
కొత్త చిగురొస్తదని
వీరికి తెలుస్తుంది.

కత్తి పద్మారావు గారు మానవీయ విలువలను, వ్యక్తిత్వ నిర్మాణాన్ని, సమాజిక స్పృహను తన కవిత్వం ద్వారా సమాజంలోకి చేర్చుతున్న సామాజిక తత్వవేత్త.

మొగ్గ చిట్లుతున్న శబ్దం వినపడదు కానీ,
పునఃసృష్టి జరుగుతూనే వుంది.

ప్రకృతికి మనం ఎన్ని అవరోధాలు కలిగించినా పునఃసృష్టి జరుగుతూనే వుంది. కానీ

ఆకులు రాలుతున్నంతగా
చిగురులు వేయడం లేదు

ఈ రెండు ప్రక్రియలకు మధ్యన మానవ విధ్వంసం చర్చనీయాంశం. ఎక్కువ మొగ్గలు ఎండిపోతున్నాయి. కానీ, నానాటికి పెరుగుతున్న కాలుష్యం కారణం ఈ రోజున మనం ఆశించిన మేరకు ఫలితాలు రావడం లేదు.

నక్షత్రాల, తెల్లటి గువ్వలు
నదుల్లో అద్దం చూసుకుంటున్నాయి
వాటి ముఖాల కంటే
నీరే మకిలిగా వుంది.

ఇలా ఒక్కొక్క కవితలో పర్యావరణ కాలుష్యంపై వారు చేస్తున్న విశ్లేషణ ఆలోచింపజేస్తుంది. వారు సునిశితమైన ప్రతి శాస్త్రీయ అధ్యయనాల్ని ప్రతీకాత్మకంగా సార్వజనీనం చేయడం గమనించవచ్చు.

"వీళ్ళు ఆకాశ నక్షత్రాలను చూసిల ఎన్నాళ్ళయిందో" అనే మాట నేటి తరం తీరు తెన్నులకు అద్దం పడుతుంది. బ్లూ స్క్రీన్ ఆకర్షించి నంతగా ప్రకృతిలోని సున్నితమైన అభివ్యక్తులు వారిని చేరడం లేదు.

నేటి పాలకు ప్రాధాన్యాలను, వైఫల్యాలను నాలుగు మాటల్లో మన ముందుంచారు.

గ్రానైట్ స్లోన్స్
తవ్వకాలకు పెట్టిన శ్రద్ధ,
నాలుగు పప్పు ధాన్యాలను
పండించడానికి పెడితే
ప్రజలకు అవి లభ్యమయ్యేవి కదా!

ఈనాడు మైనింగ్ ప్రక్రియ ద్వారా ఎంత ఆర్థిక పురోగతిని ఆపేక్షిస్తున్నారో అంతకుమించిన దుమ్ము, ధూళి, మానవ శ్వాసకోశాన్ని శాసిస్తున్న సూక్ష్మ రేణువులు విడుదలౌతున్నాయి. వృద్ధులు, చిన్న పిల్లలు, గర్భిణీ స్త్రీలు,



శ్వాసకోశ వ్యాధులు కలిగిన వారు వీటివల్ల అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. కవిగారు ప్రజలు ఈ అంశాలపై దృష్టి పెట్టాలని పైలెట్ చేస్తున్నారు.

అడవి నిజాయితీగా పూస్తుంది
ఆకుల కంటే పూతే ఎక్కువ
ఆ చెట్లు నరికి
అద్దాల భవనం కట్టిన వారు
వీధుల వెంట మొక్కలు నాటుతున్నారేంటి?

ప్రకృతి నిజాయితీకి ప్రతీక. పర్యావరణ పరిరక్షణ ఉద్యమంలో చిత్తశుద్ధి కొరవడింది. కార్పొరేట్‌ల సామాజిక బాధ్యత ప్రచారంగా మాత్రమే మిగలకూడదు. పర్యావరణ కాలుష్యాన్ని కట్టడి చేయడానికి కార్పొరేట్ వ్యవస్థ ఒక సామాజిక విప్లవ నినాద బాధ్యతను భుజాన వేస్కోంది.

ప్రకృతిది ఒక అనంత
పరివాహిత సృజనమైనా
దానది కొన్నిసార్లు కఠిన చర్య
అనివార్యత దాని లక్షణం
అందుకే
మనిషి అనంతుడైనా
ప్రకృతి దాని బహుళ్యాన్ని
ఎరుక పరుస్తూనే వుంది.
మనిషి ప్రకృతితో సామరస్యాన్ని సాధించినపుడే ఒక సమన్వయ ప్రపంచం భాసిస్తుంది. వైరుధ్యం అధిగమనం కాజాలదు. ఆవాహనమే ఈ వైరుధ్యానికి సామరస్యం. ఈనాడు



దేశంలోని అనేక నగరాలు వాయు కాలుష్యాన్ని విషవాయు వులతో విలవిల లాడుతున్నాయి. అట్టి నగరాలలోని పరిస్థితిని విశ్లేషిస్తూ...

ఇది నగరమే
విషవాయువుల కాటుకు
మూర్ఛబోయిన నగరం
నగరముఖద్వారంలోనే
అడ్డుకుంటున్న నగరం
చల్లని గాలిలేని
నీటి తుంపరలేని
చాల సూర్య ప్రభాసం లేని నగరం

మన నగరాలు చల్లని గాలి, నీటి తుంపరలు, చాల సూర్య ప్రభాసం లేక మూర్ఛబోయాయి. ప్రతి నగర ముఖ ద్వారం ఒక చెత్త కుప్పతో స్వాగతిస్తుంది. అక్కడ తగలబడుతున్న చెత్త నుండి విషం చిమ్ముతూ ఉద్గారాల మయం. ఎక్కువగా వ

సాక్షాత్తు మానవుడు! ప్రజాకవి కాళోజి

పరుల కష్టము చూసి కరిగి పోయే గుండె. బతుకు వైరుధ్యాల పుట్ట అనుకుంటు ఒక క్రమమంటూ స్థైర్యమంటూ లేక, అట్లని జరిగే అనర్థాలను అవకతవకలను చూస్తూ సాక్షీభూతుడిగా ఉండలేక, తన 'గొడవ'తో సాక్షాత్తు మానవుడిని నేను అని స్పష్టం చేసిన కదన వదనుడు ప్రజాకవి కాళోజీ. ప్రజల వెతలూ, పాట్లూ చూసి కరిగిపోయే ఆ గుండె లోంచి ఎగిసి వలా వలా కన్నీళు ళ్ళగా కార్చే కరుణాంతరంగుడు..

ఒక సామాన్య మానవుడు ఉగ్ర నరసింహుడయ్యే క్రమంలో హింసకు ప్రతి హింస తప్పు కాదనే ఘంటాపథంగా చెప్తాడు. జనం కష్టాలు చూస్తూ కరిగిపోయేవాడు మాయలూ, మోసాలూ చూసి మండిపడతాడు. మరి ఈ అకృత్యాల ను నివారించి సవరించే శక్తి సామర్థ్యాలు లేని నేను

"తప్పుదిద్దగలేను
దారి జూపగలేను
తప్పు చేసిన వాని దండింపగా లేను
అవకతవకల నేను సవరింపలేనపుడు
పరుల కష్టాలతో
పనియేమి నాకనెడు
అన్యులను జూచైన హాయిగా మనలేను". తన మతీ గతీ ఈ విధంగా అస్థిమితంగా అడుగడుగునా సందేహాలతో, అవగాహనల లేమితో అనేక రకాల ప్రశ్నలతో అతలాకు తల మవుతుంటుందని ఈ కల్లోలిత మనోనేత్రుడు కవిత ద్వారా ప్రకటిత మవుతుంటాడు. ఒక కంట కన్నీరూ, ఒక కంట మంటలూ కురిసే ఎగిసే ప్రజాస్వామికుడు ప్రపంచంలోని పద్మవ్యూహాల్లో చిక్కుబడ్డ బక్క ప్రాణులను బయటికి ఈడ్చే పీడిత ఈ బాంధవుడు.

సంక్షోభాల సుడిగుండాలలో గిరి గిరా తిరిగిపోతూ ఉండే బతుకును ఏదో ఒక సూత్రానికి కట్టి వేలాడదీసి బతికేద్దామనుకుంటే ఆ సూత్రం పుట్టుక్కు తెగిపోతే మళ్ళీ బతుకు చతికిలబడి బిత్తర చూపులు చూస్తుండడమే కదా, అయినా ఏదో ఒక ఇజానికీ, తత్వానికీ, సూత్రానికీ కట్టుబడి జీవించాలంటే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు సున్నా అని అనుభవం మీద తెలుసుకొని వాపోతాడు. అలా అని బతుకు మీద విసుగుతో, వ్యవస్థ మీద కసితో బతకడం ఎందుకని అనిపించినపుడు చావుకై నిరీక్షిస్తూ బతకడం ఎట్లా అది ఇంకా దుర్భరం అన్న ప్రశ్న వేధిస్తుంటుంది అంటాడు.

"ఏకీభవించనోని పీక నొక్కు సిద్ధాంతం" గురించి, రాజ్యహింస, హింస తప్పు. హింసలేని ప్రపంచమే శాంతి ప్రపంచం. "శాంతిగ మెల గుట మంచిది, కాని, శాంతి పరిస్థితి కలదా సఖుడా !" ఇదీ కాళోజీ అంతరంగంలో అలలెత్తే ప్రశ్న వడిబెట్టి నుడిదిప్పి, అడుగునకుతొక్కి, ఊపిరాడకుండా ఎగపోసే ప్రశ్న ! కుటుంబంలో హింస, సమాజమంతటా హింస, రాజ్యం చేసే హింస. ఎంతకని భరిస్తాము, ఎంతని ఓర్చుకుంటాము. తిరగబడితే, నిందెలు, వెలి, తిరస్కారాలు, పీక నొక్కడాలు ! ప్రతి హింసకు పాల్పడితే సమాజానికి ప్రమాదకారులు, యథాతథాన్ని విచ్ఛిన్నం చేసే విప్లవకారులు! అసమ ప్రమాణాలు, వంచనల గూళ్లు, అబద్ధాలనోళ్ళు ! హింస ప్రయోజనకారి ఏనాటికీ కాదు అది అత్యంత ప్రమాదకారి.

తన ఇచ్ఛయేగాక తనకేమి వెరపు ? కాళోజేనా భయపడేవాడు. ఏ సంకెళ్ళు తొడుక్కోనివాడు. ఏ ప్రలో భాలకు చేయి చాపని వాడు. ముఖ్యంగా ప్రజల పక్షమేగాని 'పార్టీప్రత్యం' లేని వాడు. తన ఇచ్చే తన ఈశ్వరుడు అని నమ్మినవాడు. ఆచరణ పట్ల ఇసుమంత కూడా రాజీపడే స్వభావికుడు కాదు. తన సౌఖ్యము కోసం ఇతరులను పీడించే గుణం లేనివాడు. 'నేను', 'నా' అనే అహంభావము లేనివాడు. తన నుండి 'మన' వరకు చేరడానికి ఆగని నడకను ఎంచుకున్నవాడు. ఈ సాక్షాత్తు మానవుని లొల్లి లక్షణాలు అసమ్మతీ ! నిరసనా ! ధిక్కారం !

కాళోజీది మనిషి కథ అదే నా 'గొడవ'. ఆగకుండా అన్నివేళలా ప్రవహించే జీవన నది కథ అది. తన ఇరుకుల చేరి దూరిన అడ్డమైన మురికినంతా తన్నేస్తూ పోయేదే ఆ నది కథ. ఆ కథకు ముగింపులేదు, కొనసాగింపే. అది ప్రపంచికులందరి కథ. మానవధర్మాన్ని స్థిరీకరించుకునే దాకా ప్రయాణం చేస్తూండే కథ.

దేశమేగతి బాగుపడునో అని నిత్యం తల్లడిల్లే ఈ ప్రజల మనిషి దేశం నిండా లంచగొండులు, నేరగాళ్ళు పెరిగిపోతుండం చూస్తూ

"చెల్లినోనికి నేరం చెల్లుబాటు అవుతుంటే
చెల్లనోనికి నేరం చేయక తప్పకవుంటే
చట్ట విరుద్ధం చర్యల పుట్టైపోదా దేశం". చీలిపోయి పీలికలైన సమాజం, మలినాలతో మసిబారిన దేశపు తేజం. జగతి మలినమైతే హృదయం మలినం కాదా. కాలు ష్యాలు కమ్ముకున్న లోకంలో మను షులు కలుషితమై మసిబారిపోరా. హృదయ మాలిన్యాలను కడిగేసుకో వాలి మనిషి.. ఎట్లా ? మాలిన్యాలను తుడిచేసుకోవడం, కాలుష్యాలను కాల్చి బూడిదజేయ డం జీవన విధానం కావాలన్నది కాళోజీ ఆలోచన, ఆకాంక్ష.

ప్రజలు – పాలకులూ రాజ్యాం గబద్ధంగా తమ సంఘ జీవనాన్ని మలుచుకుంటే సామాజిక అలజడులు ఉండవు. రాజ్యంగాన్ని పట్టించు కోకుండా ప్రజలూ, పాలకులూ వక్ర పోకడలు అనుసరిస్తూ యధేచ్ఛగా తప్పులూ, పొరపాట్లతో క్రమశిక్షణా ఉల్లంఘనలు చేస్తూ పోతుంటే అటు పాలకవర్గాల నేరాలూ ఇటు ప్రజలు పాల్పడే నేరాలతో వ్యవస్థ దారి తప్పి ఊబిలో పడిపోతుంది. రక్తనదులు పారిస్తుంది. ఆర్తనాదాలూ ఆక్రందనల తో కునారిల్లి ఘోషిస్తుంది.

మనదంతా ఓటు నోటు రాజకీ యమే. ఆ విషవలయాల్లో చిక్కుకొని బయటపడలేక ఓటరు మహానుభా వులు ఉన్న దృష్టిని కోల్పోయి ముష్టికై వెంపర్లాడుతున్నారు. నాయకులు ముష్టి ప్రదాతలు, ఓటర్లు ముష్టి నోళ్లు తెరుచుకొని చేతులు చాచే భిక్షువులు. ఇంకా చెప్పాల్సివస్తే దేబరింపులతో ఆకలి చూపుల బక్కప్రాణులు.

ఇదంతా చూస్తూ **"నరుడ నేను, నరుడ నేను, మనిషి బ్రతుకు బ్రతుకుతాను"** అన్న స్పృహలోకి రండిరా అని ప్రజలను మేల్కొల్పుతూ దశాబ్దాలుగా ప్రజలు పోగొట్టుకున్న సామాన్య జ్ఞానాన్ని పొందే ప్రయత్నం జీవన ఆశయంగా చేసుకోవాలని, దారి తప్పిన జన బాహుళ్యానికి దారి దీపమై నిలబడి దారి చూపిస్తాడు.

తన జీవితకాలంలో మన దేశానికి యుద్ధాలు వచ్చిపడినపుడూ, మనకు అత్యయిక పరిస్థితి వచ్చి పీడనలు తెచ్చినప్పుడూ ఎంతో వేదనతో కదిలిపోయాడు. కాళోజీ మదిలో ఎందుకో ఇన్ని ఆవేదనలు ? అంటే లోకం పతనమైపోతున్న దుస్థితిని చూసి, మనిషి మాయమైపోయి మార్కెట్ మాయలు కమ్ముకుంటున్న నీచస్థితిని చూసి, చెమ్మగిల్లే కన్నులున్న ఈ సాక్షాత్ మానవుడు ప్రాపంచికమైన తన గొడవలతో అంతులేని సముద్రా లను ఈదుతున్న అలసట, ఊపిర్లతో మోగిస్తున్న కాహళీల ధ్వని తరంగాల తాకిడి. సొలసి సొమ్మసిల్లడం ఆ సైనికుని ఒంట్లో లేనిది మరి.

ఆయన మురికినీళ్ల పారుదలను కాదు జీవనదుల పారుదలను కోరుకున్నాడు. మనిషి జీవనదిలా ఉ ండాలన్న చిన్న కోరికను పెద్ద కాన్వాస్ మీద జలపాతంలా చూడాలనుకు న్నాడు.

కాళోజీ 'గొడవ'ను దర్శించే చూపు కావాలి మనకిప్పుడు. కాళోజీ గొడవను ఆవాహన చేసుకునే ఒక ఎరుకనూ మన ఎడదనూ శుభ్రం చేసుకొని చూడాలి మనమిప్పుడు. పీడితజన ధిక్కారమై సాగిన ఆయన గొడవకు నీడపట్టి, పంచాయితీ పెట్టి, ప్రజా న్యాయస్థానం కట్టి, రాజ్యాంగబద్ధమైన మార్గాల్లో పీడిత పక్షపాతానికి తీర్పులు మధించి సాధించాలిప్పుడు..

కాళోజీ అన్నట్లుగానే
"మనకేమని అనరాదు
మనది కానిదేమున్నది
దేశము దేశీయులదే
దేశీయులన్న మనవే".. అనుకుంటూ సమకాలీన సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక చరిత్ర పరిణామాలననుసరిస్తూ ప్రజా పక్షం నిలబడి వివేచిస్తూ సామాజిక శాంతికీ, మానవుని ఎదుగులకూ, జీవవనరుల సాఫల్య తలకూ, సంఘశ్రేయస్సును కూర్చే సమతా ప్రజ్ఞా ఆచరణలకూ పౌర సమాజం కొత్తగా అడుగులు వేయా ల్సిన సమయాన్ని గుర్తు చేస్తాడు. విశ్వ మానవుడైన కాళోజీ కలల నేలను కాపాడుకోవాల్సి కాలం !

తన దేహాన్ని వైద్య ప్రయోగశా లకు ఇచ్చి కనబడకుండా కాళోజీ వెళ్ళిపోయి రెండు దశాబ్దాలు గడిచిపోయినా ముందుచూపుతో తన చూపులు మనల్ని తాకుతుండాలని తన కళ్ళను కాపలాగా మనకిచ్చి పోయాడు.

"నా గొడవ మనస్థితి వైనం
నేనంటే భారత పౌరుడు
నా గొడవ ఆ పౌరుని స్థితి
నేనంటే ఒక వోటరు
నా గొడవ వోటేసేవారు
నేనంటే తిరుగుబాటు దారు
నా గొడవ మన తిరుగుబాటు".. సాక్షీభూతుడై అంతా చూస్తునే ఉన్నాడు ఆకాశ మంత ఎదిగిన ఆ సాక్షాత్ మాన వుడు ! అన్యాయాన్ని ఎదరించే వాడిని ఆరాధిస్తూనే ఉంటాడు. చెమటోడ్చి పని చేసే మనిషినే మనిషిగ గుర్తిస్తాడు, గుర్తించాలం టాడు. అతిథివోలె వచ్చి ఉండి వెళ్ళినాడు.. అతిథివోలె మళ్ళీ వస్తాడన్న నమ్మకమూ వొట్టి మాట కాదు. గొడవకు పర్యాయపదమై నిలిచే ఉంటాడు ! మృత్యువు సైతం ఆ తేజస్సును చూసి దూరం నుండే నమస్కరించి పోతుంది.

కారణజన్యులైన వారు చిరంజీవులు కదా !

(13 నవంబర్, 2023న కాళోజీ జయంతి సందర్భంగా సంస్మరణ)

– అనిశెట్టి రజిత
9849482462

మహనీయుడా ... అబుల్ కలాం.

బాటలు వేసిన భాగ్యవిధాత
దూరదృష్టితో పనిలో
చాటిన చతురత
ఆదర్శం మహనీయుడా ..
నీ అకుంఠిత దీక్ష.

సమరయోధునిగా
అన్యాయాన్ని ఎదురించావు
బాపూజీ బాటలో
శాంతి మంత్రాన్ని పఠించావు
విద్యా పరిమాళాలను
అంతటా పంచావు
కృషి చేయగా సాధనగా మెరిశావు
కర్తవ్యపరాయణతో
మార్గదర్శిగా నిలిచావు.

సమానతలోనే
సౌభాగ్యమని చాటినావు
విజ్ఞానమే దేశ పరమావధిగా
భావించినావు
విద్యకు నిజమైన అర్థం తెలిపావు
విద్యా జగతిని ఏలీ
అంధకారమును తుంచ
వెలుగు కిరణాల సూర్యుడవయ్యావు.

సేవలను అందించి
దేశ జెండా ఎత్తావు
విద్యా జగతి ఎప్పటికీ
మరిచిపోదు నీ సేవ
జ్ఞాన మార్గమును చూపించి
యువతను కదిలించావు
దేశభక్తిని నెలకొల్పి
సఖ్యతను పెంచావు
జనహిత మార్గదర్శి
స్ఫూర్తిగా నువ్వు నిలిచావు.

విద్యాసంస్థలు నెలకొల్పి
జ్ఞాన ఋషిగా మారావు
నీ సేవలు ఎన్నెన్నో
జాతికి అందించావు.

జగతి జనుల గుండెల్లో
ఆజాదుగా నువ్వు మిగిలావు.

తొలి విద్యాశాఖ మంత్రి
సేవల నెన్నోఅందించావు
అబుల్ కలాం నీకిచ్చిన
జన గుర్తింపు బిరుదు.
ఆజాద్ నీ వెంచుకున్న
నీ ప్రీతి కలం పేరు.

తొలి విద్యా బాటసారివి నువ్వు
నీ సేవలు మరవలేనివి
నీ మార్గము వీడలేనిది.

భాషల్లో ప్రవీణుడవు నువ్వు
స్వాతంత్ర సమరయోధుడవు నువ్వు
పలు సంస్కరణలు తెచ్చిన
సంస్కర్తవు నువ్వు
ఇండియా గెలుస్తుందన్న
సాహితీ రుషివి నువ్వు.

గాంధీజీ అడుగుజాడల్లో
నడిచిన సైన్యానివి

ఉచిత విద్య
నిర్బంధ విద్య నీ వాక్యాలే
విద్య జన్మహక్కు నీ ప్రతిపాదనలే
ఆడపిల్లకు విద్య నీ సంస్కరణలే.

నాణ్యమైన విద్య నీ భావనలే
గ్రాంట్ కమిషన్, యూజీసీలు
సాంకేతికతలా ,ఉన్నత విద్యలు
పరిశోధనలో పురోగతులు
నీ భావనలే నీ కృషి ఫలములే.

సామరస్యతను పెంపొందించి
ఐక్యత వారధి నువ్వే అయ్యి
కలిసి జీవించే మార్గములెన్నో
ప్రేమలు సౌభ్రాతృత్వాలు
నీ చేతలతో కలిగించావు
భారతదేశపు ఔన్నత్యాన్ని
కీర్తి కిరీటం చేసావు.
భారతరత్నమా...
భారత కీర్తి కేతనమా...
విజ్ఞాన స్ఫూర్తి కిరీటమా....
అబుల్ కలాం.

ఆణిముత్యమే నువ్వు
నీ పేరున జరుపుతాము నీ
జన్మదినమే
"విద్యా దినోత్సవము" నేడు.

ఓ మార్గదర్శి స్ఫూర్తిదాత...
నీవేసిన పునాదులే
మా విజ్ఞాన భవంతులు.

నువ్వు చెప్పిన మంచి మాటలే
మా వెలుగుల పువ్వుల దారులు
నాయకుడా స్వాతంత్ర యోధుడా
మార్గదర్శి తొలి విద్యా బాటసారి
అబుల్ కలాం
నీ సేవలు మరిచిపోము
నువ్వు చూపించిన బాటలో నడుస్తాము.

(నవంబర్ 11 న భారతరత్న, తొలి విద్యాశాఖమంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ గారి జయంతి "జాతీయ విద్యా దినోత్సవం" సందర్భముగా.....)

– సిరిసిల్లా గఫూర్ శిక్షక్
9849062038

ఏ చరిత్రలు లిఖించడానికి యుద్ధం...!!

మన నీడలే మనలను భయపెడుతున్నాయి
జరిగిన సంగ్రామంలో రుధిరపు మరకలు
కాలానికి మచ్చల్లాగా ప్రశ్నలు వేస్తున్నాయి
ఎన్ని శాంతి కపోతాలు నింగిలో ఎగిరితే ఏమి లాభం...

ఆయుధాల నిప్పుల ఘర్షణ జరుగుతుంది ప్రతిచోట
సామాన్యుడి తనువుపై చెరగని గాయములు
ఆధిపత్యంలో అహంకారపు ఛాయలు నింపుతూ
ఏ యుద్ధం ఏ పరిమాణం చూపించడం లేదు..

నింగిలో మెరుపులు నేలపై నిప్పుల వర్షాలు
భూమాత గాయమై రక్తం చిందిస్తుంది
అణ్వస్త్రాల విన్యాసం పెద్దరికపు పోకడలు
చిరు ప్రాణులు నిత్యం చస్తూ బతుకుతున్న రోజులు..

ఏ చరిత్ర లిఖించడానికి మారణ హోమాలు
పచ్చ తోరణాల బ్రతుకుల్లో ఎండు గాలులు
యుద్ధపు మిరపకాయల ఘాట అంతటా వ్యాపిస్తుంటే
ఊపిరాడక జనాలు రోడ్లపై పరుగులు తీస్తున్నారు..

ఏ పతాకము ఎగిరితే మీ విశ్వవీధిలో
మానవత్వపు కోణాన్ని మరోసారి మేల్కొల్పితే
విశ్వయుద్ధాల అంతరంగాన్ని గ్రహించగలిగితే
విశ్వ కళ్యాణము ఎందుకు మనము జరపలేము..

ఆలోచనల్లో అశాంతిని తొలగించుకొని చూడండి
సుందరమైన లోకాన్ని కళ్ళముందు వీక్షిస్తాం
సంగ్రామపు సైతానులను వదిలించండి
ప్రపంచపు శాంతియజ్ఞాన్ని
నిర్విఘ్నంగా కొనసాగించండి.

–కొప్పుల ప్రసాద్
9885066235

సమ్మోహనం

ఉవ్వెత్తున అల్లుకుపోతున్న
శబ్ద తరంగాలు..
నింగీ నేలా ఒక్కటి చేసే
రాజకీయ విహంగాలు..

కమ్ముకున్న ఎన్నికల మేఘాల
మెరుపుల తళుకులలో
చినుకేదో చిత్తడేదో తెలుసుకోలేని
జన సమూహాలు...

సొమ్మెవరిదో సోకులెవరివో కాని
హామీల హర్మ్యాలను
కనులముందు
నిలిపే ఎన్నికల గాలులు...
మాటల మంటలు
వాద వివాదాల
మోతలే అంతటా...
ప్రచారపు వన్నె చిన్నెల ఊయలలో
ఊగుతూ ఆద మరిచే
అమాయక జనం..
ప్రసంగాలలో కదిలే
ప్రలోభాల కళలు
ఊరేగింపుల ఊరింపుల జాతరలు...
ఎన్నికల కలలన్నీ
అలలపై కదిలే చిత్రాలని తెలిసినా
ఏమీ చేయలేని ఓటరు
వాగ్దానాల
సుమ
సౌరభాల మత్తులో
అంతా సమ్మోహనం...

–వెల్ముల జయపాల్ రెడ్డి
9441168976

పుస్తక సమీక్ష

ఆసక్తికర భావ స్వరాలతో "క్రొత్త రాగం"...!



– దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

ప్రతులకు :
దర్భముళ్ళ చంద్రశేఖర్
9491850718

"కాగితం మీద
చెమ్మగిల్లిన కన్నీటికి
హృదయం హృద్యంగా హత్తుకునే చిరుతడి
నా కవిత్వం!" అని భావించే కవి దర్భముళ్ళ చంద్రశేఖర్

"కాలం కసిగా చేసే గాయాలకు కరుణతో అమ్మ రాసే చేతి వెన్నలా" తమ ఆసక్తికర భావస్వరాల తో "క్రొత్తరాగం" కవితా సంపుటిని సాహితీలోకానికి అందించడం అభినందనీయం !

కవి చంద్రశేఖర్ ఈ గ్రంథంలో పొందుపరిచిన కవితల్లో... అల్లరి పిల్ల ముంగురులను అలరించే.. మునిమాపు చిరుగాలి ఈల పాటల ను వింటాం.. కవి పేర్కొన్నట్లు...

అవునన్నా కాదన్నా../ ఆయన కవిత్వంలో / మలిసంధ్య చీకట్ల నుండైనా/ వెలుగు పుంజాలను తోడి పిండే నైజాన్ని.../ ఒక్క శ్వేత కిరణంతో / సప్తవర్ణాలను సృజించి సవరించే ప్రిజంను.. చూస్తాం.

వృత్తిరీత్యా దేశరక్షణలో తరిస్తున్న ఆయన, పెన్ను ద్వారా కవిత్వ సృజనలో తన్మయత్వం పొందడం విశేషం. లోగడ సాహితీ లోకానికి మూడు కవితా సంపుటాలను వెలువరించిన ఆయన తమ నాలుగో గ్రంథంగా మనకందిస్తున్నారు.

వైవిధ్యమైన వస్తువులతో కొలువుదీరిన ఈ కవితల్లో కవి యొక్క అభివ్యక్తి యందు కొత్తదనాన్ని గమనిస్తాం. కొన్ని కవితల్లో లయబద్ధమైన పదబంధ ప్రయోగా లను చూడగలం.. ప్రాసకోసం పరుగులు తీసే కవితా పంక్తులనూ వీక్షిస్తాం. **"అంతర్మథనం"** కవిత లోని.. పదబంధ ప్రయోగంలో కవి యొక్క నేర్పరితనాన్ని అభినందించి తీరుతాం.

'మాట పొదుపు మనకు అది / మనసు పొదుపు మనుగడ పొది / ఒక్కొక్కసారి మౌనమే కదా / విశ్వాన్ని విపులీకరించే విబూది!' అని పై కవితను ప్రారంభించిన తీరు బాగుంది.

'గెలుపోటముల గిరి దాటని ఝరి / నైపుణ్యం నైగనిగ్యం చేసే గురి / నేర్పేదే కోసలోని గురువుల సిరి!' అంటూ ముగించడమూ అందరినీ ఆకట్టుకుంటుంది.

చంద్రశేఖర్ కవిత్వం పైకి సరళంగా కనిపించినప్పటికీ.. ఆయా పదాల పరదా మాటున దాగిన భావధార ప్రశంసనీయంగా ఉంది.

విలక్షణమైన అభివ్యక్తితో.. సలక్షణమైన పదకూర్పుతో.. చిక్కని భావుకతతో.. "(అ)మలిన శృంగా రం" కవితకు రూపుమిచ్చారు. ఈ కవితను శిల్పచాతుర్యంతో తీర్చిదిద్ద డంలో కవి చంద్రశేఖర్ సఫలీకృతు లైనారు.

నీది.. నాది...
నీకు... నాకు
నీకు నాకు అన్న ఉపశీర్షికలతో కవి ఇరువురి ఆలోచనా తరంగాలను అందంగా అక్షరాల్లో ఆవిష్కరించా రు.

నీది..

"ఊ అంటావా.. లేక ఊహూ అంటావా?" అంటూ ఉద్రేకపరిచి ఉవ్వెత్తున కోర్కెల ఉప్పెనలో ముంచి.. అంటూ కొనసాగించారు. సద్దు పొద్దును చంపించి.. "వలపంటే ఒక పిచ్చి కూత.. మంచి మర్యాదల తీసివేత"నిపించే **"ఇరుకు సందుల గుణకారం.../ బరితెగించిన భాగా హారం../ పీలిక గుడ్డల్తో పేనిన అర్థనగ్న అహంకారం!/** అని పేర్కొన్నారు.

నాది...

'కోటి కొంటె కోర్కెలు కూడబలు క్కుని కవ్వించినా / సమయం సందర్భం కానప్పుడు / కిమ్మనకుండా కోవెల కోనేరులా / నియంత్రణలో నియమబద్ధంగా మసలే వ్యవహారం! / మనసుకు ముద్దెట్టే మౌనహారం!' అని చెప్పడం బాగుంది.

నీకు..

'ప్రేమంటే పైత్యాలు పెచ్చుమీరి / బర్రెలు ఎదకొచ్చినట్లు రొద పెట్టే రాక్షస రాగం..'

నాకు..

'హద్దులు కరిగిన హృదయాం జలిలో / వేయి వెలుగుల ప్రేమరా గం' అంటూ కవితను అందంగా ఆవిష్కరించారు.

సమాజంలోని పరువు హత్య లపై స్పందిస్తూ 'వ్యధ-వ్యథ' కవితను రాశారు. విచ్చుకత్తుల నడుమ పిల్ల పిచ్చుకల కుత్తుకలను కోస్తున్న కోలాటాలను.. తమకు తగని కులాల తలరాతలు తుడపటం.. తప్పుకా దని దబాయించే నక్క వినయాల తలారుల కవాతులను ఈ కవితలో దృశ్యమానం చేశారు. సౌహార్ద్రపు పునాదుల మీద సమసమాజం నిర్మిస్తూ.. స్నేహ సంగీతాల విపంచికలను సుస్పష్టంగా సవరించు మని హితవు పలికారు.

బొట్టుబొట్టుగా నది / గంతులే సుకుంటూ / గట్లు తెంపుకుంటూ / సలుగుర్ని దాటేసుకుంటూ / ఆలోచనల్ని వాటేసుకుంటూ / అటూ ఇటూ../ పరుగులు తీసే నదిని "నాలుగు బండరాళ్ళు – నది" కవితలో చక్కగా ఆవిష్కరించారు.

"సముద్రం...ఆకాశం...నేను...!" కవితలో సముద్రం.. ఆకాశం ఒంటరివే అయినట్లు నేనూ ఒంటరి వాణ్నేనని తేల్చి చెబుతూ రాసిన పం క్తులు కవితలో చక్కగా ఒదిగిపో యాయి.

ఆటలో ఆటాడి / ఒడ్డు అస్పృశ్య తలను చెరిపేసినా / కొంటెతనంగా కెరటాల్ని/ అంటి ముట్టుకుని / పోటులో పాట పాడేసినా / చకచకా వెనక్కి పారిపోతూ/ చెలియలికట్ట సాక్షిగా చేతులు కట్టేసుకున్న / ఈ తుంటి సముద్రం / ఎప్పుడూ ఒంట రిదే..!/ అని చెప్పడం బాగుంది.

మాసిపోయిన నక్షత్రాలు/ ముడతలు పడ్డ దుప్పట్లు/ ఎండ వాన చలి ముప్పిరి గొన్న ఇక్కట్లు / నగ్నమైన నంగి నింగి వంగి వంగి, అందుకేగా ఆకాశం అరుస్తూనే ఉంది/ తాను ఒంటరినని..!/ చీకట్లో చిల్ల పెంకుల మీద / చిరు జ్యోతుల్లాంటి చుక్కల్ని చిరునవ్వుతో పలకరిస్తూ / స్వీయ నిర్బంధంలో/ ఏకాంతపు చెలిమి శిక్షగా/ నేనూ.. ఒంటరివాడ్నే....!!!/ అంటూ ముగించారు.

మనిషికి చెరువుతో బంధాన్ని మరో కవిత ద్వారా తెలియజెప్పారు. **'ఎంత యాతనైనా చేతనైన సాయం../ చెరువు చేస్తూ పలుకరి స్తూనే ఉంటుందనీ../ కష్టమూ కన్నీళ్లే కాదు../ నవ్వుల్తో పువ్వుల్తో / పన్నీరు కూడా చిలకరిస్తూనే ఉంటుందని/ చెరువు యొక్క గొప్పదనాన్ని** చాటి చెప్పారు.

మనిషే.. అలిగి అడపాదడపా హేళనగా/ కుదురులేని బెదురు సమ్మేళనగా/ మారిపోతున్నాడు.. పారిపోతున్నాడని వ్యాఖ్యానించారు.

కవిత్వానికి కాదేదీ అనర్హం అని శ్రీశ్రీ పేర్కొన్నట్లు కవి దర్భముళ్ళ చంద్రశేఖర్ **"సబ్బుబిల్ల-కుక్కపిల్ల-అగ్గిపుల్ల", "గుర్రా విజిల్", "పాతట్రంక్ పెట్టె"** శీర్షికలతో కవితల్ని రాసి పాఠకులను మెప్పించారు.

"వంతెన" శీర్షికతో రాసిన కవితలో – 'చెలిమి వంతెన.. పరువు వంతెన.. క్షమవంతెన, పాట వంతెన, పాలపుంతవంతెన, వెల్తురు వంతెన మరియు బతుకు వంతెన లను ఆలోచనాత్మకంగా ఆవిష్కరిం చారు.

అంతర్లీన భావస్వరాలతో **"మోదుగుపూలు"** కవితను తీర్చిదిద్దారు. యువతను ద్దేశిస్తూ నాలుగు మంచి మాటలకు ఈ కవిత లో చోటు కల్పించారు. నైరాశ్యపు నీడ విదిల్చి విసిరేసి.. పదిమందికి పనికొచ్చే వెల్తురు మేడకు పునాది వేసి.. నియమబద్ధ జీవితపు ప్రవేశం చేయుమని యువతకు పిలుపుని చ్చారు. ఉన్మత్తపువ్వులా కాదు.. ఉ మ్మెత్త పువ్వులా కాదు.. కారడవిని కళకళలాడించే మోదుగు పువ్వులా బ్రతుకుమంటూ సూచించారు.

ముసురుపట్టి ఆగి ఆగి కుర స్తున్న వానను చూసి **"అసమర్థ శావం"** కవితను రాశారు. ముసురులో మూర్తీభవించలేక.. మునిగిపోతున్న దృశ్యాదృశ్యపు దిక్కుతోచని దిగులును అక్షరాల్లో బంధించారు.

అద్భుతాలు జరిగిన ప్పుడు.. అందరికీ తెలియాల్సిన అవసరం లేదంటూ.. **"మనిషి మొలకెత్తుతు న్నాడు"** కవితను రూపుదిద్దారు.

కవి దర్భముళ్ళ-**"ధూళిపాట"** కవితలో తాత్త్వికతను ప్రదర్శించా రు. చక్కని భావుకతతో చిక్కని భావాలను ప్రకటిస్తూ "బహుళ పాడ్యమి" కవితను తీర్చిదిద్దారు. "సయ్యాట" కవితలోనూ కవి యొక్క భావుకతను చూడగలం.. శ్రావణ భాద్రపదాలు సరసమాడి.. సరిచేసిన శాద్వలం మీద స్వల్పంగా సాం బ్రాణి పొగలా సర్దుకున్న శరత కాలపు వెన్నెల అంటూ "సయ్యాట" కవితను కొనసాగించిన తీరు బాగుంది. ఈ కవితలో ప్రయోగిం చిన పదబంధాలు వస్తువు వెలుగులో చక్కగా ఒదిగిపోయాయి. శిల్పచా తుర్యంతో ఈ కవితను అల్లిన కవి దర్భముళ్ళ చంద్రశేఖర్ అభినంద నీయులు.

ఇలా ఈ కవితా సంపుటిలోని ఎన్నో కవితా పంక్తులు ఉదహ రించడానికి యోగ్యంగా ఉన్నాయి.. ఆద్యంతం ఆసక్తికరంగా మలచబడిన ఇందలి కవిత్వం అందరూ చదు వదగింది. కవి దర్భముళ్ళగారు ముమ్ముందు మరింత బలమైన కవిత్వాన్ని అందించాలని కోరుకుం దాం.. ఆ దిశలో ఆయన తప్పక సఫలం పొందుతారన్న విశ్వాసం ఉంది.

దేశం పిలుపు

ప్రజాస్వామ్యానికి
మకుటాయమానం ఎన్నికలు
మలిన తరంగాలు సోకి
ఎగతాళయ్యా యిప్పుడు
మనుషులు, స్వార్థానికి
ఆయుధాలుగా మారారు
రాజకీయ అహంకారానికి
అలంకారాలయ్యారు
ధనం మత్తు చల్లి
గెలుపు ముఖం మీద
పేరు చెక్కుకోవటం
గొప్ప తనమైంది
ధనాధిపతులే
అభ్యర్థులై మొలకెత్తుతున్నారు
రాచరికాల స్థానే
ప్రజాస్వామ్య పతకాన్ని
మెడలో అలంకరించుకుని
కుటుంబ పాలనకి
కొత్త గొడుగు లెత్తారు
వ్యవస్థ కన్నులు పొడిచి
పాలించాలనుకునే వారి చేతిలో
దేశం, కీలు బొమ్మవుతూ ఉంది
ప్రక్షాళన కోసం
నిజాయితీని ఆరాధించే వాళ్ళంతా
నిప్పురవ్వలై నిలవాల్సిన సమయం
జాతి జీవంలో
కొత్త ఊపిరి నింపాల్సిన సమయం
పాలనలో పారదర్శకత కోసం
ముందడుగు వేసేవాళ్ళెవరిని
ప్రశ్నిస్తా ఉందీ దేశం!

–ఎస్.ఆర్.పృథ్వీ
సెల్:9989223245

మణిపూసలు

అవ్వి అలివేణి కళ్ళు
తొలి వెన్నెల వాకిళ్ళు
తలచినంతనే మేను
పులకింతలతో తుళ్ళు!

ప్రేమలు పూచే ఆమని
విజ్ఞాన నిధులున్న గని
జగతికే కిరీటమై
అలరారే భరతావని!

నింగి ముంగిటను ముగ్గులు
దూది పింజల్ల మబ్బులు
వాన చినుకుల కొరకై
ఈ యవనియు కన్న కలలు!

నీలాకాశము ముంగిట
కమణీయమగు పూదోట
ఏ తరుణిమణి పెంచెనో
నక్షత్రపు పూల పంట!

మకరంధం ఒలిచినట్టు
మధువులూరె తేనెపట్టు
కల్తీపాలబడకుంటె
ఆరోగ్య ఆయువుపట్టు!

అలంకరించు మెడనిండ
సుమగంధపు పూలదండ
స్త్రీజాతిని గౌరవించు
అదే సమాజాని కండ!

అనురాగపు గీతికలు
పాడుకొనే సమయాలు
ఆనందం వెల్లివిరియు
సంక్రాంతి సంబరాలు!

ఎందుకంత వేగమంట
నిధానమై సాగమంట
యమలోక ద్వారానికి
చేరుకొనద మెందుకంట!

కమ్మనైనదిర ఆలన
అమ్మచేతిలో పాలన
అపురూప వరమైనట్టి
అమృత సమానపు లాలన!

మంచికి అంజలించాలి
పెద్దల గౌరవించాలి
పురోగతికి అడుగై
వంచెన తుంచివేయాలి!

గతమంతా చెల్లిపోవు
భవితంతా మి

డా॥నమిలకొండ సునీత పరిశోధక వ్యాస సంకలనం

"తెలంగాణ యశోధరులు - ఒక పరిశీలన"

సమాజహితాన్ని కోరేది సాహిత్యం. సాహిత్య సృజనకు లోతైన సామాజిక, సాహిత్య, తాత్విక అధ్యయనం మిళితమైతే బంగారానికి పరిమళం అబ్బినట్లుగా ఉంటుంది.

మానవ జీవితంలోని వివిధ రంగాలు , సాహిత్యంలోని వైవిధ్య పరిణామాలను, వివిధ ప్రక్రియలను సునిశితంగా పరిశీలించి, తగిన వ్యాఖ్యానాలతో ఎప్పటికప్పుడు రచయితలు వర్తమాన సాహితీ ప్రపంచానికి అందించాలి. నాటినుండీ నేటి వరకూ సమాజంలోని మార్పులను, లోటుపాట్లను ఎత్తి చూపి సంస్కరించడానికి ఎందరో మహానుభావులు, తత్వవేత్తలు, విద్యావేత్తలు, సామాజిక ఉద్యమకారులు, నాటి కాలపు రాజులు, ఈ నాటి ప్రజాస్వామ్య వాదులు, అభ్యుదయ మహిళలు, ప్రజా ప్రతినిధులంతా కృషి చేశారు. చేస్తూనే ఉన్నారు. తెలంగాణలోని వివిధ పార్శ్వాలలో రాణించిన మహామహు లెందరో ఉన్నారు. నిస్వార్థ సేవాపరాయణుల జీవితాలను, వారి రచనలు, ప్రతిభా సామర్థ్యాలను తెలుసుకోవడానికి, భావి తరాలకు అందించడానికి సాహిత్యం ఒక ఉపకరణంలా పని చేస్తుంది. అందులో భాగంగా అలాంటి ప్రతిభా సంపన్నుల గొప్ప కృషిని, వారి జీవిత అనుభవాలను, వారి రచనలను సుదీర్ఘంగా విశ్లేషణ చేయడంలో ఆరితేరిన వారిలో వర్తమాన రచయిత్రి డా.నమిలకొండ సునీత గారు ఒకరు. తెలంగాణ సాహిత్య పునర్నిర్మాణాన్ని చేయాల్సిన బాధ్యత డా.సునీత లాంటి వర్తమాన రచయితలపై ఉంది. సమాజము-సాహిత్యము రెండూ పెనవేసుకొని పోయి సమాజాన్ని సంస్కరించడంలో ప్రధాన పాత్రను పోషిస్తున్నది. ఎంతోమంది ప్రాచీన సాహిత్య కారులు వర్తమాన సాహిత్యకారులు, భక్త శిఖామణులు, సమాజ హితం కోసం రచనలు చేస్తూ ఉద్యమాలు సాగిస్తూ తమవంతు పాత్రను పోషించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వేములవాడ వాస్తవ్యురాలైన సాహితీవేత్త డాక్టర్ నమిలకొండ సునీత గారు ఇటీవల పరిశోధించి రాసిన తెలంగాణ యశోధరులు అనే వ్యాస సంకలనం ఇందులకు ప్రతీకగా నిలుస్తుంది. ఇందులో ఎందరో మహానుభావులను, పాలకులుగా రాణించిన మహిళామణుల ప్రతిభా సామర్థ్యాలను, అవధానుల పాండిత్య ప్రకర్షను, పద్యకవుల కవన సౌరభాలను, విద్యావేత్తలు, ఆర్షధర్మ, సాహిత్య సామాజిక రంగాలకు చెందిన విశిష్టుల ప్రత్యేకతలను లోతుగా తవ్వి, పరిశోధించి 15 వ్యాసాలుగా 180 పేజీలలో రాశారు. ఈ వ్యాసాలు మేలిమి బంగారంలా తయారవడానికి రచయిత్రి చేసిన నేపథ్య అధ్యయనం, పరిశోధక కృషి అపారమైనది. శ్రీ విద్యోపాసకులు సద్గురు శివానందనాథ, ప్రముఖ సాహితీవేత్తలు ఆచార్య ఎస్వీ. రామారావు, డా. టి .శ్రీరంగ స్వామి, డా. అయాచితం నటేశ్వర శర్మలు ముందు మాటలు రాసి, రచయిత్రి పరిశోధనా కృషిని అభినందించారు.

డా.సునీత ఈ వ్యాసాలకు సాహిత్య, సామాజిక వ్యాసాలుగా పేర్కొని తన కలాన్ని పదునెక్కించారు. రచయిత్రి తొలుతగా 2016లో ప్రభాత కిరణాలు అనే వ్యాస సంపుటితో సాహిత్య వ్యాసాలు వెలుగులోకి తెచ్చారు. నిత్య పరిశోధనలతో తన రచనా వ్యాసంగాలను కొనసాగిస్తూ, పత్రికలకు, ప్రత్యేక సంచికలు విరివిగా రాస్తూ తన సాహితీ ప్రావీణ్యాన్ని చాటుకొంటున్నారు. వీరు తెలుగు ఎం. ఎ చేసి, ఎంఫిల్, పి. హెచ్. డి పట్టాలను పొందారు. వృత్తి రీత్యా ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కామారెడ్డి సమీపంలో ప్రభుత్వ తెలుగు అధ్యాపకురాలుగా పనిచేస్తున్నారు. తన సిద్ధాంత అంశమైన వరంగల్ జిల్లా పత్రికలు- సాహితీ సేవ గ్రంథాన్ని ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ద్వారా పరిశోధించి, సుమారు 300 పేజీలతో అచ్చు వేసి తన పరిశోధక పాటవాన్ని చాటుకోవడమే కాకుండా, పాఠకాదరణను పొందారు. రచయిత్రి ఎం. ఫిల్ పరిశోధన గ్రంథం "మూక పంచశతి వ్యాఖ్యానాలు ఒక పరిశీలన" అచ్చులోకి రావాల్సి ఉంది. మూడవ గ్రంథంగా 2022 సంవత్సరంలో "తెలంగాణా యశోధరులు" పేరిట వ్యాస సంకలనాన్ని అచ్చులోకి తెచ్చారు.

ఇహ వీరి వ్యాసాలు ప్రత్యేకమైన శైలితో, తెలుగుదనంతో అలలారుతాయి. పలు సావెంతలు, పదబంధాలు, పలుకుబడులు, సంస్కృత శ్లోకాల ఉదాహరణలు, ఉపమాన, ఉపమేయాలు, అలంకారాలు, మాత్రా ఛందస్సు మొదలగు అంశాలతో మిళితం చేసిన వ్యాసాల నడవడిక పాఠక హృద్యంగా సాగుతుంది. ఈ వ్యాస సంకలనం ప్రచురణకు హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారు కొంతమేరకు ఆర్థిక సాయాన్ని అందించారు.

ఇక వీరి వ్యాసాలలోకి వెళ్తే తెలంగాణ సంస్థానాల్లో మహిళల పాత్ర, గద్వాల సంస్థానంలో సాహిత్య సేవ వీరి నిశిత పరిశోధనలకు అద్దం పడతాయి. తెలంగాణ ప్రాంతంలో 14వ శతాబ్దం నుండి 19 శతాబ్దం ఉత్తరార్థం వరకు కుతుబ్ షాహీల నుండి మొగలులు, నైజాం రాజుల పాలనా కింద 14 సంస్థానాలు పాలించాయని ఆమె పేర్కొన్నారు. ఈ సంస్థానాలలో రాజులతో సహా, వారి రాణులు కూడా పాలించారు. వీరి పాలనలో జరిగిన సామాజిక, సాహిత్య రంగాల గూర్చి అధ్యయనం చేసి చక్కటి పరిశోధక వ్యాసాన్ని అందించారు. ఇందులో గద్వాల, వనపర్తి , అమర చింత (ఆత్మకూరు), జటప్రోలు (కొల్లాపూర్), పాపన్నపేట , పాల్వంచ, బొరవెల్లి , సిర్నా పల్లి, గోపాల పేట, తదితర సంస్థానాల గూర్చి రచయిత్రి చక్కగా చర్చించారు. గద్వాల సంస్థాన మూల పురుషుడు కాకతీయ ప్రతాపరుద్రుని కాలం నాటి గొన బుద్ధారెడ్డి యనిపెద్ద సోమ భూపాలుడని, ఇతనే శోభనాద్రి, సోమనాద్రి గా. పిలువ బడ్డాడని, క్రీ.శ.1663-1735 పేర్కొంటూ,ఇతనే గద్వాల కోట నిర్మాతలని అన్నారు. గద్వాల పాలకులలో శ్రీరామ భూపాలుడు, సీతారామ భూపాలుడు, తర్వాత ఆది లక్ష్మీ దేవమ్మ దత్త పుత్రుడు కృష్ణ రాం భూపాలుడు ముఖ్యులను. పేర్కొన్నారు. ఆదిలక్ష్మీదేవమ్మ గూర్చి ప్రత్యేకించి రాశారు. క్రీ.శ. 1663లో రాజా పెద్ద భూపాలుడి పాలనతో ప్రారంభమైన గద్వాల సంస్థాన పరిపాలన ముష్టిపల్లి సీతారాముల భార్య ఆదిలక్ష్మీదేవమ్మ పాలన . పోలీస్ చర్య తర్వాత

నిస్వార్థ సేవాపరాయణుల జీవితాలను, వారి రచనలు, ప్రతిభా సామర్థ్యాలను తెలుసుకోవడానికి, భావి తరాలకు అందించడానికి సాహిత్యం ఒక ఉపకరణంలా పని చేస్తుంది.

1948 సెప్టంబర్ 17తో ముగిసింది. గద్వాలతో పాటు ఇతర సంస్థానాలలో అనేకమంది సాహిత్యకారులు ఈ సంస్థానాలలో కవులుగా రాణించి పలు గ్రంథాలు రాసినట్లు ఆమె పేర్కొన్నారు. 1953లో రాణీ ఆదిలక్ష్మీదేవమ్మ మరణించారు. ఆమె స్మారకంగా గద్వాలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేశారు. 1935-48 వరకు భార్యాభర్తల పాలన సాగింది. 1946లో భర్త మరణించారు. ఈ సంస్థానాలలో కవులకు, పండితులకు ముఖ్యంగా పద్య కవులకు, సాహిత్యకారులకు చక్కటి ఆదరణ లభించిందనట్లు తెలిపారు.గద్వాల ప్రభువు పెద్ద సోమ భూపాలుడు స్వయంగా కవి, జయదేవుని సంస్కృత గీత గోవిందాన్ని తెలుగు సేత చేశారని రాశారు. గద్వాల ప్రభువుల కాలంలోనే కవి, పండితులు , అవధానులైన తిరుపతి వెంకట కవులు, మరియు కొల్లాపూర్ సంస్థానంలో శ్రీపాద కృష్ణమూర్తి వంటి ఉద్దండులైన కవులు ఈ సంస్థానాలకు విచ్చేసి సన్మానింపబడ్డారని పేర్కొన్నారు. ఇందులో భాగంగా వివిధ సంస్థానాధీశులైన మహిళలు అందించిన చక్కటి పరిపాలనను, సాహిత్య సేవలను ఈ వ్యాసంలో రచయిత్రి సోదాహరణంగా వివరించారు. అమరచింత (ఆత్మకూర్) సంస్థానంలో చివరి పాలకురాలైన భాగ్యలక్ష్మమ్మ గారు రాజా



ప్రతులకు: సెల్:09908468171 మరియు విశాలాంధ్ర, మరియు అన్ని బ్రాంచీలు నవచేతన పబ్లిషింగ్ హౌస్, అన్ని బ్రాంచీలు.

సీతారామారావు గారి సతీమణి. ఈమె భాషా సాహిత్యాలను పోషించింది. 1933-34లో సురవరం ప్రతాపరెడ్డి సంపాదక సారథ్యంలో 354 మంది పద్య కవుల రచనలతో వెలువడిన గొల్కొండ సంచిక ప్రచురణకు ఆర్థిక సాయం అందించారు. జటప్రోలు(కొల్లాపూర్) సంస్థాన పాలకురాలు, రాణీ వెంకట రత్నమాంబ పరిపాలనా కాలంలో ప్రముఖ రచయిత శ్రీపాద కృష్ణమూర్తి గారికి ఒక అసంపూర్తి కావ్యం

చంద్రికా పరిణయం పూరించినందున 1116 రూపాయల బహుమతి ఇచ్చి సత్కరించారు. తెలంగాణ సంస్థానాలలో మహిళలు రాచరికం చేశారని చక్కటి పరిపాలనను అందించారని ఎంతోమంది కవులను ఆదరించారని ఆమె విపులంగా పేర్కొన్నారు. వివిధ సంస్థానాలలోని రాణుల గూర్చి రాశారు . అమ్మక్కమ్మ లింగమ్మ, మంగమ్మ, చొక్కమ్మ , వెంకట లక్ష్మమ్మ, ఆది లక్ష్మీదేవి, సరళాదేవి, భాగ్యలక్ష్మమ్మ వెంకటరత్నమాంబ, రాణి శంకరమ్మ, మల్లమ్మ , ఎల్లమ్మ లచ్చవ్వ దొరసాని, లక్ష్మీనరసాయమ్మ , గిరియమ్మ , చీలం జానకి బాయి మొదలైన మహిళామణులు సంస్థానాలను చక్కగా పరిపాలించారని ఉదాహరించారు.

ప్రముఖ పద్య కవులైన వేముగంటి నరసింహాచార్యులు, వారి రచనలపై 26 పేజీలలో సుదీర్ఘ వ్యాసము రాసి, హైలైట్ నిలిచిపోయారు. వేముగంటి వారు మహాభాంతంలోని తిక్కన వంటి ఉద్ధనీడ పండితులని ఆమె పేర్కొన్నారు. సంస్కృతాంధ్ర భాషలతో పాటు ఉర్దూ భాషలో చక్కటి పాండిత్యాన్ని సంపాదించుకొని అనేక పద్య కృతులను రాసి పండితలోకం మెప్పు పొందారని, మెదక్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షునిగా పనిచేసేసవయంలో ఎంతోమంది యువ కవులకు ఆదరువుగా నిలిచి, వారిని ప్రోత్సహించారని పేర్కొన్నారు. ఆధునిక ప్రాచీన కవిత్వాల వారధిగా వేముగంటి వారు రాణించారని పేర్కొన్నారు. వేముగంటి వారి రచనల్లో ఆధ్యాత్మికత ఆత్మీయత, జాతీయత, సామాజిక అంశాలు పుష్కలంగా ఉన్నాయని అందుకే వీరి రచనలు సుప్రసిద్ధమయ్యాయని ఆమె పేర్కొన్నారు. పాఠశాలల్లో , విశ్వవిద్యాలయాల్లో వీరి రచనలు పాఠ్యాంశాలుగా తీసుకున్నారని ఆమె పేర్కొన్నారు. వేముగంటి వారు బెజవాడ గోపాలరెడ్డి , డా.బోయి భీమన్న, దాశరథి కృష్ణమాచార్యులు, దేవులపల్లి రామానుజారావు, డాక్టర్ సినారె, పేర్వారం జగన్నాథం గడియారం రామకృష్ణ శర్మ వంటి ప్రముఖులు సమకాలీనులుగా ఉన్నారని, వారి సహచర్యంతో విశిష్టమైన రచనలు చేసి వాసికెక్కినట్లు తెలిపారు . వేముగంటి కృతులు ప్రబోధము, భాష్పాంజలి, అమరజీవి, బాపూజీ, కవితాంజలి, తిక్కన, వీర పూజ, మంజీర నాదాలు, శ్రీ వెంకటేశ్వర ఉదాహరణము , గణేశ ఉదాహరణము, ఆంధ్ర విష్ణువు, భక్త రామదాసు, శ్రీ వాసవీ సరస్వతి వైభవము భావాంజలి, వ్యాసకలాపము, అక్షర దీపాలు, పురుషకారము, మేలుకొలుపు, శ్రీ వివేక విజయము, అమృత వర్షిని, ప్రియదర్శిని, సువర్ణ సుమాంజలి, శ్రీహరి చరణస్మరణ గీతి, శ్రీకృష్ణ లీలామృతం , శ్రీరామ పద్యమాలికా స్తోత్రము, పంచాష్టకములు, తదితర కృతులపై విశ్లేషించారు. ఒకరకంగా చెప్పాలంటే వేముగంటి పద్య కృతులన్నిటిని సాకల్యంగా పరిశీలించి చక్కటి వ్యాసాన్ని పరిశోధకులకు కరదీపికగా, పాఠకాదరణకు పాత్ర మయ్యేలా అందించారు. వేముగంటి వారి జీవితము, సాహిత్యం పై ఒకటి రెండు పరిశోధనలు విశ్వవిద్యాలయాలలో జరిగాయని, అవి సరిపోవని ఆమె పేర్కొన్నారు. వీరి రచనలపై విడివిడిగా విశ్వవిద్యాలయాలలో పరిశోధనలు జరగాల్సిన అవసరాన్ని ఆమె నొక్కి చెబుతూ చర్చించారు.

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర దేవస్థానం ఆస్థాన కవి, పద్యకవి అయిన స్వర్గీయ మామిడిపల్లి సాంబ కవి గారు మరుగున పడిన మహాకవుల జాబితాలో చేరినా, వీరి రచనలను వెలికి తీసుకొని రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వీరి రచనలు ముఖ్యంగా వారి సామాజిక కృతులపై వివరంగా విశ్లేషించారు. 19వ శతాబ్దంలో పద్య కవిగా ద్విపద రామాయణం , రాజేశ్వర సుప్రభాతం వంటి రచనలతో పాటు బుర్రకథలు యక్షగానాలు, నాటకాలు హరికథలు రాసిన కవిగా వీరు సుప్రసిద్ధులని ఆమె తెలియజేశారు . సాంబకవి గారిని డాక్టర్ సినారె వంటి మహాకవి గురుతుల్యులుగా భావించారని పేర్కొన్నారు. భక్తి ప్రధానమైన రచనలతో పాటు దేశభక్తి జాతీయత, మానవతావాదం, సమాజ శ్రేయస్సు. లోటు పాట్లు వీరి రచనల్లో నిండుగా కనిపిస్తాయని ఆమె పేర్కొన్నారు. వీరు పద్య కృతులైన లోభ సంహారము,ముక్తాహారము, మహాదేవరశతకము, జయశ్రీ, మధురఝంకా కరములు, రాజేశ్వర తారావళి వంటి వాటితో పాటు నదులుగా వెలువరించిన ఖండకావ్యాలు వీరి రచనా వైదుష్యానికి ప్రతీకలుగా నిలిచాయనీ, ప్రాచీన ఆధునిక సాంప్రదాయాలతో వీరి రచనలు భాషించాయని ఆమె పేర్కొన్నారు. ముక్తాహారము, కుంజ విహారం, లోభ సంహారము, జయశ్రీ పద్య కృతులను విపులంగా చర్చించారు. కుంజవిహారము పద్యకృతి కి నామౌచిత్యము పాటించారని, రాధా మాధవుల ప్రణయ వృత్తాంతాన్ని ఇతివృత్తంగా తీసుకొని 40 పద్యాలతో కావ్యంగా మలిచారని ఆమె పేర్కొన్నారు. సాంబకవి సంస్కృత, తెలుగు అవధానాలు, తిగళ్ళ శ్రీహరిశర్మ వంటి అవధానులు వెలుగులోకి రావడానికి స్ఫూర్తినిచ్చాయని ఆమె పేర్కొన్నారు. సాంబకవి సాహిత్యం, పద్య కృతులపై చక్కటి పరిశోధన చేసిన శ్రీమతి డా.ఇట్టెడు విష్ణు వందనా దేవి అభినందనీయురాలన్నారు. ఆర్ష కవి దోర్బల విశ్వనాథ శర్మ పద్య కవిత్వం గురించి, వివిధ దైవతాలపై ఆయన రాసిన ఆధ్యాత్మిక గ్రంథాలను చక్కగా విశ్లేషిస్తూ పరిచయం గావించారు. వేములవాడ క్షేత్ర ప్రాశస్త్యంపై, పౌరాణిక గాథలపై ఆమె చక్కగా చర్చించారు. పాండవ మధ్యముడైన అర్జునుని మనువడు నరేంద్రుడు వేములవాడను సందర్శించి, పుష్కరిణిలో స్నానమాడి తన వ్యాధిని నయం చేసుకొన్నారని పేర్కొన్నారు.

మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు గారి సాహిత్యము, వారి ఉన్నత వ్యక్తిత్వం గూర్చి పరిపాలన దక్షతల గూర్చి రాసిన వ్యాసంలో పలు విషయాలు చర్చించారు. పీవీ గారు శ్రీ రామానంద తీర్థ , బూర్గుల రామకృష్ణారావు తదితరుల స్ఫూర్తితో స్వాతంత్ర ఉద్యమంలో చైతన్య శీలిగా వ్యవహరించారని, రాజకీయ పదవుల్లో రాణిస్తూనే, మరో పక్కన సాహితీ రచనా వ్యాసంగాలను, సాహితీ గ్రంథాధ్యయనాలను కొనసాగించారని పేర్కొన్నారు. వీరు నైజాం విముక్తి కాలంలో రాసిన గొల్ల రామవ్వ కథ లో అప్పటి తెలంగాణ జీవభాష పదాలను ప్రయోగించారని ,వరంగల్ లో సదాశివరావు గారితో కలసి కాకతీయ పత్రికకు సారథ్యము వహించి, పాత్రికేయునిగా వ్యవహరిస్తూనే వీరు వివిధ పేర్లతో నాలుగు కథలను రాసినట్లుగా పేర్కొన్నారు. విశ్వనాథ రాసిన వేయి పడగలను సహస్ర ఫణి భూషణ్ పేరున హిందీలో అనువదించి బహు భాషావేత్తగా ప్రసిద్ధిగాంచారని పేర్కొన్నారు. వీరు "లోపలి మనిషి" పేరిట ఆత్మకథను రాసుకున్నారని ఇందులో తన స్వీయ అనుభవాలను ఆనంద్ పాత్ర ద్వారా వ్యక్తీకరించారని అన్నారు.

కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు రాసిన వివిధ రచనలు ముఖ్యంగా ఏకవీర, వేయి పడగలు నవలలను విశ్లేషణాత్మకంగా చర్చించారు.ఏకవీర నవలా నేపథ్యాన్ని చక్కగా వివరించారు. తెలుస్తుంది ఈవ్యాసం రచయిత్రి రచనా కౌశలానికి దృష్టాంతంగా నిలుస్తుంది. తెలంగాణలోని పద్య కవిత్వ వైభవంతోపాటు అవధాన రంగంలో ప్రముఖులైన కవుల మూర్తీభవించిన అవధాన వైభవాన్ని తెలంగాణ అవధాన వైభవము అన్న శీర్షికన చర్చించారు. వేములవాడకు చెందిన ప్రముఖ కవి వేదాంతం కాశీనాథం గారి పద్య రచనల గూర్చి, వారి గొడగూచి పద్య కృతి విశిష్టత గూర్చి కాశీనాథుని కావ్యానుశీలనము అనే శీర్షికన విపులంగా విశ్లేషించారు . వేములవాడ శ్రీ రాజరాజేశ్వర క్షేత్ర పురా వైభవం, ప్రాశస్త్యం గూర్చి చక్కగా పరిశోధించి రాశారు. మహాభారతంలోని వివిధ జానపద పాత్రలు, జానపద గేయాలు, జానపదుల నోళ్ళల్లో నానిన పాటల గూర్చి రసవత్తరంగా రాశారు. 'మహాభారత పాత్రలు జానపద ప్రతీకలు' అనే శీర్షికన రాసినఈ వ్యాసం

ఎంతోమంది ప్రాచీన సాహిత్య కారులు వర్తమాన సాహిత్యకారులు, భక్త శిఖామణులు, సమాజ హితం కోసం రచనలు చేస్తూ ఉద్యమాలు సాగిస్తూ తమవంతు పాత్రను పోషించారు.

పురాణేతిహాసాల పట్ల వారికి గల అవగాహనను వ్యక్తం చేస్తుంది. జానపద సాహిత్యంలో మహాభారత పాత్రలు ఏ రకంగా ప్రచారంలో ఉన్నాయో ఆమె ఈ వ్యాసం ద్వారా విప్పి చెప్పారు. రైతులు వ్యవసాయంలో ఉన్నప్పుడు వర్షాల వల్ల పిడుగుపాటుకు గురికాకుండా ఉండటానికి పాండవ మధ్యముడైన అర్జునుని తలుచుకుంటారు. ఆంధ్ర తమిళ ప్రాంతాల్లో వ్యవసాయ భూముల్లో ఐదు రాళ్ళను పెట్టి గుడులుగా భావించి పంచపాండవులని పూజిస్తారనే పలు విశేషాలను రచయిత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. గిరిజనుల్లో ఒక తెగ అయిన గోండులు పొలాల్లో విత్తనాలు చల్లే ముందు భీమసేనుని అర్చిస్తారని ఆమె పేర్కొన్నారు. మహాభారతంలోని ఏకలవ్యుడు సూతుడు విశ్వరూపుడు, ఘటోత్కచుడు, ఇరావంతుడు పాత్రల గూర్చి, సుభద్ర సారె, ధర్మరాజు జూదము, ద్రౌపది మాటలు.. తదితర అంశాలపై వచ్చిన జానపద గేయాలు గూర్చి చక్కగా చర్చించారు. తాళ్లపాక తిమ్మక్క రాసిన సుభద్ర కళ్యాణము ఆధారంగా వచ్చిన జానపద గేయాల గూర్చి చక్కగా చర్చించారు.

అవిభక్త నిజామాబాద్ జిల్లా నవలా సాహిత్యం పై చక్కటి సుదీర్ఘ వ్యాసము రాశారు. ఈ ఉమ్మడి జిల్లా తొలినాళ్ల నుండే నవలా సాహిత్యంలో కీలకపాత్రను పోషించి మిగతా జిల్లాలకు ఆదర్శంగా నిలిచిందని ఆమె పేర్కొన్నారు. తాను నివసిస్తున్న ఉమ్మడి నిజామాబాద్ జిల్లానే కాక, పొరుగున ఉన్న మెదక్ జిల్లా సాహిత్య రచనలు, అక్కడి కవుల సృజనలపై ఆమెకు చక్కటి పట్టు ఉంది. ప్రజల మనిషి నవల రాసిన వట్టికోట ఆల్వార్ స్వామి నిజామాబాద్ జిల్లాలో జైలు జీవితం గడిపారని ఇక్కడి నుండే వచ్చిన ప్రసిద్ధ నవలా రచయిత లోకమలహరిగారు, డా. కేశవరెడ్డి, 40 నవలలు రాసిన బొమ్మ హేమా దేవి, మరియు కేవీనాథం, తాళ్ల లక్ష్మీనారాయణ గౌడ్, డాక్టర్ అమృతలత, కంఠనీ నేని రాధాకృష్ణ, యాటకర్ల మల్లేష్ ,వి.శాంతి, మేడిచర్ల ప్రభాకర్ రావు ,మల్లవరపు చిన్నయ్య, కస్తూరి మురళీకృష్ణ, సిరిగాద శంకర్ ,డాక్టర్ వి. ఆర్ శర్మ ,దారం గంగాధర్, ఎనిశెట్టి శంకర్, శ్రీమతి అయాచితం స్పందన తదితరులు నవలా సాహిత్యంలో వాసిగాంచారని ఆమె పేర్కొన్నారు. సుమారుగా ఆరేడు దశాబ్దాల నుండి ఇక్కడ నవలా సాహిత్యం వర్ధిల్లుతుందని ఆమె పేర్కొన్నారు.

మాతృభాషలో విద్యాబోధన అనే వ్యాసం అర్థవంతంగా ఉంది. కొంత ఒరవడిలో సాగిన ఈ వ్యాసంలో రచయిత్రి తెలుగు భాష నిర్లక్ష్యానికి ఎందుకు గురవుతుందో స్పష్టంగా వివరించారు. నాగరిక జాతి మాతృభాషలోనే మాట్లాడాలని డబ్ల్యు. ఈట్స్. అనే పండితుడు పేర్కొన్నారు. మాతృభాష తెలుగుకు సంబంధించి సంధి దశలో ఉన్నా ఇప్పటికైనా కళ్ళు తెరవకపోతే పరిస్థితి చేయి జారి పోక తప్పదు. పదసంపదను, సాహిత్య సొబగులను, వ్యాకరణ పారిజాతాలను పలుకుబడులను పట్టించుకోకపోతే వాటి ఉనికి ప్రశ్నార్థకం అవుతుంది. తెలుగు భాష చదివితే 70వేల న్యూట్రాన్లు చురుకువుతాయి. 2002 అంతర్జాతీయ అల్ఫాబేట్ అసోషియేషన్ వారిచే తెలుగు భాష ప్రపంచంలోనే రెండవ స్క్రిప్ట్ గా ఎంపికైంది. ప్రాథమిక విద్యాస్థాయిలో మాతృభాష మాధ్యమం అనివార్యమని భారత రాజ్యాంగంలోని 350(!) , 1964-1966 కొఠారి కమిషన్, 2020 నూతన విద్యావిధానం పేర్కొంది. 30 శాతం మంది మాట్లాడకపోతే ఆ భాష మృత భాషల పరిధిలోకి చేరి పోతుంది. మహాత్మాగాంధీ, కట్టమంచి రామలింగారెడ్డి, డా. అశోక్ పంగారియాలు మాతృభాష ఆవశ్యకత గూర్చి నొక్కి చెప్పారు.

రైతే కథానాయకుడు అనే వ్యాసంలో వ్యవసాయం ఆవశ్యకతను, రైతాంగం లోని ఈతి బాధల గూర్చి వచ్చిన రైతు సాహిత్యం గూర్చి చక్కగా చర్చించారు. దేశానికి వెన్నుముకగా నిలిచే రైతు ప్రస్తావన రుగ్వేద కాలం నాటి నుండే వుంది. హాలుని గాథా సప్తశతిలో రైతు ధాన్యాల ప్రస్తావనలు ఉన్నాయి. ప్రాచీన, జానపద సాహిత్యంలోని దంపుడు పాటలు, భక్తకవి పోతన, శ్రీనాథుని సాహిత్యంలో హాలికుని ప్రస్తావనలు ఉన్నాయి. 1919లో దువ్వూరి రామిరెడ్డి గారు కృషీవలుడి కావ్యం రాశారు. 1937లో గంగుల సాయిరెడ్డి రైతుబిడ్డ మరో వ్యవసాయ కావ్యం వచ్చింది. కర్షక మహాకవి 1938 ఏటుకూరి వెంకటయ్య 27 పద్యాలతో క్షేత్రలక్ష్మీ కావ్యం రాశారు. 1932-33లో కొండవీటి వెంకటకవి కర్షకా అనే మకుటంతో ఒక శతకం రాశారు. వానమామలై వరదాచార్యులు రైతే రాజు అనే గేయనాటికను రాశారు. విప్రలబ్ధ అనే కావ్యంలో 54 గేయాలు రాశారు. కన్నెగంటి వీరభద్రాచార్యులు పేదకాపు కావ్యం రాశారు. వానమామలై జగన్నాథచార్యులు 1980లో రైతు రామాయణం అనే పద్య కావ్యాన్ని రాశారు. నార్ల వెంకటేశ్వర రావుతో సహా కథా రచయిత సింగమనేని నారాయణ జూదం కథ లో రైతుల గూర్చి పేర్కొన్నారు.

రచయిత్రి తెలంగాణ యశోదరులు పేరిట తెలంగాణలో ప్రసిద్ధులైన వారితో పాటు, వెలుగులోకి రాని మహనీయమనిందరినో వెలుగులోకి తెచ్చే ప్రయత్నం సఫలీకృతమైనది. ఈ పుస్తకం పరిశోధకులకు ఎందరికో దారి దీపంగా నిలుస్తుంది అనడం అతిశయోక్తి కాదు. ఆ బాలగోపాలం చదివి భద్రపరచుకున్నదగిన పుస్తకం మిది. డా.సునీత సాహిత్య వికాసం అధ్యయనం, రచనా వ్యాసంగం తో ముడిపడి తన రచనలను పత్రికలకు వంవుతూ. అచ్చులోకి తేవడం.అభినందనీయం.

-సంకేపల్లి నాగేంద్రశర్మ,
8074826371

తార కాని తార

ఇప్పుడే పంజరం గదులు తెరుచుకున్నాయి
కొత్తగా రెక్కలు మొలిచినట్లున్నాయి
ఎగరాలని ఆరాటం కనిపిస్తున్నది
చుట్టూ జనం కంచె కట్టి నిలుచున్నారు.
ఇనుపగదుల్లో ఇరకాటపు బ్రతుకులు వీడి
పక్షిలా గగనవీధులోకి ఎగిరిపోయే దారి దొరికింది
పంచభూతాలు నాకోసం పోటీపడుతున్నాయి
వాటి ఒడిలో నాకు సేదనివ్వాలని.
ఆకాశం పందిరి కింద అవని మంచం
ఎంత విశాలంగా పరుచుకున్నదో భలే ముద్దుగా
నా రాజప్రాసాదంలో నన్ను దించండి
ప్రశాంతంగా చల్లని గాలిని ఆస్వాదించాలని ఉంది.
నింగికి, నేలకు మధ్య దూరం కరిగిపోయింది
మనసు పతంగం దారాన్ని వదిలేసి ఎగురుతున్నది
పాలెగాళ్ళు పందిరి మంచం వేడికి పరిగెత్తి పోయారు
నేనిప్పుడు స్వేచ్ఛాజీవిని
భవబంధాలకు దూరంగా మెరిసే
తార కాని తారను...

-శింగరాజు శ్రీనివాసరావు
9052048706

తెలుగు సాహితి సదస్సు
హైదరాబాద్
బ్రహ్మశ్రీ పెండ్యాల కిషన్ శర్మ గారిచే విరచితమైన పద్యకావ్యం
సుందరకాండము
ఆవిష్కరణ మరియు అంకితోత్సవ సభ
తేది 09-11-202 గురువారం రోజున ఉ॥ 10-00 గం॥లకు
వేదిక : కే.వి. రమణాచారి గృహ సముదాయపు క్యాంపు కార్యాలయం (సఫేజీ రెసిడెన్సీ) ఎ.సి. గార్డెన్స్, మహవీర్ హాస్పిటల్ ఎదురుగా, హైదరాబాద్
- ముఖ్య అతిథి, గ్రంథావిష్కర్త -
శ్రీ కే.వి. రమణాచారి గారు
తెలంగాణ ప్రభుత్వ సలహాదారు
- సభాధ్యక్షులు -
శ్రీ విహారి గారు
ప్రముఖ కవి, సాహితీవేత్త
- విశిష్ట అతిథులు -
ఆచార్య మాసన చెన్నప్ప గారు, విద్వత్కవి, ఆధ్యాత్మిక చింతనా శిరోమణి, ఉస్మానియా విశ్వ విద్యాలయ తెలుగుశాఖ పూర్వ అధ్యక్షులు
శ్రీ గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు గారు, ప్రముఖ సాహితీవేత్త
- అంకిత గ్రంథ స్వీకర్త -
ఆచార్య దేవరాజ రాంభావు గారు
ప్రముఖ ఔషధ విజ్ఞాన శాస్త్రవేత్త మరియు విశిష్ట కవి
- ఆత్మీయ అతిథులు -
శ్రీ శ్రీ పెరుంబుదూర్ శ్రీరంగాచార్యులవారు, పరిశోధనాపారంగతులు, విద్వద్వతంసులు
శ్రీ గౌరీభట్ల మెట్రామ శర్మ గారు, అవధాన వరేణ్యులు, విద్వత్కవివరేణ్యులు
శ్రీ ముదిగొండ విశ్వేశ్వర శాస్త్రి గారు, శిష్టసాహిత్య పరిష్కులు, విశిష్ట విద్వత్కవులు
తాళ్ళపల్లి మురళీధర్ గౌడ్ అధ్యక్షులు, తెలుగు సాహితీ సదస్సు
తుమ్మూరి రామోహన్ రావు కార్యదర్శి, తెలుగు సాహితీ సదస్సు
సాహితీ ప్రియులందరికీ సాదర ఆహ్వానం

చాంపియన్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో వాసిరెడ్డి మల్లీశ్వరికి స్థానం

చాంపియన్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో రాజా వాసిరెడ్డి మల్లీశ్వరికి స్థానంచాంపియన్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో గజల్ క్వీన్ రాజా వాసిరెడ్డి మల్లీశ్వరికి స్థానం దక్కింది. తొలి తెలుగు గజల్ వాగ్గేయకార

ఈనెల 14న బహుముఖీన సాహితీవేత్త నిజాం వెంకటేశం స్మారక పురస్కారాలు...

నిజాం వెంకటేశం బహుముఖీన సాహితీవేత్త. కవిత్వం, కథ, నవల, నాటకం, పాట, సినిమా, ఫిల్మ్ సొసైటి, అనువాదం తదితర ప్రక్రియల్లో విశేష అధ్యయనం చేసినవారు. ప్రనంగాలలో వందలాది విషయాలను సమకాలీన రచయితలతో, కళాకారులతో పంచుకొని యువతరాన్ని ఎదిగించినవారు. వారికి తెలియని విషయం లేదు అన్నట్టుగా సమస్త విషయాలపై తమ అవగాహనను తెలిపేవారు. అనేక గ్రంథాలను తెలుగులోకి అనువదించారు. ఆయన రాసిన దానికన్నా రాయనిదే ఎక్కువ. ఒక ఆర్గనైజర్‌గా, సాహిత్య సామాజిక సాంస్కృతిక ఉద్యోగ రంగాలలో నిరంతరం కృషి చేస్తూ వచ్చారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా పలు రచనలు ప్రచురించడంలో క్రియాశీలంగా ప్రోత్సహించినవారు. ఆయన పేరిట ఒక సాహిత్య పురస్కారం నెలకొల్పడం సముచితంగా ఉంటుందని సాహితీమిత్రులు, కుటుంబ సభ్యులు భావించారు. అలా ఒక కమిటీ ఏర్పడింది.

ఈ సంవత్సరం నిజాం వెంకటేశం జన్మదినం నవంబర్ 14న నిజాం వెంకటేశం స్మారక పురస్కారాలు అందించాలని భావించాము. సాహిత్య విమర్శ ప్రక్రియలో ఒక పురస్కారం, యువ కవికి ఒక పురస్కారం ఇవ్వాలని భావించాము. పత్రికా ప్రకటన,



వాట్సప్ మెసేజ్‌ల ద్వారా సమాచారం తెలుసుకున్న సాహితీవేత్తలు ఈ పురస్కారం కోసం తమ రచనలు అందించారు. వాటిని అనేక కోణాల్లో పరిశీలించాము. సాహిత్య విమర్శ గ్రంథాలు ఎంతో వైవిధ్యపూరితంగా, లోతైన అవగాహనతో మాకు అందినవాటిలో ఉన్నాయి.

ఐతే సాహిత్య విమర్శ అంటే సాహిత్యంలోని అన్ని ప్రక్రియల గురించి సాధికారికంగా పరిశీలన, అధ్యయనం, విమర్శ, విశ్లేషణ చేయగలగాలి. అప్పుడే వారు సాహిత్య విమర్శకులుగా అన్ని ప్రక్రియలను పట్టించుకున్నవారవుతారు. మాకు వచ్చిన సాహిత్య విమర్శ గ్రంథాల్లో ఈ లోపం స్పష్టంగా కనిపించింది. కొందరు వచన కవిత్వం మీద మాత్రమే రాశారు. కొందరు నాటకాలమీదే రాశారు. కొందరు ఒక ప్రాంతం గురించే రాశారు. కొందరు కథ గురించే రాశారు. అన్ని ప్రక్రియలను సముతుల్యంగా పట్టించుకున్న సమగ్ర సాహిత్యం విమర్శగా చెప్పుకోదగిన రచనలేవీ అందలేదు. దీంతో మా ఆశయం నెరవేరలేదు. నిజాం వెంకటేశం సమస్త ప్రక్రియలను, సమతుల్యంగా పట్టించుకొని ప్రోత్సహించారు. విశ్లేషించారు. విమర్శించారు. ప్రశంసించారు. అలాంటి సమతుల్య సాహిత్య విమర్శకులుగా సాహిత్య విమర్శకులు ఎదగాల్సిన అవసరం ఎంతో ఉందని వచ్చిన రచనలు చూస్తే అవగతమవుతున్నది.

సీమాంధ్ర ప్రాంతం నుంచి వచ్చిన సాహిత్య విమర్శ గ్రంథాల్లో తెలంగాణ రచయితల ప్రక్రియల ఊసే లేదు. అంటే మొదట్నించి తెలంగాణ, ఆంధ్రా, రాయలసీమ, ఉత్తరాంధ్ర అనే విభాగాలు మానసికంగా సాహిత్య విమర్శకుల్లో దశాబ్దాలుగా అలాగే కొనసాగుతున్నాయి. కానీ, మాట్లాడేటప్పుడు రెండు తెలుగు రాష్ట్రాలు అని కలిపి మాట్లాడుతున్నారు. సాహిత్య విమర్శలో రెండు తెలుగు రాష్ట్రాల సాహిత్య ప్రక్రియలను సమతుల్యతతో పట్టించుకున్న సాహిత్య విమర్శకులు



ఒక్కరైనా కనపడలేదు. అనగా సాహిత్య విమర్శ ఒక ప్రక్రియగా వికాసం చెందడంలేదు. మరో మాటలో చెప్పాలంటే సాహిత్య విమర్శకులు సమగ్ర, సమతుల్య దృష్టితో సాహిత్యాన్ని పట్టించుకోవడం లేదు. తమకు అభిమాన పాత్రమైన ప్రక్రియను, ప్రాంతాన్ని, రచయితను మాత్రమే పట్టించుకొని, తన ఎకనమిక్ సెమినార్‌లు, పత్ర సమర్పణలు, సిద్ధాంత గ్రంథాలు పరిధికి, పరిమితికి లోబడి రాస్తున్నారు తప్ప, సాహిత్య విమర్శకులుగా ఎదగడంలేదని స్పష్టమవుతున్నది. సాహిత్య పరిశీలన, సాహిత్య విశ్లేషణ, సాహిత్య విమర్శ, సాహిత్య ప్రశంస, సాహిత్య పరిచయం, సాహిత్య సమీక్ష, సాహిత్య అనుశీలన మొదలైనవి వేర్వేరు ప్రాధాన్యత గలవి. పీఠికలు, ముందుమాటలు మరో ప్రత్యేకమైన ప్రక్రియ. సాహిత్య విమర్శ అనేది ఒక స్వతంత్ర ప్రక్రియ. సాహిత్య సమీక్ష, విశ్లేషణ, పీఠికలు, సాహిత్య పరిచయం స్వతంత్ర ప్రక్రియలు కావు. అవి ఆయా రచనలపై ఆధారపడి కొనసాగుతాయి. సాహిత్య విమర్శ అనేది స్వతంత్రంగా ఒక విజన్‌తో సాహిత్య రంగాన్ని పరిశీలించి విమర్శిస్తుంది. సాహితీవేత్తలకు గురువుగా, బోధకుడిగా, గైడ్‌లైన్స్ అందిస్తుంది. ముందు ముందు ఇంకా ఎలా అభివృద్ధి చెందాలో సూచిస్తుంది. మార్గనిర్దేశనం చేస్తుంది.

కొందరు సాహిత్య విమర్శ కృతజ్ఞత లేని ప్రక్రియ అని అంటుంటారు. అది సరికాదు. ప్రతిపక్షంలా ఆయా రచనలపై విమర్శ చేసినప్పుడు రచయితల ప్రతిస్పందన వేరుగా ఉంటుంది. ఒక గురువుగా గైడ్‌లైన్స్ ఇచ్చే సాహిత్య విమర్శ పట్ల రచయితలకు అపారమైన గౌరవం ఉంటుంది. ఆ స్థాయికి ఎదగడం సాహిత్య విమర్శకుల కర్తవ్యం. సాహిత్య విమర్శ ఎలా ఉండాలి? అనే విషయం పై కూడా ఎందరో తమ దృష్టికోణంతో సాహిత్య విమర్శ వెలయించారు. అవి యువ రచయితలకు సాహిత్య ప్రక్రియల ఎదుగుదలకు దోహదపడతాయి. రచయితపై స్వారీ చేసి విమర్శించే విమర్శ సద్విమర్శ

కాబోదు. సాహిత్య విమర్శకుడు ప్రతిపక్ష నాయకుడిలా తనకు నచ్చని విషయాలను విమర్శించినప్పుడు కృతజ్ఞత ఎలా ఆశిస్తారు. ఈ విషయం సాహిత్య విమర్శకులు గమనించాల్సిన అవసరం ఉంది.

విషాదకరమైన విషయం ఏమంటే ఏ ఒక్కరూ సాహిత్య ప్రక్రియలన్నిటిని పట్టించుకోవడం లేదు. తెలంగాణ ప్రాంత సాహిత్యాన్ని ఇతర ప్రాంతాలవాళ్ళు అసలు పట్టించుకోలేదు. తెలంగాణ ప్రాంత సాహిత్య విమర్శకులు ఆంధ్ర ప్రాంత రచయితలను బాగానే పట్టించుకుని తెలంగాణ రచయితలను అప్రధానం చేశారు. ఇప్పుడిప్పుడే తెలంగాణ ప్రాంత సాహిత్య ప్రక్రియలపై సాహిత్య విమర్శ వెలువడుతున్నది. కాలేజీల్లో, యూనివర్శిటీల్లో సెమినార్లు నిర్వహించడం ద్వారా వస్తున్న రచనలే ఎక్కువ. స్వతంత్రంగా అన్ని ప్రక్రియలపై సాహిత్య విమర్శ చేస్తున్నవారు అరుదు.

ఇలా అనేక కోణాలు పరిశీలించిన మీదట మాకు అందిన రచనల్లో ఎలా ఎన్నిక చేయాలి? అనే ప్రశ్న మళ్లీ ఎదురైంది. సరే ఇప్పటికి అందిన రచనల్లో ప్రక్రియల వారీగా చేసిన సాహిత్య విమర్శ గ్రంథాలకే ఇవ్వాల్సిన అనివార్యత ఏర్పడింది. ఆయా ప్రక్రియల్లో రెండు తెలుగు రాష్ట్రాలను పట్టించుకున్నవారు తక్కువ. అందువల్ల ఏదో ఒక రాజీకి రాక తప్పలేదు. కథ, కవిత్వం, స్త్రీల రచనలు అనే మూడు ప్రక్రియలలో ఎంపిక చేయడం జరిగింది. పదివేల నగదు పురస్కారానికి బదులుగా ఐదువేలు పెంచి ఈ ముగ్గురికి ఐదువేల చొప్పున మొత్తం పదిహేను వేల రూపాయలు పురస్కారంగా ప్రకటించబడుతున్నది. అవి:....

1.డా॥ ఎం. దేవేంద్ర
తెలంగాణ కథావర్తనం
విమర్శనాత్మక వ్యాసాలు
2.డా॥ వి. త్రివేణి
భరిణ స్త్రీల రచనల విమర్శ
సాహిత్య వ్యాసాలు
3.గోపగాని రవీందర్
శతారం (కవిత్వ విమర్శ)
కవిత్వ విమర్శనా వ్యాసాలు.

ప్రోత్సాహక బహుమతిగా గజ్జెల రామకృష్ణ–"**చంద్రుడు లేని ఆకాశం**" కు యువ కవి పురస్కారం క్రింద 5 వేల నగదు మొమెంటో, శాలువాతో సత్కరించడం జరుగుతున్నది. పదిహేడవ వయస్సులోనే కవిత్వం రాయడంతోపాటు పుస్తకం వేసినందుకుగాను శిల్పి చంద్రశేఖర్ (17 సం॥లు) **కాలుతున్న వెన్నెల (కవిత్వం)కు** ప్రోత్సాహక బహుమతి అందజేయబడుతుంది. నిజాం వెంకటేశం స్మారక పురస్కారం కోసం రచనలు పంపినవారందరికి అభినందనలు. వారికి సాహిత్య విమర్శకు ఉపయోగపడే కొన్ని పుస్తకాలు సేకరించి పంపించాలనుకుంటున్నాము. తద్వారా సాహిత్య విమర్శకులుగా సమాచారం లోపం లేకుండా సమగ్ర సాహిత్య పరిశీలన, విమర్శ చేయడానికి తోడ్పడుతుంది. వారితో సంభాషించి వారికి అవసరమైన, లభ్యమైన పుస్తకాలను అందించడానికి, వారు స్వీకరించడానికి అంగీకరించారు. వారికి అభినందనలు. త్వరలో వారికి కొన్ని పుస్తకాలు పంపబడతాయి.

న్యాయ నిర్ణేతలుగా బి.ఎస్. రాములు, ఆడెపు లక్ష్మీపతి, ఎ. గంగారెడ్డి, కోడం పవన్ కుమార్, సిహెచ్‌వి. ప్రభాకర్‌రావు, డా॥ ఎ. సూర్యప్రకాష్ వ్యవహరించారు. వీరికి నిజాం వెంకటేశం కుటుంబం తరఫున అభినందనలు, దన్యవాదాలు.

ఈ పురస్కారాల సభ నిజాం వెంకటేశం జన్మదినమైన 14 నవంబర్ 2023 నాడు ఉదయం



11-0 0 గంటలకు నిజాం వెంకటేశం గారి స్వగృహ ప్రాంగణం (బెల్వెడేరా అపార్ట్మెంట్లు , పద్మారావు నగర్ సికింద్రాబాద్ లో జరిగే పురస్కారాల సభలో నగదుతో

పాటు మెమెంటో శాలువాతో సత్కరించడం జరుగుతుంది. సభానంతరం భోజనం ఏర్పాటు ఉంటుంది.

తొలిసారి ప్రవేశ పెట్టిన నిజాం వెంకటేశం స్మారక సాహిత్య విమర్శ పురస్కారానికి రచనలు పంపి సాహిత్య విమర్శ ఎలా అవగాహన కలిగించిన సాహిత్య విమర్శకులకు ధన్యవాదాలు. పురస్కార విజేతలకు అభినందనలు.

–బి ఎస్ రాములు.

– అవార్డు కమిటీ– ఆహ్వాన సంఘం.

అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక వికారాబాద్ వారం వారం నిర్వహిస్తున్న వాట్సప్ కవిసమ్మేళనంలో భాగంగా ఈ వారం 'దీపావళి' శీర్షికలో వచ్చిన కవితల్లో మేలైనవి కొన్ని..

నిర్వాహకులు –కమలేశ్
–దోరవేటి, అనంత వ్యవస్థాపకులు

వెలుగు రేఖలు

తే.గీ॥
అంబరము వీడి తారలు సంబరముగ
వత్సరము కొక్కమారు యీ వసుధ జేరి
చిందులాడెనా యన్నట్లు చిచ్చుబుడ్లు
తారజువ్వలు యింటింట తళుకులీను

తే.గీ॥
సుర్రుసుర్రుమనుచు కొన్ని సుందరముగ
రివ్వు రివ్వని మరికొన్ని సవ్వడులుగ
యమవసను పున్నమను జేయ నాతురుతగ
నాకసమ్మున కెగరెనా నందముగను.

తే.గీ॥
రేయి పగలును జూడగ రెండు నేడు
తేడ లేకుండ కనిపించు తేజమందు
యిట్టిదౌ వింత లోకాన యెట్టి విధము
మరల కనిపించబోదను మాట నిజము.

తే.గీ॥
దివ్యదీపాల కాంతుల నవ్య పథము
వెలుగులను పంచు కిరణాల వేల్పు వోలె
ఇంటి ముందర చీకటి యిడుమలన్ని
తొలగజేయ టపాసులు తోడు దెచ్చె

తే.గీ॥
నవ్వులన్నవి యందాల నగలు జేసి
పువ్వులను గుచ్చి ధనలక్ష్మి పూజజేసి
దివ్వె వెలిగించగా నేడు దిగులుబాపి
వెలుగు రేఖలు దిశలెల్ల వేడ్కలాయె.

శా॥
కాలుష్యంబవిరామ శబ్దతులన్
గావించు దీపావళీ!
మేలున్ దప్ప మరేమి జేయనని యే
మేళంబుతో వచ్చినన్
కేలన్ నీ పదపంకజంబుగడిగీ

చిచ్చు బుడ్డి

మట్టి దీపాలు బెస్త కేరిలో
కొన్నోని వచ్చేటప్పుడు
టపాకాయల దుకాణాల దగ్గరే
మనసును కట్టేసి వస్తుంటి!.

ఇంటికొచ్చాక...
మళ్ళీ మళ్ళీ బయటికెళ్లి చూసొస్తుంటి
ఎవరివైనా చెప్పుల సప్పుడు వినబడితే
కండ్లు రాకెట్టై తిరుగుతుండే
ఆ రోజు ఇంట్లో ఏ పని చెప్పినా
కాళ్ళు భూచక్రాలై పరుగెడుతుండే!

ఏ ఇంట్లోనైనా టపాకాయల సప్పుడొస్తే
అమ్మ దగ్గర మిరపకాయ
టపాసునై పేలుతుంటి
నాయ్న వొస్తున్నడంటే
మనసు చిచ్చుబుడ్డై వెలుగుతుండే!
ఇంటిని దీపం చేసేటప్పుడు
అమ్మ ఆరిపోని వెలుగయ్యేది

దివిలె పండుగ

రత్నతుల్య ధాన్యరాసులు కొలువుండి
రైతు జీవనమున రమ్యముగను
సంతసము నొసంగు సంబరమేదన్న
దివిలె యనగనొప్పు భువినినెపుడు

రమణి సీత తోడ రాముడయోధ్యకు
తరలి వచ్చినట్టి తరుణమందు
ధరణు క్రూరుడైన దనుజుడు దివికేగి
జరుపుకున్న దివిలె జగములేలె

రంగవల్లులమరి ముంగిల్లు శోభిల్లు
దీపకాంతి తోడ దీప్తినొందు
పాపములను బాపి పరిఢవిల్లు వెలుంగు
లెల్లజనుల సంతసిల్లజేయు

కులమతాలు కూర్మితో నందరు
ప్రతి గృహమున భక్తి పరవశమున
మునిగి తేలు చుంద్రు ముదమార దివ్వెల
పండుగ సమయాన భవ్యముగను

మదిని యజ్ఞాన తిమిరాలు మాసిపోవ
వెలుగు విజ్ఞాన వీచికల్ వేడ్కజేసి
దిక్కులన్నిట చాటుము దివ్యముగను
దివిలె పండుగ మనకిచ్చు దివిజ సుఖము

–సుప్పని సత్యనారాయణ

రక్ష

కామాంధుల బారి నుండి
నవసమాజ స్త్రీ జాతిని కాపాడే
రక్ష కావాలి మన ఈ దీపావళి
రాక్షస చర్యలకు పాల్పడే
మదమెక్కిన మానవమృగాల బారి నుండి
పసిపాపలకు విముక్తి ని
కలిగించి రక్షించే
రక్ష కావాలి మన ఈ దీపావళి
ప్రేమ పేరుతో మోసం
చేసే మాయగాళ్ల నుండి
ఆడకూతుళ్లకు విముక్తి కలిగించే
రక్ష కావాలి మన ఈ దీపావళి
చెడు వ్యసనాలకు బానిసై
బంగారు భవిష్యత్తును
బుగ్గిపాలు చేసుకునే యువత
ఆలోచనా విధానంలో మేల్కొలుపు
తెప్పించే రక్ష కావాలి మన ఈ దీపావళి

మా దీపావళి

వాడిన మోముల వీడని చిరునవ్వు
తీర్చగా నిండుగ దివ్వెయొకటి
నిరుపేద వాకిట సిరిమల్లె పందిరై
దీనత్వమూడ్చగా దివ్వె యొకటి
మబ్బుల గుంపులు మంచి ధాన్యాలిడి
దీక్షగా పోషింప దివ్వె యొకటి
కల్మష మన్నదే కనరాని లోకము
దీపించ ముంగిట దివ్వె యొకటి.
చిక్కుముడులు వీడి చక్కని బాటల
తల్లి పాట లందు తరలిపోగ
ధీర విక్రమజయ శూరులు మొలకెత్త
దీప్తి తోరణాల దిక్కులలరె.

చేతులు చేతలు చేరువై కార్యాలు
దిద్దగా తిలకాలు దివ్వె యొకటి
అక్షర బాణాలు లక్ష్యాలు ఛేదించ
దివి తాకె నీనాడు దివ్వె యొకటి
భారత భాగ్యాల భాసుర రాజ్యమై
దేదీప్యమానమై దివ్వె యొకటి
మనదేశరూపమే మన కపురూపమై
తేజమ్ము నింపగా దివ్వె యొకటి.

దీనహీన జనుల దీపావళి వెలయ
కృషిని చేయు హితుల ఋషుల జగతి
పాదు గొలుపు నాడు మోదమైయామోద
యోగ్యమగుచు నిలుచు భాగ్యలక్ష్మి

–ఆకుల మల్లికార్జున్
7416067335

కేళీవిలోలంబుగా
చాలుంజాలని నీకు మ్రొక్కెదను
సాష్టాంగంబు నే జేయుచున్

–కమలేశ్
9160396596

నాయ్న రాంగనే బస్తను అందుకొని
నాకిష్టమైన చిచ్చుబుడ్డిలను దాసుకుంటుంటి!
కొసరి కొసరి కాల్చిన టపాసుల నడ్డ
సుర్ సుర్ బత్తులు దీనగోయలై
వీధి సందునంతా పలకరించేవి!

పండగంటే ఒకప్పుడు
పాత రోజుల్ని మతి జేస్కొవడమే
ఇప్పుడు దీపావళి అంటే
రాత్రి తాగేసిన సీసలో
రాకెట్లను సాగనంపుతున్నరు!

పండగంటే కొత్తబట్టలు వేసుకోకున్న
మనసును
దీపాల వెలుతురులో ఉతుక్కోవాలి
మనుషులు దీపాలుగా మారి
బతుకు వాకిట్ల చిచ్చుబుడ్డె వెలగాలి!

–చిగురాల్ పల్లి ప్రసాద్
పరిగి

చీకటి వెలుగులు

బ్రతుకు బాటలోని
గాఢాంధకారాలను పారద్రోలి
కాంతికిరణాల వెదజల్లుతూ
జీవితాన్ని వెలుగుబాటలో సాగేలా
అనుక్షణం వెన్నంటి రావా...! ఓ దీపావళి
నరకాసురవధ అన్నారుకానీ... మనలోని
రాక్షసప్రవృత్తిని పారద్రోలి
మంచిని మానవత్వాన్ని ఆకళింపు చేసుకొని
బ్రతుకుబాటలో వ్యథనెరుగని పయనమై రావా
ఓ దీపావళి .
టపాసులు,చిచ్చుబుడ్లు,
కాకరవత్తులు,
విష్ణుచక్ర,భూచక్ర మెరుపు మిణుగురులు
ఆనందాల్నింపంచే అహ్లాదక్షణమై
రావా...! ఓ దీపావళి
పిల్లలకేరింతలు
పెద్దల హూంకరింపులు
అద్భుత దృశ్యాలు
ఆనందపారవశ్యాలు కలగలిసి
రావా...! ఓ దీపావళి

– అప్పసలి ఆంజనేయులు
గ్రామం: వెల్చాల్

లక్ష్యసాధనకై అహర్నిశలు కష్టపడుతూ
జీవించే ప్రతిఒక్కరి
ఆత్మవిశ్వాసాన్ని చెదరనివ్వకుండా
మనో నిబ్బరాన్ని కలిగించి
వారికి అండగా నిలబడే
రక్ష కావాలి మన ఈ దీపావళి

–జోరు పవిత్ర క్రిష్ణ

దీపపు కాంతుల ఆవళి
శుభములనిచ్చే శోభావళి
సరదాల సంబరాల అనురాగాల రవళి
ఇంటి లోగిళ్లలో ప్రమిదల వెలుగుల రంగేళి
కంటి ప్రమిదలలో ఆనంద కాంతులకేళి
తారా జువ్వల పువ్వులతో
చిన్నారుల కేరింతలాడే కథాకళి
భారతీయ సంస్కృతికిది రూపావళి
పండగై వచ్చింది దీపావళి...
జ్యోతులతో వెలిగిండి ప్రతి వాకిలి
చీకటిని చీల్చెను దీపావళి
సంపదతో వెలగాలి ప్రతి లోగిలి

దీపాల వరుస

కం:వెలిగించుము దీపాలను
తొలగించుము మనసులోని
దురిత తమములన్!
కలహాలకు దరిజేరక
విలువలతో బ్రతుకువాడు
వెలుగగ ధరలో.
కం: నరకాసుర సంహారిణి
సిరులిచ్చెడి కల్పవల్లి చిన్మయ రూపా!
కరివరదుని హృదయేశ్వరి
కరుణించుము లక్ష్మి మమ్ము
కరుణా సింధూ.
కం:వెలుగులలో జీవమ్ములు
విలువలతో సంచరించు
విశ్వమునందున్!
యులుపెరుగక సూర్యుడు తన
వెలుగులతో జేయు
యాత్ర వేకువ తోడన్!
కం:మారణ హోమము జేసెడి
వారిని శిక్షించు మనుచు
వందన మిడుచున్
హారతు లిచ్చియు లక్ష్మికి
కోరికలను కోరు
చంద్రు కూరిమి తోడన్!.
కం:లోపమ్ములు సరి జేయుచు
దీపమ్ములు శుభమొసగును
దిన మేదైనన్!
యాపదలను రానీయక
కాపాడును లక్ష్మి సతము
కారుణ్యముతో!
తే.గీ:దీపకాంతుల
వెలుగులు దీవెనొసగు
కాకరొత్తుల మెరుపులు కాంక్ష దీర్చు
చిచ్చు బుడ్లను రాకెట్లు సిరుల నిచ్చు
అన్ని శుభములు కలగాలి మిన్న గాను.
కం: దీపాలు వెలుగు జిమ్ముచు
కోపాలను కాల్చి వేసి
గూర్చును సుఖమున్!
లోపాలు లేని నడతే
మాపాలిటి కాంతి రేఖ
మెరుపై మురియున్!.
కం: వెలిగించుము దీపాలను
తొలగించుము చీకటులను
దుర్మాగములన్!
కలలో నైనను మరువకు
విలువైనది మానవతయె
విశ్వములోనన్!

–మహ్మద్ షరీఫ్
9866560527

రావమ్మ మాయమ్మ..

ఆధునిక విద్యుద్దగధగల్లో
మిరుమిట్లు గొలిపి
ఉరిమి చూసే టపాసుల నడుమ
నేనెక్కడమ్మ?
అడిగే దీపాన్ని ఊరడిస్తూ
ఆ తల్లి;
నిష్కల్మష మనుషుల్లో
దేదీప్యమానమై ఉన్నావు.
మంచి మనసున్న వారి
చిరునవ్వులలో సిరిమై..
అడగని నా ప్రశ్నకి
సమాధానంగా...
ఆ సత్యభామ వస్తుందిలే
ఏదో ఓ రూపాన
నరకాసురులెందరినో
మట్టుపెట్ట.
ఈ మహిలో..
కలిలో..
ఈ దీపావళే సూచికగా
అందుకే నీ అగోచర పావన
చరణాలపై నా శిరస్సునుంచి
మొక్కుదునమ్మ..
రావమ్మా జగజ్జనని.
రామ పాలన తేవడానికి

–శ్రీని.
9396988055

దీపావళి

–పసుల చంద్రశేఖర్,
అక్కాపూర్

దివిలె మణిపూసలు

జువ్వలు వెలిగించడం
పువ్వులు పూయించడం
ఇదే నా దీపావళి?
నవ్వులు గురిపించడం!

దోపిడి నరికట్టడం
ద్రోహుల నెదిరించడం
ఇదేనోయ్ దీపావళి
దాడుల నాపేయడం!

కొంత మంది నవ్వడం
కొంత మంది ఏడ్వడం
ఇదే నా దీపావళి?
కొంత మంది ఎదుగడం!

సకల జనులు నవ్వడం
సకల జనులు ఎదగడం
ఇదేనోయ్ దీపావళి
సకల జనులు కూడడం!

పిల్లల పీడించడం
పేదల బాధించడం
ఇదే నా దీపావళి?
హత్యల జేయించడం!

పిల్లల గాపాడడం
వృద్ధుల బోషించడం
ఇదేనోయ్ దీపావళి
మహిళల జేవించడం!

డబ్బు దీసుకోవడం
ఓట్ల నమ్ముకోవడం
ఇదే నా దీపావళి?
హక్కును కోల్పోవడం!

డబ్బు దీసుకోవడం
ఓట్లు వేయకుండడం
ఇదేనోయ్ దీపావళి
మోసము నోడించడం!

సాయపడితె ఏమౌను?
బాగుపడితె ఏమౌను?
కష్టాల కడలి నుంచి
బయటపడితె ఏమౌను?

సాయపడితె దీపావళి
బాగుపడితె దీపావళి
కష్టాల కడలి నుంచి
బయటపడితె దీపావళి!

జ్ఞాన కాంతి నేమందురు?
మనశ్శాంతి నేమందురు?
దుఃఖితులకు మేలు చేసె
ధర్మ నిరతి నేమందురు?

జ్ఞాన కాంతి దీపావళి
మనశ్శాంతి దీపావళి
దుఃఖితులకు మేలు చేసె
ధర్మ నిరతి దీపావళి!

సత్కార్యము నేమందురు?
సంతోషము నేమందురు?
సమతామమతలు కూడిన
సద్బుద్ధిని ఏమందురు?

సత్కార్యమె దీపావళి
సంతోషమె దీపావళి
సమతామమతలు కూడిన
సద్బుద్ధియె దీపావళి!

అనురాగము నేమందురు?
ఆనందము నేమందురు?
బడుగులు బలహీనుల
అభ్యుదయము నేమందురు?

అనురాగమె దీపావళి
ఆనందమె దీపావళి
బడుగులు, బలహీనుల
అభ్యుదయమె దీపావళి!

–వడిచర్ల సత్యం
7989511543

దీపావళి

అమావాస్య రోజున
దీపాల పున్నమి
ప్రజల కన్నుల్లో
ఆనందాల వెన్నెలయ్యింది
ఆకాశంలో
అంతర్నామైన తారలు
భూలోకంలో టపాసులై
వెలుగులను వెదజల్లుతున్నాయి
ఇదంతా
గోపాలుని పుణ్యమే
ఈ దీపావళి వల్ల
మా జన్మ ధన్యమే
ప్రజల కన్నీటికి కారణమైన
నరకాసురుని పీడ
సత్యభామ సహకారంతో
విరగడచేశాడు
అమావాస్య లాంటి
జనుల బతుకుల్లో
వెలుగులు నింపాడు
చెడు విర్రవీగినా
చివరకు గెలిచేది
మంచి మాత్రమే.
నరకసుర సంహారం జరిగిన వేల
ప్రజల హృదయాలు పొంగిన
హేల
మనసులోని ఆనందం
కన్నుల్లో కాంతులై
దీపాలు వెలిగించే మేళ

–సంజి మల్లేష్
9542628014

పుస్తక సమీక్ష

"జననికే కేయి ధర్మ నిర్వహణలో" డా॥బి. జయరాములు

త్రేతాయుగంలోని శ్రీ మద్రామాయణం లోని కైకేయి పాత్ర విద్యుక్తధర్మ నిర్వ హణలో, జననిగా ఆమె ధార్మికతను సవిమర్శనాత్మకంగా విశ్లేషించి ప్రవచన ధారగా డా॥ బ్రాహ్మ ణపల్లి జయ రాములు ఆసక్తికరమైన పుస్తకం వెలువరించారు. శ్రీరామాయణ అంత రంగాన్ని అవలోకించిన, పురాణేతిహాస విద్వత్కవి, సాహితీ వేత్త డా॥ జయరాములు కైకేయి స్వార్థం కోసం కాకుండా లోకహితం శ్రీరామున్ని వనాలకు పంపించిందని సహేతుంగా నిరూపించారు. ప్రస్తుత సమాజ నడవడిక, దైనందిన జీవనంలో ప్రవర్తనలను గురించి కూడా రచయిత సందర్భానుసారంగా, చురకలు తగిలించారు. మంథర, దుర్బోధవల్ల కైకేయి తనకు అపనింద వస్తుందని తెలిసినా, కేవలం లోకహిత కాంక్షతో రామున్ని వనవాసానికి పంపమని కోరిందని లోకహిత కాంక్షతో రామున్ని వనవాసానికి పంపమని కోరిందని దుష్టశిక్షణ, శిష్టరక్షణ లక్ష్యంగా లోకహిత కాంక్ష దృష్ట్యా ఆమె ఉత్తమోత్తమురాలైన జననిగా నిందార్హురాలు కాదని పూజ్యురాలని డా॥ జయరాములు విశ్లేషించారు. తండ్రి దశరథుని ఆజ్ఞను తల్లి కైకేయి నోట విన్న శ్రీరాముడు, భరతునికి కావాలంటే ఒక రాజ్యం ఏమిటి? నా ప్రాణాలను, సంపదలను చివరకు సీతను కూడా సంతోషంగా నేనే ఇచ్చేస్తానన్న



ప్రతులకు:
డా॥బి. జయరాములు
ఫ్లాట్ నుం.11,
ఇ.నెం.1-3-176/35/22/11,
భాగ్యలక్ష్మినగర్,
కవాడీగూడహైదరాబాద్-500 080.

ప్రస్తావన కూడా పితృవాక్య పాలనా ధర్మ నిరతుడైన శ్రీరామచంద్రుని మహోన్నత "ధర్మోరక్షతి రక్షితః" ధృక్కోణంలో డా॥జయరాములు పేర్కొన్నారు. ఏది ఏమైనా ధర్మం గురించి లోతుగా తరచి చూస్తేగాని మనకు ప్రస్తుత సమాజానికి అర్థం కాదు. సమాజానికి కావలసింది కేవలం ధర్మబోధ కాదు. ధర్మాచరణ కావాలి. కేకేయితో భరతుడు విభేదించిన సంఘటనలో, కూడా భరతుడు పూర్తిగా లౌకిక ధర్మం ప్రకారం, తల్లి కైకేయిని దూషించాడని రచయిత పేర్కొన్నారు. "లోకహితం కోసం ప్రతి తల్లి పరితపించాలి. తానెంత మనోవేదన అనుభ వించినా లోకహితం కోసం కైక, రామున్ని వనాల కు పంపింది. ఆ తల్లి హృదయాన్ని రాముడొక్కడే అర్థం చేసుకోగలిగాడు. లోకాస్సమస్తాస్సుఖినోభ వంతు" అన్నారు. ముగింపులో.

సాహిత్యం, ఆధ్యాత్మిక తత్వవేత్త, ప్రవచన కోకిల బిరుదాంకితులు పలు అవార్డులు, పురస్కార గ్రహిత డా॥ బ్రాహ్మణపల్లి జయరాములు అద్భుత దృక్కోణంతో విద్యుక్త ధర్మ నిర్వహణలో మాతృమూర్తి కైకేయి పాత్రను శ్రీమద్రామాయణ ధర్మ ప్రవచన ప్రవక్తగా విశ్లేషించిన ప్రవచనధార చదువరులను ఆలోచింపచేస్తుంది. డా॥ జయరాములుగార్కి అభినందనలు.

–జయసూర్య
సెల్:9014948336

తెలుగు అనువాద శిఖరం జలజం

– సంస్మరణ సభలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత గోరటి ఎంకన్న

హైదరాబాద్, నవంబర్ 8:తెలుగు సాహిత్యరంగంలో అనువాద రచయితగా పేరుగాంచిన కవి, రచయిత, విద్యావేత్త జలజం సత్యనారాయణ అని వక్తలు ప్రశంసించారు. నవంబర్ 5 న మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని లిటిల్ స్కాలర్స్ హైస్కూల్ లోగల కాళోజీ హాల్ లో **"జలజం... ఒక జ్ఞాపకం"** పేరిట స్మారక సభను, కవిసమ్మేళ

ప్రజా ఆశీర్వాద సభకు మహారాష్ట్ర నాయకులు

ఆదిలాబాద్, నవంబర్ 8: జిల్లా కేంద్రంలో ఇవాళ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ప్రజా ఆశీర్వద సభకు రానున్న నేపథ్యంలో భారతీయ రాష్ట్ర సమితి మహారాష్ట్ర నాయకులు ముఖ్యమంత్రి సభకు భారీ సంఖ్యలో హాజరై మద్దతు తెలిపారు.

మహారాష్ట్ర వాసులు వినూత్నంగా కోవ లక్ష్మి ఫోటోలు ఉన్న బ్యానర్ వేసుకొని ఆకర్షించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి మాట్లాడుతూ మహారాష్ట్ర నాయకులు బీఆర్ఎస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఈ రోజు కేసీఆర్ సభకు హాజరయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గుస్సాడీ నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాంపల్లి శంకర్, బుర్ల పోచయ్య, ఇర్ఫాన్, మహారాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

'మేఘ గర్జన' పుస్తకావిష్కరణ

హైదరాబాద్, నవంబర్ 8:గుంటూరు నగరంలోని జె. ఐ. హెచ్. కార్యాలయంలో ముస్లిం రచయితల సంఘం ఆధ్వర్యంలో అబాబీల ప్రక్రియలో వర్ధమాన కవయిత్రి శ్రీమతి ఖుర్షిద్ బేగం రాసిన 'మేఘ గర్జన 'పుస్తకావిష్కరణ సభ జరిగింది.ఈ కార్యక్రమానికి ప్రముఖ కవి, అబాబీల సృష్టి కర్త కవి కరీముల్లా అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖకవి భూసురుపల్లి వెంకటేశ్వర్లు, విశిష్ట అతిథిగా నల్లూరి రుక్మిణి గారు, ఆత్మీయ అతిథిగా అబ్దుల్ రషీద్ (హైదరాబాద్)గారు పాల్గొన్నారు. 'మేఘ గర్జన 'పుస్తకాన్ని ముఖ్య అతిథి భూసురుపల్లి వెంకటేశ్వర్లు ఆవిష్కరిం చారు. వారు మాట్లాడుతూ సమాజం లోని అనేక సమస్యలపై హృదయానికి హత్తుకునేలా అబాబీల రూపంలో గర్జన చేశారని, చక్కని శైలితో సాగుతున్న కవయిత్రి మరింతగా అధ్యయనం చేసి ముందుకు సాగాలని సూచించారు. రుక్మిణి గారు తమ ప్రసంగంలో చరిత్రలో ఫాసీజం, మతతత్వం, నాగరికతపరిణామం గురించి విపులంగా వివరించారు. ఆత్మీయ అతిథి అబ్దుల్ రషీద్ గారు మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో ముస్లిం రచయితల కృషిని అభినందిం చారు.విశ సంస్కృతిలో కొట్టుకు పోతున్న నేటి సమాజాన్ని ఇస్లామియా వెలుగులో మార్గ నిర్దేశం చేస్తూ తమను తాము సంస్కరించుకుంటూ అన్నిమతాల వారితో సామరస్యంగా ముందుకు సాగాలని కవయిత్రి కోరుకోవడం అభినందనీయమని వక్తలు తెలిపారు.ఈ కార్యక్రమాన్ని మురసం రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ హకీంగారు పర్యవేక్షించగా, కార్యదర్శి ఎస్. ఎం. సుభాని, కోశాధికారి బషీర్ గర్తపురి, మీడియా కార్యదర్శి సుభాని నిర్వహించారు.రచయిత్రి ఖుర్షీద్ బేగం గారు తమ స్పందనలో అబాబీల ప్రక్రియలో 'మేఘ గర్జన 'రాయడానికి స్ఫూర్తి నిచ్చిన కవి కరీముల్లా గారికి, ప్రోత్సాహం అందించిన తన శ్రీవారికి కృతజ్ఞతలు తెలిపారు.ఇంకా ఈ కార్యక్రమంలో ఖాజావలి, రహీమ్ సాహెబ్, స్ఫూర్తి సుభాని, జాయద్ సాబ్, బతుల్ హుమైర్వి తదితరులు తమ అభినందనలు అందచేశారు.

తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ
సౌజన్యంతో
తెలుగు సాహిత్య కళాపీఠం
రి.నెం.139/2023
(సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవాసంస్థ)
13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు
తేది : 11-11-2023, శనివారం, ఉ॥ 9.00 గం॥లకు
కవి సమ్మేళనం, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉ॥ 11 గం॥లకు సభాకార్యక్రమం, పురస్కార ప్రదానం
సభాస్థలి : రవీంద్రభారతి సమావేశ మందిరం (మొదటి అంతస్తు), హైదరాబాద్.
ఆవిర్భావ దినోత్సవ ప్రతిభా పురస్కారాల ప్రదానం, కవి, పండిత విశిష్ట సత్కారం
జీవన సాఫల్య పురస్కార గ్రహీతలు
డా॥ తిరుసగరి రంగయ్య, భువనగిరి MBBS, FRCS - London
డా॥ పద్మజ, MBBS, DGO పద్మజ సంతాన సాఫల్య కేంద్రం, హన్మకొండ
శ్రీ జయసూర్య ప్రముఖ పాత్రికేయులు
ప్రొ॥ పీసపాటి వెంకటేశ్వర్లు విశ్రాంత ఆచార్యులు
సాంస్కృతిక కార్యక్రమాలు
కల్లూరి వెంకటేశ్వర్లు గారి
శిష్యబృందంచే తెలంగాణ నాట్యమేళం 'చరుతల రామాయణం' నృత్యప్రదర్శన
బతుకమ్మ రాజశేఖర్ కళాబృందంచే గానామృతఝరులు
'పేరడీ కింగ్', 'పేరడీ మారీడు'
పేరడీ గురువ్వామి గారిచే పేరడీ కామెడీ
'మీతోమేము' సంస్థ అధ్యక్షులు, పల్లె ప్రవీణ్
జానపద కళాబృందంచే జానపద పాటల పూదోట
డా॥ ఈటెల సుమన్న రచించిన
'సత్యదర్శనం' గ్రంథావిష్కరణ
సహృదయులు – రసహృదయులు – సరసహృదయులు
అందరూ ఆహ్వానితులే
సభా కార్యక్రమం
ముఖ్య అతిథి : డా॥ కె.వి.రమణాచారి గారు ఐ.ఏ.యస్. (విశ్రాంత)
గ్రంథావిష్కర్త : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు
సభాధ్యక్షులు : డా॥ పత్తిపాక మోహన్ గారు
రీజనల్ మేనేజర్, నేషనల్ బుక్ ట్రస్ట్, భారత ప్రభుత్వం
విశిష్ట అతిథులు : డా॥ మామిడి హరికృష్ణ గారు
తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు
ఆచార్య టి.గౌరీశంకర్ గారు
పాట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్
శ్రీ బైస దేవదాసు గారు
'నేటినిజం' పత్రికా సంపాదకులు
జ్యోతి ప్రకాశనం : డా॥ తిరుసగరి రంగయ్య గారు, భువనగిరి MBBS, FRCS - London
ఆత్మీయ అతిథులు : 'ధార్మిక వరేణ్య' శ్రీ కురిమిళ్ళ నరసింహ గౌడ్ గారు
సుప్రసిద్ధ బిల్డర్ & ప్రముఖ వ్యాపారవేత్త
'ధార్మిక వరేణ్య' డా॥ ఎంపల్ల బుచ్చిరెడ్డి గారు
చైర్మన్, న్యూక్లబ్ రోటరీ తెలంగాణ రీజియన్
గౌరవ అతిథులు : శ్రీ కె.వి.సుబ్రహ్మణ్యం గారు
ఎన్విరాన్ గ్రూప్స్, చైర్మన్
'విశిష్ట సేవాభూషణ్' శ్రీ బద్దం ధనంజయ గౌడ్ గారు
తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం, ఉపాధ్యక్షులు
శ్రీ మద్ది దివాకర్ రెడ్డి గారు
పద్మజా సంతాన సాఫల్య కేంద్రం ఎం.డి.
గ్రంథ సమీక్షకులు : శ్రీ కూర చిదంబరం గారు
సభా సమన్వయం : శ్రీ బతుకమ్మ రాజశేఖర్ గారు
వందన సమర్పణ : డా॥ చిక్కా దేవదాసు గారు
ఇందిరా గాంధి ఎక్సెలెన్సీ అవార్డు గ్రహీత
విశిష్ట ప్రతిభా పురస్కార గ్రహీతలు
విద్యా రంగం - ప్రొ. మృణాలిని O.U.
సాంస్కృతిక సేవా రంగం - రఘుశ్రీ
నృత్య రంగం - అనిల సంగెం
పత్రికా రంగం - తంగిరాల చక్రపర్తి
సేవా రంగం - కొట్టూరు అశోక్
బోధనా రంగం - రఘుప్రోలు శివశంకరాచార్యులు
సినీ సాహిత్యం - కాబా నాగేంద్రా చారి
బాలల హక్కులు - బండారు జయశ్రీ
గజల్ గానం - హిమబిందు రామం
సాహస క్రీడలు - కుమారి అన్వితా రెడ్డి
బాల సాహిత్య వికాసం - బైతి దుర్గం
అనువాద రంగం / స్కౌట్ సేవ - గుడ్ల పరమేశ్వర్
సాంస్కృతిక రంగం - జంగి సరేందర్ గౌడ్
బాల సాహిత్యం - డా॥ హారికా చెరుకుపల్లి
జానపదం - సోం పెంటేశ్
రచనా రంగం - పెద్దూరి వెంకటదాసు
పాత్రికేయత్వం - పులిమామిడి సద్గురు చారి
కవి సమ్మేళనంలో పాల్గొను కవులు, కవయిత్రులు
నిర్వహణ : 'అభినవ దాశరథి' శ్రీ దోరవేటి చెన్నయ్య గారు
కుడికాల జనార్దన్, పల్లి వెంకట సత్యమూర్తి
చిక్కా సర్దింహులు, శ్రీచరణ్ సాయిదాస్
పట్లాల అశోక్, చిలుక రాజలింగం
పెద్దూరి వెంకటదాసు, అక్కి సర్దింహులు గౌడ్
పడ్డేపల్లి విజయలక్ష్మి, రవీంద్ర బాబు
పోచం సుజాత, యం.మంజుల
డా॥ చీదెళ్ళ సీతాలక్ష్మి, కుడికాల పంశీధర్
అసుముల ప్రభాకరాచారి, రఘురాములు గౌడ్
డా॥ దాసి సాంబయ్య, మిర్యాల లక్ష్మి
గడ్డం శీను, గాజుల మధులత
పడ్డేపల్లి సర్దింగరావు, ఎం.అరుణ కుమారి
డా॥ పగిడిపల్లి సురేందర్, ఉప్పల రాధాకృష్ణ
సభానంతరం : 1:30 గం॥ల నుండి భోజనాలు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 979వ రోజు 'ఓటు' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. 'ఓటు' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా...

-సంపాదకులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
ఏకాంశ కవిత్వం నిర్వహణ:
-డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839



ఓటర్ కు సవాల్

పద్దెనిమిదేళ్లు నిండిన
ప్రతి భారతీయుడి హక్కు
ఓటు వేసి చూపించు
రాజ్యాంగం విలువను పెంచు!!.
మనీకి మద్యానికి లొంగక
తాయిలాలకు తావీయక
విలువలకు తిలోదాకాలిచ్చి
వలువలూడదీసే
దగాకోరుల దొంగ మాటలు
పక్కకు నెట్టి
ఓటనే వజ్రాయుధంతో
అధర్మాన్ని నరికివేయి!!.
ఓటు వేయడం మన కర్తవ్యం
ఓటు వేయడం మన విధి
ఓటు మన రాజ్యాంగ హక్కు
కులమతాలు లేని
జాతి రక్షణకు
నీతిమంతంగా ఓటేద్దాం!!.
చూపుడు వేలుకు
పెట్టిన చుక్క
చుక్కలు చూపించాలి దుర్మార్గులకు
ఒక్క ఓటే
అభ్యర్థి తలరాతను మార్చెయ్యొచ్చు!!.
నువ్వు నేను కలిస్తేనే సమాజం
మంచి సమాజాన్ని నిర్మించుకుని
రాజ్యాంగాన్ని
సమర్థవంతంగా నిర్వహించాలన్నా
పటిష్టమైన ప్రభుత్వాన్ని
ఏర్పర్చుకోవాలన్నా
ఓటుహక్కు ఉన్న
ప్రతి పౌరుడు
ఓటు వేయడం మరవద్దు
బడా చోరు నాయకులను
తారుమారు చేయాలంటే
వెనక్కి పోకు
ఓటువేయ కదిలిరా ముందుకు!!.
నోటుకు అమ్ముడు పోకు
తాగుడుకు తాకట్టు పెట్టకు
ఆ ప్రవాహంలో కొట్టుకుపోకు!!.
భవిష్యత్ తరాల కోసం
భారత దేశం ప్రపంచంలో
ఉన్నతస్థానంలో ఉండాలంటే
ఐదేళ్లకోసారి ఓటరుకో సవాల్!!.
నీతి లేని నాయకుణ్ణి
గద్దె దించాలంటే
ఎన్నికలపుడే
ఓటు వేయాలి
సమయం చూసి కాటెయ్యాలి!!.
ప్రశ్నించే హక్కును పెంచుకోవాలి
ఓటు రాజాలా
ధైర్యంగా వేసి
నచ్చిన నాయకుని ఎన్నుకోవాలి!!.
ఓటు హక్కును వినియోగించటం
మన విధ్యుక్త ధర్మం
మన బాధ్యత
ప్రజాస్వామ్యంలో
ప్రజాప్రతినిధిని ఎన్నుకోవడం
మన హక్కు
ప్రపంచంలోనే అతి పెద్దదైన
ప్రజాస్వామ్య దేశంలో
ఒక పౌరునిగా జన్మించినందుకు
గర్విద్దాం
తప్పక ఓటేద్దాం!!.

-డా.చీదెళ్ళ సీతాలక్ష్మి

ఏమంటావ్?

కులం మతం అంటావ్!
భూమి నాదంటావ్!
భరత మాత బిడ్డనంటావ్!
వ్రతాలు! నోములు!
దీక్షలు! నమాజులు!
శాంతి ప్రార్థనలు! చేస్తావ్!
అన్నీ చేసి!
ఎంతో చదివి!
రాజ్యాంగ దీక్ష చేయలేవు!
లౌకిక తత్వ మననం పఠనం చేయలేవు!!
ఓటు విలువ తెలిసినా!
ఏదో ఆశపడి
అమ్ముడు పోతావు!!
చదువు లేదని!
ఏమిస్తారాని!
నోటు ఇస్తేనే వేస్తానని!
కిల కిల నవ్వుతూ!
సిగ్గువిడిచి చెప్పుకుంటావు!!
బాధ్యత మరచి
రాజ్యాంగానికి తూట్లు పొడిచి
చంకలు గుద్దుకుంటావు!!
పౌరుడివా నువ్వు!
రాజ్యాంగ భక్షకుడివా!!
నీతిలేక!
ప్రాథమిక విధులు పాటించక!
ఓటు విలువ చెప్పక!
నీతి రాజకీయ సూత్రానికి పట్టం కట్టక!
ఈ లౌకిక ప్రజాస్వామ్య!
ఘనతంత్ర! సౌభ్రాతృత్వ! సామ్యవాద!
భిన్న సాంస్కృతిక!
సుసంపన్న!
వేదమయ!
మానవత్వ సుశోభిత!
నియమ కీర్తి చరిత!
ఘనత భారత చరిత!
ఈ నా భారత దేశ పౌరుడిగా
చలామణి ఎట్లా?
హక్కుల కోసం పోరాడే నువ్వు!
విధులను పాటించకపోతే
రాజ్యాంగం పక్కున నవ్వుతుంది!
ఓటు ఘనత తెలుసుకొని!
తెలియచెప్పి!
చెవులు పిండి బుద్ధి చెప్పి!
ఎవ్వరికీ ఓటు వెయ్యనని
చేతులు కట్టుకొని దీక్ష పూనిన
కొందరికి!
నిజమైన నాయక ఎన్నిక!
పవిత్ర ప్రజా సేవ దీక్ష రాజకీయ కీర్తికి!
దక్షతకు చైతన్యం తీసుకురావాలని!..
చేయాలి ప్రతిజ్ఞ!!
చేయాలి ప్రజాస్వామ్య పరిరక్షణ!!
ఓటుకు చేయాలి పట్టాభిషేకం!!
జయహో భారత్!!!!.

-జె.నరసింహారావు

ఓటు విలువ

పల్లవి: అయ్యలారా, అమ్మలారా!
వినరారండి
అన్నలారా, అక్కలారా!
కనరారండి
తమ్ముల్లారా, చెల్లెల్లారా!
తెలుసుకోండి.
ఓటు విలువను
మీ ఓటు విలువను.
స్వరాజ్యం మన జన్మ హక్కని
చాటినారు మనవారు ॥ అయ్య॥
చరణం 1: ఓటనేది నీ బాధ్యతని
దేశాభివృద్ధే మూలమని
తెలుసుకొని నువు మసలుకో
సరియైన నాయకుని ఎన్నుకో ॥ ఓట॥
చరణం 2: నోటుకు ఓటును మానుకో
నువు నీతిగా ఓటును పంచుకో॥ఓట॥
స్వార్థాన్ని వదులుకో
సమాజ బాగు నువు కోరుకో॥స్వార్థాన్ని॥
వేలుని గుడ్డిగా వాడకు
కళ్ళున్న అంధుడిగా మారకు.. ॥వేలుని॥
//అయ్యలారా, అమ్మలారా వినరారండి//
చరణం 3: ఆదమరచి గుర్తు నొక్కకు
ఆలోచించి నువు ఓటెయ్యరా ॥ఆద॥
ఎండమావులకు మురువకు
భ్రమలోన పడి నువు బతకకు॥ఎండ॥
ధర్మాధర్మాలు గుర్తించుకో
ఓటుతోనే నువు సరిచేసుకో॥ధర్మా॥
చరణం 4: ఐదేళ్ల పాలనే అని అనుకోకు
నువు అణచబడతవని మరవకు॥ ఐదేళ్ల ॥
//అయ్యలారా, అమ్మలారా వినరారండి//

– పోచం సుజాత

సామాన్యుడి వజ్రాయుధం

ఓటు
సామాన్యుడి చేతిలో వజ్రాయుధం
సరిగా ఉపయోగిస్తే
జీవితం స్వర్గధామం
లేకుంటే అధోగతి
నోటుకు ఓటు వేస్తే
ప్రజాస్వామ్యానికి చేటు
కులాలకు మతాలకు
మందుకు
బంధుప్రీతికి
జనం దాసోహం అంటే
సమాజ ప్రగతి పతనం వైపు
రకరకాల పథకాలతో
జనాన్ని
బిచ్చగాండ్లను
చేయజూస్తారు
ఉద్యోగాల కల్పన
స్వయం ఉపాధి సంగతే
మరచి పోతారు
విద్య వైద్యం అందని ద్రాక్షాయే
ఒక్కొక్క దానికి ఒక్కొక్క రేటాయే
సర్కారు నియంత్రణ లేకపాయే
పేదవాని కోపం
పదవికి చేటాయే
నాయకుల వాగ్దానాలు
ఎండమావే
శుష్క వాగ్దానాలకు మోసపోకు
ఐదేండ్లదాక భంగ పడకు
ఓటును అమ్ముకోకు
దేశాన్ని అమ్ముకునే
అవకాశమివ్వకెవరికి
నీకోసం కాకున్నా
నీ పిల్లల కోసం
ఉజ్వలమైన సమాజం కోసం
నిజాయితీగా ఓటు వేయాలి

ఓటు విలువ

ఓటు విలువ తెసుసుకో
నోటుకమ్మడం మానుకో.
ఓటుతో ఇబ్బందులు తీర్చుకో
బాధామయ జీవితాన్ని మార్చుకో.
ఓటుతో కలలు పండించుకో
ఆటుపోటులను దిందేసుకో.
మంచి చెడులను తెలుసుకో
మంచి తనాన్ని నెగ్గించుకో.
కష్ట సుఖాలను నెమరేసుకో
ఓటుతో వాటిని కడిగేసుకో.
పరిసరాలను పరిశుభ్రంగుంచుకో
పట్టుదలతో ఓటును పదిలంగేసుకో.
ఊరి అభివృద్ధి ఊహించుకో
నందనవనంగా మార్చుకో.
సమాజాన్ని చైతన్యపరుచుకో
సమసమాజాన్ని చక్కగా నిర్మించుకో.
స్వార్థ పరులను హద్దులో నుంచుకో
నిస్వార్థ పరులను
ముద్దుగా గెలిపించుకో.
కుల మతాలను దూరంగా ఉంచుకో
కుటిల రాజకీయ కుళ్లును పెకిలించుకో
రాష్ట్రాన్ని రత్నంగా మార్చుకో
ఓటును జాతి వృద్ధికై తీర్చిదిద్దుకో.



-గుడికందుల ప్రకాశం

భవిత

ఓటు
ప్రజాస్వామ్యానికి వెన్నెముక
ఓటరుకి వజ్రాయుధం
ఓటర్లు
నిజమైన ప్రజాస్వామ్య రథసారథులు
ప్రజాస్వామ్య పాలకులు
యథా ప్రజా తథా రాజా
ప్రజలు ఎలాంటి వారైతే
రాజు అలాంటివాడవుతాడు
మంచివారిని ఎన్నుకోవాలి
ప్రజలు తమ ఓటుతో
చెడ్డవారికి రాజ్యాధికారం
దక్కరాదు
ప్రజలంతా మేధోశక్తితో
సచ్చీలురనే ఎన్నుకోవాలి
రాష్ట్రానికి దేశానికి
మంచి చేసే వారిని ఎన్నుకోవాలి
మోసగాళ్లను దోపిడీదారులను
రౌడీలను గుండాలను
ఎన్నుకోరాదు
ఎటువంటి ప్రలోభాలకు
లోను కాకూడదు
ఒక్కసారి తప్పు చేస్తే
ఆ లోటు తిరిగి పూడ్చలేనిది
విచక్షణతో ఆలోచించి
ఓటును వినియోగించు
అప్పుడే రాష్ట్రానికి దేశానికి భవిత.

– శనగపల్లి ఉమామహేశ్వరరావు

జర జాగ్రత్త!

ఆ వజ్రాయుధాన్ని
చేతబూనినా గాని
అలసిన కన్నుల్లో
కలలకు కొదవేలేదు
తరుముకొస్తున్న
సమస్యల వలయాల్ని
ఛేధించేందుకు
సరిపడా సమయమున్నా
పాడుపడ్డ ఆశలకు తలొగ్గే
మనుషులతోనే భేజారే.
చేజేతులార
చేసుకున్న పాపానికి
కబళించే రాబందులను
పెంచి పోషించడమే
నీకు అందిన ముల్లెలకు
బహుశా నీ నిర్ణయం కరెక్టే కావచ్చు
కానీ..
పాషాణ ప్రపంచంలో
పాపపు మృగాలున్నాయి మరి.
మనల్ని మనం
దహించుకునే సంస్కృతికి
తెర తీసినప్పుడే సిగ్గుపడాల్సింది
అంతా జరిగాక
ఆలోచించి ఏం లాభం
ఇక పాలనకు భయపడితే
ఒక్కోసారి జీవితం జరగడమే
గగనమవుతుంది.

న్యాయానికే మీ ఓటు

ఓకనాడు ఆంగ్లేయుల
కబంధ హస్తాల్లో చిక్కుకొని
కాలికింది చెప్పుల్లా
నలిగిపోయిన రోజులు
ఏమయ్యాయి?
అప్పుడే మర్చిపోయారా!.
ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చుకొని
లాఠీ దెబ్బలుతిని
చెరసాలలో మగ్గి
సర్వం త్యాగం చేసి
అరటిపండును
ఒలచిపెట్టినట్లు
మనచేతిలో పెట్టిన
మహనీయులను
అప్పుడే మర్చిపోయారా!.
ఏమాత్రం తప్పు చేసినా
మరో ఐదేళ్లు
అనుభవించక తప్పదు భారీ మూల్యం
అందుకే ఓ ఓటరన్నలూ...
కాసులకు లొంగకండి
మందుకు చలించి
బానిస బతుకులు బతకకండి
ఓటును సద్వినియోగం చేసుకోండి
భావితరానికి ఆదర్శంగా నిలవండి
ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టండి.

-ఎం. వీరకుమారి

తెలివిగా వేసుకో విలువైన ఓటును

కబుర్ల కనకాభిషేకాలు
కడుపునింపవు ఓటరా!
శుష్క వాగ్దానాలు
నీటిమూటలే సుమా
మేక వన్నె పులులు
పొంచి ఉన్నాయి తెలుసుకో
నిజాన్ని గమనించి
నిర్భయంగా నిర్ణయం తీసుకో.
మందు ప్రేమ
నిన్ను ముంచేస్తుంది ఓటరా
సమాజాన్ని నిలుపునా
దహించివేస్తుంది సుమా
అమ్ముకున్న నీ ఓటు
నీ తల్లికి కట్టిన వెలరా తెలుసుకో
నిజాయితీగా నిలచి
నీ జీవితంలో వసంతం నింపుకో
చేతిలో రాలే కాసులు
మిణుగురు పురుగు వెలుగులే ఓటరా
నీ జీవిత అంధకారాన్ని
తొలగింపలేవు సుమా
కాసులు కరగిపోయాక
కన్నీళ్లే మిగులును కదరా
వాస్తవాన్ని గమనించి
మనిషిగా మసలుకో
భరతమాతను సేవింపకున్న
క్షమించును ఓటరా
ఓటునమ్ముకుని భరతమాత ఆగ్రహానికి
బలవకు ఓటరా-డా. దేవులపల్లి పద్మజ

వినియోగించుకో!

మానవుల తలరాతను రాసింది
ఆ వాణీపతియైన పద్మజ భవుడు
నేతల తలరాతను మాత్రం రాసేది
ఈ ఓటరనే మహానుభావుడు.
ఓటు ఓటు అంటూ
నోటును ఎరవేసి,
కాసులను
కానుకలను
కళ్ళముందు కదిలించి
భయపెట్టి
బెదిరించి
మందు పోసి మత్తెక్కించి
తిండి పెట్టి
ఆశ పెట్టి
సామ దాన భేద
దండోపాయాలు
నీ పైన ఎక్కుపెట్టి
ఓటును దక్కించుకునే
నేతల కుయుక్తులను
గుర్తెరుగక గుద్దావా ఓటు.
జుట్టు చేతికిచ్చి
కాళ్ళు గంతులేసినట్టు
కుడితిలోని ఈగలాగా
బతకలేక
చావురాక
స్వార్థ నేతల కుతంత్రాలకు
బలైపోక తప్పదు
పౌరులు మాత్రమే కాదు
దేశ పురోగతి కూడా
అయిదేళ్ళు అధోగతే.
వేయాలంటే బాట
నీ బంగారుభవితవ్యానికి
నీ స్వేచ్ఛా వ్యక్తిత్వానికి
ఓటే నీ తూటా
లేదు మరో మాట.
ఓటు విలువ తెలుసుకో
దేశ ప్రగతి కోరుకో
హక్కును వినియోగించుకో
సమర్థ నాయకత్వమెంచుకో.



-విజయలక్ష్మి శ్రీనివాస్

ప్రజాస్వామ్యం అంటే
కోపావేశపు కొట్లాటల్లాగా
వేలికొనలతో ఆడే
జూదం కాకూడదు కదా
ఒక్కో రేకు రాలిన
గులాబీల అందమంతా
నేలపాలు అయినట్లు
ఆలోచన లేని ఎన్నిక
బురదలో పోసిన పన్నీరే
మోసపూరితమైన వాగ్దానాలన్నీ
ఎన్నటికున్నా నిన్ను ముంచేత్తేవే
రంగులు మార్చే
అసలైన రంగస్థలం మీద
ఆట మళ్లీ మొదలు కాబోతోంది
అందుకే జర జాగ్రత్త!.

-శ్రీలత రమేశ్ గోస్కుల

సచ్చీలురనే చట్ట సభకు పంపాలి
ఓటును నమ్ముకో
అశ్రద్ధ చేయకూ
అందరూ ఓటుహక్కును
విధిగా వినియోగించు కోవాలి
ఓటు రక్షణ కవచం కావాలి
ధనాన్ని త్యజించి
గుణానికే పట్టం కట్టాలి
ప్రజాసేవకులే పాలకులై
అంతరాలు లేని సమాజంలో
అందరూ హాయిగ బతకాలి
చేతులు కాలినంక
ఆకులు పట్టుకుంటే లాభముండనట్లే
ఎన్నికలైపోయినంక
ఎవరూ చేసేదేముండదు
దీపముండగానే ఇల్లు
చక్కదిద్దు కొన్నట్లు
ఓటు వేసే ముందే
జాగ్రత్త పడాలి
ప్రజాస్వామ్యం
పదికాలాలపాటు
బలహీనులకు అండగా నిలవాలి.

-గుండం మోహన్ రెడ్డి



ఆదివారం ముంబాయిలోని రచయిత యెల్లి సుదర్శన్ పద్మశాలి స్వగృహంలో "యెల్దిమాట శుభ సంకేతం" సంపుటి ముఖచిత్రం ఆవిష్కరణలో పాల్గొన్న ఆచార్య టీ. గౌరీశంకర్, భోగ సహదేవ్, ఆరుట్ల మల్లేశ్, నడిమెట్ల ఎల్లప్ప, రాంపెల్లి రాజ్‌పాల్, జక్కని గంగాధర్

దీపావళి పర్వదిన విశిష్టత

భారతదేశం వసుదైక కుటుంబం పురాణకాలం నుండి ఆచార సాంప్రదాయలకు పుట్టినిల్లు. అటువంటి ఆచారాలలో మనం పాటించే వాటిలో పండుగలు ముఖ్యమైనవి.అలాంటి పండుగలలో దీపావళి ఒకటి. జగతిని జాగృత పరచే చైతన్యదీప్తుల శోభావళి దీపావళి.

ఈ దీపావళి పండుగ ఆశ్వీయుజ మాసం చతుర్దశి నాడు నరక చతుర్దశిగా మరునటి దినం అమవాస్యనాడు దీపావళిగా జరుపుకుంటారు. ద్వాపరయుగం నుండి ఈ పండుగ జరుగు తుంది. పండుగ పూర్వకథని గమనిస్తే కృతయుగంలో హిరణ్యాక్షుడు అనే రాక్షసుడు వర గర్వంతో సాధుజనులను పీడించేవాడు. తన అహంకారంతో భూదేవిని ఎత్తుకెళ్ళి పాతాళంలో దాచాడు.ఆగ్రహించిన విష్ణుమూర్తి దశావతారాలలోని మూడవ అవతారం అయిన వరాహస్వామి అవతారంలో వెళ్ళి పాతాళంలో హిరణ్యాక్షుడుతో యుద్ధం చేసి భూదేవిని రక్షించాడు. అప్పుడు వరాహస్వామి భూమాత మోహానికి గుర్తుగా వారికి జన్మించినవాడు నరకాసురుడు. వరాహస్వామి భూమాత నిషిద్ధసమయంలో కలవడం వలన అసురసంధ్యా సమయంలో జన్మించడంతో నరకాసురుడికి పుట్టుకతో రాక్షస లక్షణాలతో జన్మించాడు. ఇది తెలిసిన భూమాత

అతన్ని విష్ణుమూర్తీ సంహరిస్తాడని తన బిడ్డ చావు తన చేతిలోనే ఉండాలని వరం విష్ణుమూర్తీ వద్ద వరం తీసుకుంటుంది. తర్వాత నరకాసురుడిని జనకుడు అనే రాజుకి అప్పజెప్పి విద్యాబుద్ధులు నేర్పించ మంటుంది భూమాత.జనకుడు నరకాసురుడికి మంచి విద్యాబుద్ధులు నేర్పించి రాజును చేస్తాడు. నరకుడు కామాఖ్యను రాజధానిగా చేసుకొని ప్రాగ్జ్యోతిష్యపురము (ప్రస్తుతం అది అస్సాంలోని గౌహతి ప్రాంతం) అనే రాజ్యాన్ని పరిపాలిస్తుంటాడు. కామాఖ్యలోని అమ్మవారిని తల్లిలాగ భావిస్తు చక్కగ పూజచేసేవాడు.తన రాజ్యములోని ప్రజలందరిని ఎంతో చక్కగ పరిపాలించేవాడు. ఈ విధముగా కొన్ని యుగాలు గడిసిపోయాయి.తర్వాత ద్వాపరయుగములో, అతనికి పక్క రాజ్యమైన శోణితపురముకు రాజైన 'బాణాసురునితో 'స్నేహము ఏర్పడుతుంది.బాణాసురుడు స్త్రీలోలుడు.వారిపై బలాత్కారం చేసేవాడు. అతని దృష్టిలో స్త్రీ ఒక భోగవస్తువు.అతనితో నరకాసురుడు స్నేహం చేశాడు.అతని ప్రభావము చేత నరకాసురుడు మెల్లగా అమ్మవారి పూజ ఆపివేశాడు. ఇంకా అతనిలో పుట్టుకతో వచ్చిన రాక్షస లక్షణాలు బయటకి వచ్చాయి.నరకాసురుడు కామ పిశాచి అయ్యి ప్రపంచములోని ఇతర రాజ్యాల మీద దండయాత్ర చేసి ఆయా రాజ్యాలలోని రాజకుమార్తెలందరిని బలవంతముగా ఎత్తుకొచ్చి తన రాజ్యములో బంధించి వివాహమాడదలిచాడు.ఆ విధముగా 16,0000 మంది రాకుమార్తెలను బంధించాడు. వరాహస్వామి దేవేరి-భూదేవికి కలిగిన సంతానమే 'నరకాసురుడు'. దేవపుత్రుడే అయినా.. పుట్టిన వేళా విశేష ఫలింతంగా నరకాసురుడిలో రాక్షసత్వం నిండిపోతుంది. తరువాతి కాలంలో నరకాసురుడు 'కామ రూపాధిపతి'గా మారతాడు. తనను తాను అత్యంత బలవంతుడిగా భావించుకుంటాడు. వరగర్వంతో సకల లోవాసులను... దేవతలనూ విడిచి పెట్టకుండా అందరినీ హింసించడం ప్రారంభిస్తాడు. .దీంత